**జర్నలిస్టులు కావలెను**

క్రైం కౌంటర్ తెలుగు దినపత్రిక గత 15 సంవత్సరాలుగా పత్రికా రంగంలో ప్రత్యేక గుర్తింపు కలిగిన క్రైం కౌంటర్ తెలుగు దిన పత్రికలో పనిచేసేందుకు ఆసక్తి, అనుభవం కలిగిన జర్నలిస్టులు కావలెను.



APTEL /25/A2478

# క్రైం కౌంటర్

webisite:www.crimecounter.in ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం తెలుగు దిన పత్రిక

గుంటూరు | సంపుటి : 02 సంచిక : 247 శనివారం 16- 05 - 2026 పేజిలు : 4 వెల. 2/-



**రిపోర్టర్లు కావలెను**

క్రైం కౌంటర్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో
- జిల్లా బ్యూరోలు
- జిల్లా ఇన్‌చార్జులు
- నియోజక వర్గ ఇన్‌చార్జులు

కావలెను.

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

98497 07349




## మోదీ ప్రభుత్వంపై రాహుల్ ధ్వజం

**ఇంటర్నెట్ డెస్క్, మే 15 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నీట్ పరీక్షలకు సంబంధించిన ఆత్మహత్య ఘటనలపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పరీక్షల కుంభకోణాలు, అవినీతి కారణంగా విద్యార్థుల భవిష్యత్తు నాశనమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా రాహుల్ గాంధీ పోస్టు పెట్టారు.

విద్యార్థులు ఓడిపోలేదు..

లఖింపూర్ ఖేరీకి చెందిన 22 ఏళ్ల హృతిక్ మిశ్రా చివరిసారిగా 'నేను ఇకపై పోటీ పరీక్షలు రాయను' అని చెప్పిన మాటలను ప్రస్తావిస్తూ రాహుల్ గాంధీ భావోద్వేగానికి గురయ్యారు. మూడోసారి నీట్ పరీక్ష రాస్తున్న హృతిక్, పరీక్ష రద్దు కావడంతో తీవ్ర మనోవేదనకు గురై ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే గోవాలో కూడా నీట్ పరీక్ష రాసిన మరో విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నారని గుర్తుచేశారు. ఈ ఘటనలు కేవలం ఆత్మహత్యలు కావని, అవినీతి వ్యవస్థ చేసిన హత్యలని రాహుల్ గాంధీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. 'పరీక్ష చేతిలో విద్యార్థులు ఓడిపోలేదు.. అవినీతి వ్యవస్థ చేతిలో బలయ్యారు' అని ఆందోళన వ్యక్తం చేశారు.

2లో



# నీట్ పరీక్ష విధానంలో కేంద్రం కీలక నిర్ణయం

**హైదరాబాద్, మే 15: క్రైం కౌంటర్ ప్రతినిధి,** నీట్ పేపర్ లీక్ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వచ్చే ఏడాది నుంచి నీట్ పరీక్షను పూర్తిగా ఆన్‌లైన్ విధానంలోనే నిర్వహించనున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ శుక్రవారం (మే 15) మీడియాకు వెల్లడించారు. విద్యార్థుల భవిష్యత్తు, పరీక్షల పారదర్శకతకు మొదటి ప్రాధాన్యత ఇస్తామని ఈ సందర్భంగా ఆయన అన్నారు. మే 3న జరిగిన పరీక్ష రద్దు కావడంతో.. తిరిగి జూన్ 21న రీ-ఎగ్జామ్ నిర్వహించనున్నట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీయే) ఈ రోజు ప్రకటించింది. ఈ క్రమంలోనే ఆయన మీడియా సమావేశంలో వెల్లడించారు. రీఎగ్జామ్ పెన్‌పేపర్ విధానంలోనే ఉంటుందని స్పష్టం చేశారు. పరీక్షను నిష్పక్షపాతంగా, దోషరహితంగా నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని అన్నారు. పేపర్ లీక్ ఎలా జరిగిందనేదానిపై పూర్తి వివరాలను త్వరలోనే బహిర్గతం చేస్తామని, బాధ్యులపై కఠిన చర్యలు ఉంటాయని మంత్రి తెలిపారు. జూన్ 21న జరిగే రీ-టెస్ట్ కోసం విద్యార్థులు ఎలాంటి అదనపు ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదని, పరీక్ష రాసేందుకు విద్యార్థులు నచ్చిన నగరాన్ని ఎంచుకునేందుకు వారం రోజుల సమయం ఇస్తామన్నారు. జూన్ 14న నీట్ రీ-ఎగ్జామ్ అడ్మిట్ కార్డులను విడుదల చేస్తామని మంత్రి తెలిపారు. జూన్ 21న జరిగి ఈ పరీక్షలో ఎలాంటి మాల్‌ప్రాక్టీస్‌కు తావులేకుండా కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. మెరుగైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. పరీక్షకు సంబంధించిన సమాచారం అధికారిక వెబ్‌సైట్‌లోనే తనిఖీ చేసుకోవాలని, సోషల్ మీడియాలో వచ్చే పుకార్లను నమ్మి విద్యార్థులు ఆందోళన చెందవద్దని ఎన్టీయే విజ్ఞప్తి చేసింది. పరీక్షా ప్రక్రియకు సంబంధించిన సందేహాల కోసం అభ్యర్థులు చీూా అధికారిక హెల్ప్‌లైన్ నంబర్లు 011-40759000 లేదా 011-69227700 ద్వారా సంప్రదించవచ్చు. సందేహాలను neet-ug@nta.ac.in ఈమెయిల్ చిరునామాకు కూడా పంపవచ్చు.

మరోవైపు మే 3న జరిగిన నీట్ పరీక్ష రద్దు కావడంతో విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొంది. తక్కువ సమయంలో మళ్లీ సిద్ధమవ్వాలంటే ఒత్తిడి, అనిశ్చితి, ఆందోళనల గురించి చాలా మంది అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేశారు. అటు సీబీఐ తన దర్యాప్తును ముమ్మరం చేసి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీలోని ఇంటి దొంగలను పట్టించే పనిలో మునిగిపోయింది.

## ఇంధనం పొదుపు చర్యలపై సుప్రీం కీలక నిర్ణయం..



**న్యూఢిల్లీ, మే 15 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** ప్రస్తుత పెట్రోలియం సంక్షోభాన్ని దృష్టిలో ఉంచుకుని సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. ఇంధన పొదుపు చర్యలపై నిర్దిష్టమైన రోజుల్లో వర్చువల్ తరహాలో కోర్టు ప్రొసీడింగ్స్ జరపనున్నట్టు ప్రకటించింది. అత్యున్నత న్యాయస్థానం నిర్ణయం ప్రకారం, ప్రతి సోమవారం, శుక్రవారాల్లో సుప్రీంకోర్టులో వర్చువల్ విచారణ జరుగనుంది. తక్కిన మూడు పనిదినాల్లో హైబ్రిడ్ మోడల్ (ముఖాముఖీ తరహా)లో విచారణ చేపడుతుంది. ప్రస్తుత ఇంధన సంక్షోభ పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని సీజేఐ సూర్యకాంత్ ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇంతవరకూ కోర్టు ప్రొసీండింగ్స్‌ను ఫిజికల్ అప్పియరెన్స్, వర్చువల్ తరహాలో సుప్రీంకోర్టు నిర్వహిస్తోంది. ప్రధాన నరేంద్ర మోదీ ఇటీవల జాతీ ప్రయోజనాల దృష్ట్యా వర్క్ ఫ్రం హోం చర్యలు, ఇంధన పొదుపు చర్యలకు సంబంధించిన తగిన సూచనలు చేశారు. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు తాజా నిర్ణయం తీసుకుంది.


## ఎక్స్‌లో పవన్ కల్యాణ్ స్పందన



**అమరావతి, మే 15 క్రైమ్ కౌంటర్ న్యూస్):** శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలో ఏఎంసీఏ ప్రాజెక్టుకు కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేశారు. పుట్టపర్తిలో రూ. 15,803 కోట్ల పెట్టుబడితో ఫైటర్‌జెట్ల తయారీ కేంద్రం ఏర్పాటు కానుంది. ఈ ప్రాజెక్టు ద్వారా 7,500 మంది ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఏఎంసీఏ ప్రాజెక్టుపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందించారు. ఆత్మనిర్భర్ భారత్ నిర్మాణానికి, పరివర్తనాత్మక జాతీయ కార్యక్రమాల ద్వారా రాష్ట్రాలకు సాధికారత

2లో

## నీట్ విద్యార్థి రితిక్ ఆత్మహత్యకు బాధ్యులెవరు?:



2లో



## బంగారం ఉత్పత్తికి చిరునామాగా ఏపీ: సీఎం చంద్రబాబు

**శ్రీసత్యసాయి జిల్లా, మే 15 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** పుట్టపర్తి దేశం గర్వించే వ్యూహాత్మక రక్షణ కేంద్రంగా మారుతోందని సీఎం చంద్రబాబు అన్నారు. పుట్టపర్తిలో ఏఎంసీఏ ప్రాజెక్టుకు కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్,

2లో



## డ్రోన్ టెక్నాలజీ గేమ్ ఛేంజర్:

**పుట్టపర్తి, మే 15 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** యుద్ధరంగంలో డ్రోన్ టెక్నాలజీ గేమ్ ఛేంజర్ అని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ వ్యాఖ్యానించారు. ఆర్థిక, వ్యవసాయ శాఖల్లో డ్రోన్ కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. ఏపీలో రూ.480 కోట్లతో భారత్ డైనమిక్స్ లిమిటెడ్ ప్రారంభిస్తున్నామని

2లో


గుంటూరు, ప్రకాశం, విజయవాడ, కాకినాడ, అనంతపూర్, కడప ఎడిషన్లతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వ్యాప్తంగా వెలువడుతున్న క్రైం కౌంటర్ దినపత్రికలో వ్యాపార ప్రకటనలకు సంప్రదించండి. 9849707349

# మోదీ ప్రభుత్వంపై రాహుల్ ధ్వజం

148 పరీక్షల కుంభకోణాలు..

2015 నుంచి 2026 వరకు దేశవ్యాప్తంగా 148 పరీక్షల కుంభకోణాలు వెలుగుచూశాయని రాహుల్ గాంధీ ఆరోపించారు. వాటిలో 87 పరీక్షలు రద్దయ్యాయని, దాదాపు 9 కోట్ల మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రభావితమైందని పేర్కొన్నారు. ఈ 148 కుంభకోణాల్లో కేవలం ఒక్కరికే శిక్ష పడిందని, సీబీఐ 17 కేసులు, ఈడీ 11 కేసులు నమోదు చేసినప్పటికీ ఎవరూ బాధ్యత వహించలేదని విమర్శించారు. ప్రత్యేకంగా నీట్, ఏఐపీఎంటీ, ఇతర వైద్య ప్రవేశ పరీక్షల్లోనే 15 కుంభకోణాలు జరిగాయని అన్నారు. ఈ వ్యవహారాల్లో బాధ్యులైన అధికారులు, మంత్రులు రాజీనామా చేయకపోవడం అత్యంత సిగ్గుచేటని ధ్వజమెత్తారు. కొందరిని తొలగించినట్లు చూపించి, తిరిగి ఉన్నత పదవుల్లో నియమిస్తున్నారని ఆరోపించారు.

ఎవరినీ వదిలిపెట్టం..

'మోసానికి సహకరించే వారికి బహుమతులు లభిస్తుండగా, పరీక్షలు రాసే పిల్లలు ప్రాణాలు కోల్పోతున్నారు' అంటూ మోదీ ప్రభుత్వంపై రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు గుప్పించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీని ఉద్దేశించి, 'మీలో జవాబుదారీతనం మేల్కొనడానికి ఇంకా ఎంతమంది హృతిక్‌లు కావాలి?' అని ప్రశ్నించారు. విద్యార్థుల బాధ తన బాధ అని, వారి భవిష్యత్తును దోచుకున్న వారు తప్పకుండా సమాధానం చెప్పాల్సి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. 'ఎంత కాలం పట్టినా సరే, ఎవరినీ వదిలిపెట్టం. ఈ యుద్ధాన్ని మనం కలిసి పోరాడదాం.. మనం గెలుస్తాం' అంటూ రాహుల్ గాంధీ పేర్కొన్నారు.

# ఎక్స్‌లో పవన్ కల్యాణ్ స్పందన

కల్పించడానికి అచంచలమైన నిబద్ధత కనబరుస్తున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి పవన్ కృతజ్ఞతలు తెలియజేశారు.

పవన్ ట్వీట్..

'రక్షణ, ఏరోస్పేస్, డీప్ టెక్నాలజీ రంగాలలో ఆంధ్రప్రదేశ్ ఒక శక్తి కేంద్రంగా మారే ప్రయాణంలో ఇది ఒక కీలకమైన మైలురాయి. రూ.15,800 కోట్ల పెట్టుబడితో 650 ఎకరాలలో ఎయిర్‌క్రాఫ్ట్ ఇంటిగ్రేషన్ ఢ ఫ్లైట్ టెస్ట్ సెంటర్‌తో పాటు ప్రధాన రక్షణ, డ్రోన్ ఎకోసిస్టమ్ ప్రాజెక్టులను స్థాపించడం అనేది, నవకల్పన ఆధారిత వృద్ధి, వ్యూహాత్మక స్వావలంబన దిశగా ఒక చరిత్రాత్మక ముందడుగు. సాంకేతిక పురోగతిని వేగవంతం చేయడంతో పాటు, 7,500కు పైగా ఉపాధి అవకాశాలను సృష్టిస్తుందని అంచనా. ఆత్మనిర్భర్ భారత్ నిర్మాణానికి, పరివర్తనాత్మక జాతీయ కార్యక్రమాల ద్వారా రాష్ట్రాలకు సాధికారత కల్పించడానికి అచంచలమైన నిబద్ధత కనబరుస్తున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి నా హృదయపూర్వక కృతజ్ఞతలు. భారతదేశ వ్యూహాత్మక రక్షణ వ్యవస్థలో ఆంధ్రప్రదేశ్ పాత్రను బలోపేతం చేయడానికి నిరంతరం మద్దతు ఇస్తున్న కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు నా హృదయపూర్వక ధన్యవాదాలు. ఏపీ సీఎం చంద్రబాబు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్... పారిశ్రామిక వృద్ధి, ఆవిష్కరణలు, భవిష్యత్తు - సిద్ధ పెట్టుబడుల కోసం తన దార్శనికతను బలోపేతం చేస్తూనే ఉంది' అంటూ ఎక్స్‌లో పవన్ కల్యాణ్ పోస్ట్ చేశారు.

# డ్రోన్ టెక్నాలజీ గేమ్ ఛేంజర్:

చెప్పుకొచ్చారు. ఈ రోజు(శుక్రవారం) పుట్టపర్తిలో కేంద్రమంత్రి రాజ్‌నాథ్‌సింగ్, సీఎం చంద్రబాబు పర్యటించారు. పుట్టపర్తిలో యుద్ధ విమానాల తయారీ పరిశ్రమకు శంకుస్థాపన చేశారు. రూ.15,803 కోట్లతో ప్రాజెక్ట్ నిర్మాణం చేపట్టారు. పుట్టపర్తి - కోడూరు రోడ్డులోని 130 ఎకరాల విస్తీర్ణంలో డిఫెన్స్ పరిశ్రమను ఏర్పాటు చేస్తున్నారు. ఈ సందర్భంగా రాజ్‌నాథ్‌సింగ్ మాట్లాడారు. ఆయుధ ఉత్పత్తిలో స్వావలంబన దిశగా భారత్ అధ్యయనం చేస్తోందని తెలిపారు. రక్షణ శాఖలో సంపూర్ణ స్వావలంబన సాధించాలనేది కేంద్ర లక్ష్యమని ఉద్ఘాటించారు. గత పదేళ్లలో ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల మధ్య అంతరం తగ్గించడానికి కృషి చేస్తున్నామని చెప్పుకొచ్చారు. డ్రోన్ హబ్‌గా కర్నూలు ఉంటుందని స్పష్టం చేశారు. ఆ దిశగా ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందని రాజ్‌నాథ్‌సింగ్ పేర్కొన్నారు.

## పందిళ్ళపల్లి నాగవరప్పమ్మ అమ్మవారి పొంగళ్ళు కార్యక్రమంలో పాల్గొన్న కరణం, పాలేటి



**వేటపాలెం, మే 15( క్రైమ్ కౌంటర్):** వేటపాలెం మండలంలోని పందిళ్ళపల్లి నాగవరప్పమ్మ అమ్మవారి దేవస్థానం నందు దాసరి పవన్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన అమ్మవారి పొంగళ్ళు కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఒంగోలు మాజీ పార్లమెంట్ సభ్యుడు, చీరాల మాజీ ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే మాజీ మంత్రి డాక్టర్ పాలేటి రామారావు సహా పలువురు నాయకులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు భారీ సంఖ్యలో హాజరై భక్తి భావంతో పొంగళ్ళు సమర్పించారు.

ఈ సందర్భంగా నాయకులు గ్రామ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు.

# నీట్ విద్యార్థి రితిక్ ఆత్మహత్యకు బాధ్యులెవరు?:

ఉత్తర్ ప్రదేశ్: నీట్ యూజీ 2026 పరీక్ష రద్దుతో ఉత్తర్ ప్రదేశ్‌కు చెందిన విద్యార్థి రితిక్ మిశ్రా ఆత్మహత్య చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ ఘటన దేశవ్యాప్తంగా కలకలం సృష్టించింది. పరీక్ష రద్దుతో తీవ్ర మానసిక వేదనకు గురైన రితిక్ బలవన్మరణానికి పాల్పడినట్లు బాధిత కుటుంబం ఆరోపిస్తోంది. విద్యార్థి ఆత్మహత్య ఘటనపై ప్రతిపక్ష పార్టీలు, పలువురు రాజకీయ ప్రముఖులు స్పందిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే రితిక్ మృతిపై కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ ప్రియాంక గాంధీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు.లఖింపూర్ ఖేరీలో నీట్ విద్యార్థి రితిక్ మిశ్రా ఆత్మహత్య చేసుకోవడం అత్యంత హృదయ విదారకమని ప్రియాంక గాంధీ అన్నారు. దుఃఖంలో ఉన్న బాధిత కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. నీట్ పరీక్ష రద్దు కావడంతో రితిక్ తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురయ్యాడని విద్యార్థి తల్లిదండ్రులు చెబుతున్నారని ప్రియాంక అన్నారు. పరీక్షల్లో విచ్చలవిడిగా పెరిగిపోతున్న అవినీతి యువత ప్రాణాలను బలి తీసుకుంటోందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఏటా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు నాశనమవుతోందని మండిపడ్డారు. ఈ పేపర్ లీక్‌ల పరంపర ఎప్పుడు ఆగుతుంది? అంటూ ప్రశ్నించారు. దీనికి ఎవరు జవాబుదారీతనం వహిస్తారని ప్రియాంక గాంధీ మండిపడ్డారు.

కాగా, నీట్ పరీక్ష రద్దుతో తీవ్ర ఆవేదనకు గురైన యూపీకి చెందిన రితిక్ మిశ్రా నిన్న (గురువారం) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇప్పటికే రెండు సార్లు నీట్ రాసిన విద్యార్థికి సీటు రాలేదు. మూడోసారి అయినా సీటు వస్తుందని భావించిన యువకుడికి పరీక్ష రద్దు షాక్ ఇచ్చినట్లు అయ్యింది. దీంతో అతడు బలవన్మరణానికి పాల్పడ్డాడు.

# పదిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సన్మానం.




**క్రైమ్ కౌంటర్ న్యూస్ ప్రతినిధి కల్వకుర్తి:-** స్థానిక కల్వకుర్తి వికాస్ టెక్నో స్కూల్లో టాపర్లకు ఘనంగా సన్మానం చేశారు. వర్షిత్, అభిరామ్, సంజయ్ ఐదువందల పైగా మార్కులు సాధించిన విద్యార్థులను వాళ్ల తల్లిదండ్రుల సమక్షంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎన్ రాఘవాచారి మాట్లాడుతూ మా పాఠశాలలో విద్యార్థులందరూ ఉత్తీర్ణత సాధించారు,విద్యార్థులు పట్టుదల, ఇష్టంతో చదివితే ఎంతటి విజయాన్నైనా సాధిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కుమార్, మహమ్మది, రామలక్ష్మి, విద్యార్థుల తల్లిదండ్రులు శ్రీనివాసులు, యాదయ్య, రాణి పాల్గొన్నారు.

## ఐ హెచ్‌ఆర్‌ఎఫ్ ప్రకాశం జిల్లా చైర్మన్ గా మాలెం. విజయ భాస్కర్ రెడ్డి



**క్రైమ్ కౌంటర్ న్యూస్: కర్నూలు** అంతర్జాతీయ మానవ హక్కుల సంస్థ ప్రకాశం జిల్లా చైర్మన్ గా ప్రకాశం జిల్లా పులిపాడు మండల పులిపాడు గ్రామానికి చెందిన మాలెం విజయ భాస్కర్ రెడ్డి గారు ఎంపికయ్యారని ఐ హెచ్‌ఆర్‌ఎఫ్ సంస్థ నేషనల్ చైర్మన్ హైకోర్టు ప్రముఖ న్యాయవాది కొంగరి అనిల్ కుమార్ గారు ఐ హెచ్‌ఆర్‌ఎఫ్ నేషనల్ హెడ్ ఆఫీస్ న్యూఢిల్లీ నుండి అధికారికంగా ఉత్తర్వులు జారీ చేశారని సంస్థ నేషనల్ వైస్ చైర్మన్ ఆర్ .కంబగిరి స్వామి గారు కర్నూలు లోని ఐ హెచ్‌ఆర్‌ఎఫ్ కార్యాలయం లో శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు అనంతరం నూతన నియమితులైన మాలెం విజయభాస్కర్ రెడ్డి గారు మాట్లాడుతూ రాజ్యాంగబద్ధంగా రూపొందించిన చట్టాలను ప్రజలకు పౌరులక అందరూ సక్రమంగా సద్వినియోగం చేసుకునేలా స్వేచ్ఛగా జీవించాలని సర్వ మానవ హక్కుల పరిరక్షణలో భాగంగా మానవ హక్కులకు ఉల్లంఘన భంగం కలిగిస్తే ఉపేక్షించబోమని నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ దృష్టికి తీసుకెళ్లి సామాన్య పౌరులకు సామాన్య ప్రజలకు అందరికీ న్యాయం జరిగేలా విధులు నిర్వహిస్తామని తెలిపారు...

# బంగారం ఉత్పత్తికి చిరునామాగా ఏపీ: సీఎం చంద్రబాబు

ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. పుట్టపర్తి సత్య సాయిబాబా బోధనలతో విశ్వశాంతికి బాటలు పడిందని తెలిపారు. ఇప్పుడు అడ్వాన్స్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ ప్రాజెక్టు రావడం ఎంతో కీలకమన్నారు. ఏఎంసీఏ ప్రాజెక్టు ద్వారా ఆత్మనిర్భర్ భారత్ లక్ష్య సాధనలో ఆంధ్రప్రదేశ్ ముఖ్య పాత్ర పోషిస్తుందని చంద్రబాబు తెలిపారు. ఆధునిక స్టెల్త్ యుద్ధ విమానాల తయారీకి ఈ ప్రాజెక్టు దోహదపడుతుందన్నారు.

ఓర్వకల్లులో డ్రోన్ సిటీ..

భారత రక్షణ శక్తిని ప్రపంచానికి చాటడంలో ఆపరేషన్ సిందూర్ ఓ ప్రత్యక్ష ఉదాహరణగా నిలిచిందని సీఎం తెలిపారు. ఆపరేషన్ సిందూర్‌లో వినియోగించిన డ్రోన్లు ఏపీలోనే తయారు చేసి పరీక్షించారని చెప్పారు. ఆమ్కా ప్రాజెక్టును ఏపీకి కేటాయించినందుకు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా రూ.15 వేల కోట్లకు పైగా పెట్టుబడితో 7,500 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయని ముఖ్యమంత్రి వెల్లడించారు. ఫైటర్ జెట్ ఇంటిగ్రేషన్‌తో పాటు ఫ్లైట్ టెస్టింగ్ కేంద్రంగా పుట్టపర్తి అభివృద్ధి చెందుతుందన్నారు. కేవలం 36 రోజుల్లోనే ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయగలిగామని.. జెట్ స్పీడ్‌తో అనుమతులు ఇచ్చామని తెలిపారు. ఏరోస్పేస్ రంగంలో ఈ కీలక ప్రాజెక్టుతో మరిన్ని డిఫెన్స్ ప్రాజెక్టులు రాబోతున్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు. భారత్ ఫోర్జ్, హెచ్‌ఎఫ్‌సీఎల్, భారత్ డైనమిక్స్ లిమిటెడ్‌తో కర్నూలు జిల్లాలో డ్రోన్ సిటీలకు శంకుస్థాపన చేశామని తెలిపారు. ఓర్వకల్లులో డ్రోన్ సిటీ ఏర్పాటు చేసి ఉత్పత్తి ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు.

2028 నాటికి కడప స్టీల్‌ప్లాంట్ పూర్తి..శ్రీహరికోట అంతరిక్ష శక్తి, నాగాయలంక క్షిపణి శక్తి, పుట్టపర్తి రక్షణ శక్తి, విశాఖ నౌకాదళ శక్తిగా ఏపీ దేశానికి అండగా నిలుస్తుందని సీఎం అన్నారు. రాయలసీమ ఒకప్పుడు డ్రాట్ జోన్ అని.. ఇప్పుడు గ్రోత్ జోన్‌గా మారిందన్నారు. ఒకప్పుడు గోల్డ్ అంటే కేజీఎఫ్ గుర్తొచ్చేదని.. ఇకపై (జొన్నగిరి గోల్డ్ ఫీల్డ్స్) అని చెప్పుకుంటారని తెలిపారు. ఈ ఏడాది జొన్నగిరి గోల్డ్ ఫీల్డ్స్‌లో 600 కిలోల బంగారం ఉత్పత్తి చేయనున్నట్లు తెలిపారు. వచ్చే ఏడాది జొన్నగిరి గోల్డ్ ఫీల్డ్స్‌లో 1,500 కిలోల బంగారం ఉత్పత్తి చేస్తామన్నారు. బంగారం ఉత్పత్తికి చిరునామాగా ఏపీ నిలవనుందని చెప్పుకొచ్చారు. కడప స్టీల్ ప్లాంట్ పనులను జూన్‌లో ప్రారంభిస్తామని ప్రకటించారు. 2028 నాటికి కడప స్టీల్‌ప్లాంట్‌ను పూర్తిచేస్తామన్నారు. నాడు ఎన్టీఆర్, నేడు కూటమి ప్రభుత్వం రాయలసీమకు నీరిచ్చేందుకు కృషి చేస్తోందన్నారు. ప్రతి ఎకరాకు నీరు అందించేందుకు కృషి చేస్తున్నామని చంద్రబాబు పేర్కొన్నారు.

## సమాజం కోసం యువత రాజకీయాల్లోకి రావాలి




**క్రైం కౌంటర్ కోటేశ్వరరావు సత్తెనపల్లి నియోజకవర్గం :** లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్) లో చేరి నేటితో ఏడాది పూర్తయిన సందర్భంగా పాత్రికేయుల సమావేశంలో మాట్లాడిన పల్నాడు జిల్లా అధ్యక్షులు, న్యాయవాది జొన్నలగడ్డ విజయ్ కుమార్ మన పిల్లలు పంచాయతీ సర్పంచ్, మండల అధ్యక్షులు, ఎమ్మెల్యేలు, ఎంపీ, మంత్రి, ముఖ్యమంత్రులుగా ఎదగాలని మనస్సులో కోరిక ఉంటే లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్) ద్వారానే సాధ్యం అవుతుందని పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షులు , న్యాయవాది జొన్నలగడ్డ విజయ్ కుమార్‌లి పేర్కొన్నారు. పార్టీ చేరి నేటి తో ఏడాది పూర్తి అయినా సందర్భంగాలి శుక్రవారం సాయంత్రం పల్నాడు జిల్లా సత్తెనపల్లి జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన పాత్రికేయులతో మాట్లాడారులి మా నాయకుడు బాగుండాలి.. నాయకుడు కొడుకు బాగుండాలి... నాయకుడి మనవడు బాగుండాలనే వంశపారంపర్య రాజకీయాల కన్నా, స్వతంత్ర ఆలోచనలతో ఉన్న యువత సమాజం కోసం ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. దేశ రాజకీయాల్లో సామాన్యులకు అవకాశం ఇచ్చిన ఏకైక పార్టీ, ఏకైక వ్యవస్థ ఎల్జేపీ అన్నారు. పార్టీ జాతీయ అధ్యక్షులు, కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్, రాష్ట్ర అధ్యక్షులు చందోలు సత్యనారాయణ లు కూడా యువత రాజకీయాల్లోకి రావాలి నాయకులుగా ఎదగలనే పిలుపివ్వటంతో తాను ఎల్జేపీ చేరి ప్రజా సమస్యలపై ఏడాదిలో అనేక పోరాటాలతో పాటు ప్రజల గొంతుకై నిలబడ్డానని ఆయన చెప్పారు. మొంథా తుఫాన్ లో బాధితుల అండగా, ఎస్సీ ఎస్టీ పారిశ్రామికవేత్తలు బకాయిలు విడుదల చేయాలని, గిరిజన ఉపాధ్యాయ సమస్యలు, సత్తెనపల్లి పురపాలక సంఘం చైర్మన్ ఎస్సీ లకు కేటాయించాలని, ఎరువులు కొరత, స్క్రైబ్స్ టైఫాస్ వ్యాధి పై ప్రజలకు వైద్యులతో కలిసి అవగాహన సదస్సులు, వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన వారికి ప్రోత్సాహం, దివ్యాంగులకు అండగా ఉండటం, అనేక చోట్ల అన్న సంతర్పణ తదితర కార్యక్రమాలు నిర్వహించినట్లుగా ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తులో ప్రజలకు మరింతగా అందుబాటులో ఉంటూ వారి గొంతుకై పని చేస్తానని ఆయన చెప్పారు.

# సివిల్ రైట్స్ ప్రోగ్రామ్ ఏర్పాటు చేయాలి ఐ హెచ్‌ఆర్‌ఎఫ్ సంస్థ




**క్రైమ్ కౌంటర్ న్యూస్ : అవుకు** రాజ్యాంగంలోని పౌర హక్కులను ప్రజలందరికీ అవగాహన కల్పించాలని అంతర్జాతీయ మానవ హక్కుల సంస్థ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సభ్యులు షేక్ ఇబ్రహీం అన్నారు అనంతరం ఆయన అవుకు మండలంలోని ఐ హెచ్‌ఆర్‌ఎఫ్ కార్యాలయం నందు ఆయన శుక్రవారం మాట్లాడుతూ చెర్లోపల్లి గ్రామం నందు సివిల్ రైట్స్ ప్రోగ్రాం ఏర్పాటుచేసి సామాన్య పౌరులకు హక్కుల గురించి అవగాహన కల్పించాలని పల్లె ప్రాంతాల్లో నుండి పట్టణాల వరకు భారత రాజ్యాంగంలోని చట్టాలను అందరికీ అవగాహన కల్పించేలా ప్రజలందరికీ ఉన్న హక్కులను వివరించి ప్రజలకు పౌరులకు వారికి ఉన్న హక్కులను తెలియజేసి చైతన్యం పరుస్తూ హక్కులను రాజ్యాంగబద్ధంగా సక్రమంగా సద్వినియోగం చేసుకొని పరిరక్షించుకునేలా అందరికీ అవగాహన కల్పించాలని అవుకు మండల అధికారులను ఆయన కోరారు

# వ్యవసాయ రంగానికి బడ్జెట్‌లో 50 శాతం నిధులు కేటాయించాలి: తహశీల్దార్‌కు రైతు సంఘం వినతి




**పెద్దవడుగూరు మే 15 క్రైమ్ కౌంటర్ న్యూస్ రాము రిపోర్టర్** వ్యవసాయ రంగాన్ని కాపాడటమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం రాబోయే బడ్జెట్‌లో 50 శాతం నిధులను కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు పెద్దవడుగూరు మండల తహశీల్దార్‌కు సంఘం నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షులు వి. వెంకటరాముడు యాదవ్ మాట్లాడుతూ, రైతాంగ సంక్షేమం కోసం ప్రభుత్వం తక్షణమే కీలక నిర్ణయాలు తీసుకోవాలని, ఎన్నికల హామీలో పేర్కొన్న విధంగా 'అన్నదాత సుఖీభవ' పథకం కింద రూ. 20 వేల రూపాయలను వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని కోరారు. ఈ పథకాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కౌలు రైతులకు కూడా వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఉచిత పంటల బీమా పథకాన్ని వెంటనే పునరుద్ధరించాలని, పెండింగ్‌లో ఉన్న ఇన్-పుట్ సబ్సిడీలు, బీమా పరిహారాన్ని తక్షణమే విడుదల చేయాలని ఆయన కోరారు. ధరల స్థిరీకరణ నిధికి రూ. 3 వేల కోట్లు, ప్రకృతి విపత్తుల నిధికి రూ. 4 వేల కోట్లు, మైనర్ ఇరిగేషన్ అభివృద్ధికి కనీసం రూ. 5 వేల కోట్లు, మరియు వడ్డీ రాయితీ కోసం రూ. 2 వేల కోట్లు కేటాయించి రైతులను ఆదుకోవాలన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వ హామీ మేరకు నూతన కౌలు చట్టాన్ని తీసుకురావాలని, ఆర్‌బిఐ నిబంధనల ప్రకారం కౌలు రైతులకు ఎటువంటి షూరిటీ లేకుండా రూ. 5 లక్షల వరకు పంట రుణాలు అందజేయాలని డిమాండ్ చేశారు. గ్రామీణ ఉ పాధి హామీ పథకానికి నిధులు పెంచి, వ్యవసాయ అనుబంధ రంగాల అభివృద్ధికి పెద్దపీట వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు వడుగురు నారాయణ, నాయకులు ఆదినారాయణ, సుధాకర్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, నాగేంద్ర, నారాయణస్వామి, సంజన్న తదితరులు పాల్గొన్నారు.

# డెంగ్యూ వ్యాధి పట్ల ప్రజలు అవగాహన కలిగి ఉండాలి డాక్టర్ రవికుమార్



**క్రైంకౌంటర్ కోటేశ్వరరావు కోసూరు న్యూస్ :** వైద్యాధికారులు రవికుమార్ అనిల్ కుమార్ మేరీ శ్రీకళ ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్ ప్రతి ఏడాది మే నెల 16వ తేదీన జాతీయ డెంగ్యూ దినోత్సవం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జరుపుకుంటున్నట్లు పల్నాడు జిల్లా క్రోసూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు, రవికుమార్ అనిల్ కుమార్ మేరీ శ్రీకళ ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్ లు తెలిపారు. శుక్రవారం జాతీయ డెంగ్యూ దినోత్సవం బ్యానర్ను వారు పల్నాడు జిల్లా కోసూరు మండలం క్రోసూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆవిష్కరణ చేశారు. అదేవిధంగా ఈ సంవత్సరం మే 16వ తేదీన "సమాజ భాగస్వామ్యంతో డెంగ్యూ నియంత్రణ" చెక్-క్లీన్-కవర్, పరిశీలించండి-శుభ్రం చేయండి- మూతలు పెట్టండి అనే ముఖ్య నినాదాలతో జాతీయ డెంగ్యూ దినోత్సవం ఈనెల 16వ తేదీన జరుపుకోవాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినట్లు వారు పేర్కొన్నారు. ఈ దినోత్సవం యొక్క ముఖ్య ఉద్దేశం డెంగ్యూ వ్యాధి వ్యాప్తిని అరికట్టడం, వ్యాధిని నిర్మూలించడం, ప్రజలలో డెంగ్యూ వ్యాధి పట్ల అవగాహన కల్పించడం, ఈడీస్ దోమల నియంత్రణ , డెంగ్యూ రహిత ప్రపంచ కోసం కృషి చేయడం, ప్రభుత్వాలు, ఆరోగ్య సంస్థలు డెంగ్యూ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గూర్చి ప్రజలకు వివరిస్తారని వారు తెలిపారు మండలంలోని అన్ని సచివాలయాల్లో ఇతర ప్రభుత్వ శాఖల సహకారంతో అవగాహన సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు ఈ సందర్భంగా ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్ మాట్లాడుతూ డెంగ్యూ వ్యాధి ఎడిస్ దోమ కుట్టడం వలన వ్యాధిగ్రస్తుని నుండి ఆరోగ్య వంతునికి వ్యాపిస్తుంది అని అన్నారు తీవ్రమైన జ్వరము, తీవ్రమైన తలనొప్పి, కంటి వెనక భాగంలో నొప్పి, కండరాలు మరియు కీళ్ల నొప్పులు, చర్మంపై ఎర్రటి మచ్చలు కనిపించినప్పుడు నిర్లక్ష్యం చేయకుండా గ్రామీణ, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలోనూ, అన్ని ప్రభుత్వ ఆసుపత్రిలలో ప్రాథమిక పరీక్షలు చేయించుకొని పాజిటివ్ వచ్చినయెడల జిల్లా ఆస్పత్రిలలో ఎలిసా టెస్ట్ చేయించుకొని వ్యాధిని నిర్ధారించుకోవాలి అన్నారు ఈ కార్యక్రమంలో సత్తెనపల్లి రూరల్ ఎస్ యు ఓ . సిహెచ్ శ్రీనివాసరావు, హెల్త్ సూపర్వైజర్ మలేరియా నాగమల్లేశ్వరరావు, శివుడు తదితరులు పాల్గొన్నారు

# జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో వేమూరులో రూ.1.35 కోట్లతో ప్రభుత్వ పాఠశాలలకు నూతన రూపు

**ది 15 మే 2026 . (బాపట్ల క్రైమ్ బ్యూరో చీఫ్ రెడ్డి వర ప్రసాద్)** గ్రామీణ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఆధునిక మౌలిక వసతులు అందించాలనే లక్ష్యంతో వేమూరు నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలు సరికొత్త రూపును సంతరించుకుంటున్నాయి. సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులతో పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం, భద్రతా సదుపాయాలు మరియు ఆధునిక సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి. సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో సుమారు రూ. 1.35 కోట్ల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులు విజయవంతంగా పూర్తయ్యాయి. జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వి, ఐఏఎస్ పర్యవేక్షణలో జంపాని, ఎడ్లపల్లి, అమృతలూరు, ఇలవరం తదితర పాఠశాలల్లో విద్యార్థుల కోసం ప్లే ఫీల్డ్స్, ఆధునిక కెమిస్ట్రీ ల్యాబ్‌లు, కిచెన్ గార్డెన్ ఫెన్సింగ్, రేన్‌వాటర్ హార్వెస్టింగ్ పిట్స్ వంటి సదుపాయాలను నాణ్యతతో అందుబాటులోకి తీసుకువచ్చారు. మౌలిక వసతుల అభివృద్ధిలో భాగంగా దివ్యాంగ విద్యార్థుల సౌకర్యార్థం ప్రత్యేక ర్యాంపులు, హ్యాండ్ రైలింగ్స్ ఏర్పాటు చేశారు. పాడుబడిన పాత భవనాల స్థానంలో కొత్త భవనాలు, అదనపు తరగతి గదులను నిర్మించడం ద్వారా గ్రామీణ ప్రాంత విద్యార్థులకు సురక్షితమైన, ఆహ్లాదకరమైన విద్యా వాతావరణం కల్పిస్తున్నారు. ఈ ఆధునిక వసతులు విద్యార్థుల విద్యా ప్రమాణాల పెరుగుదలకు తోడ్పడనున్నాయి. పాఠశాలల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ బిఐజిఎస్ పథకం కింద బూతుమల్లి, కూచెల్లపాడు, కాకర్లమూడి, పంచలవరం, సుగ్గునలంక తదితర గ్రామాల్లో బౌండరీ వాల్స్ నిర్మించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేట్




విద్యాసంస్థలకు దీటుగా వసతులు విస్తరించడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఆధునిక హంగులతో ముస్తాబైన ఈ పాఠశాలలు వేమూరు నియోజకవర్గ విద్యా రంగానికి కొత్త దిశను చూపిస్తున్నాయి.


# పరిశ్రమల ప్రోత్సాహక జిల్లా స్థాయి కమిటీ సమావేశం లో నిధుల మంజూరు ను ఆమోదించిన కలెక్టర్ మరియు సూచనలు




**తేది 15 మే 2026. (బాపట్ల క్రైమ్ కౌంటర్ బ్యూరో చీఫ్ రెడ్డి వర ప్రసాద్)** పారిశ్రామిక రంగంగా బాపట్ల జిల్లా అభివృద్ధికి, పరిశ్రమల స్థాపనకు మీ వంతు సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వి తెలిపారు. పరిశ్రమల ప్రోత్సాహక జిల్లా స్థాయి కమిటీ సమావేశం శుక్రవారం స్థానిక కలెక్టరేట్ లో జరిగింది. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధి విధానంలో ప్రభుత్వం విరివిగా రాయితీలు కల్పిస్తుందని కలెక్టర్ చెప్పారు. స్థిర పెట్టుబడి రాయితీ, విద్యుత్ రాయితీ, పావలా వడ్డీ రాయితీల్లో భాగంగా 49 పరిశ్రమలకు రూ. 8.30 కోట్లు రాయితీ మంజూరు చేస్తూ జిల్లా కలెక్టర్ ఆమోద ముద్ర వేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రజలకు అందేలా అధికారులు కృషి చేయాలన్నారు. అలాగే ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలు పారిశ్రామికవేత్తలకు అందించడం ద్వారా ఉత్పత్తులు మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. బాపట్ల జిల్లాలో టీషర్ట్స్, క్యాప్, జనపనారతో వివిధ రకాల ఉత్పత్తుల యూనిట్ స్థాపనకు కృషి చేయాలన్నారు. బాపట్ల జిల్లాలోని బీచ్ లలో జూన్ నెల ఒకటో తేదీ నుంచి ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధిస్తున్నట్టు కలెక్టర్ ప్రకటించారు. ప్రత్యామ్నాయంగా జనపనార బ్యాగులు, సంచులు వినియోగంలోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఇందు కొరకు జనపనార సంచులు, బ్యాగులు ఉత్పత్తి చేయాలని, వాటిపై "బే ఆఫ్ బాపట్ల" లోగో ముద్రించాలన్నారు. అలాంటి యూనిట్లను స్థాపించే వారికి యుద్ధ ప్రాతిపదికన రుణం మంజూరు చేయాలన్నారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలన్నారు. ర్యాంపు కార్యక్రమం కింద ప్రోత్సాహిక పారిశ్రామికవేత్తల నైపుణ్యాల అభివృద్ధికి శిక్షణలు నిర్వహించామన్నారు. 16 ఉద్యమ్ వర్క్ షాప్ లు, 13 ప్రాంతాలలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమాలు చేపట్టామన్నారు. జైట్ ఎనర్జీ సోలార్ పీవీ మాడ్యూల్ ప్యానెల్ ఉత్పత్తి కేంద్రం మార్టూరులో ఏర్పాటు కానుందని కలెక్టర్ చెప్పారు. రూ. 198.4 కోట్లతో పరిశ్రమ ఏర్పాటుకు పారిశ్రామికవేత్తలు ముందుకు రాగా ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయన్నారు. ఆ పరిశ్రమ ఏర్పాటుకు అవసరమైన రుణ సదుపాయం కల్పించాలని, పర్యావరణ అనుమతులు పరిశీలించాలని ఆయన సూచించారు. బాపట్ల మండలంలో ఎం ఎస్ ఎం ఈ పార్కు కొరకు భూమి గుర్తించాలని, ప్రభుత్వ భూమి లేకపోతే భూసేకరణతో కొనుగోలు చేయాలన్నారు. పి ఎం ఈ జి పి పథకం కింద ఏప్రిల్ నాటికి 118 యూనిట్లు లక్ష్యంగా ప్రభుత్వం నిర్దేశించిందన్నారు. మార్జిన్ మనీ కింద రూ. 5.80 కోట్ల నిధులను 141 యూనిట్లకు మంజూరు చేశామన్నారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ వై రామకృష్ణ, ఎల్ డి ఎం శివకృష్ణ, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ నరసింహారావు, ఏపీ ఎస్ ఎఫ్ సి సీనియర్ బ్రాంచ్ మేనేజర్ రామాంజనేయులు, ఆర్డీవో గ్లోరియా, ఫ్యాప్సియా రాష్ట్ర సీనియర్ సభ్యులు భక్తవత్సలం, కమిటీ సభ్యులైన వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# జీఎస్టీ పన్నుల ద్వారా బాపట్ల జిల్లాకు రూ.100 కోట్లు ఆదాయం వివిధ వాణిజ్య సముదాయాలనుండి పన్ను వసూలు చేయాలి : కలెక్టర్

**తేది 15 మే 2026. (బాపట్ల క్రైమ్ కౌంటర్ బ్యూరో చీఫ్ రెడ్డి వర ప్రసాద్)** జీఎస్టీ పన్నుల ద్వారా బాపట్ల జిల్లాకు రూ. 100 కోట్లు ఆదాయం వచ్చిందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వి, తెలిపారు. జిఎస్టి పన్నుల వసూలుపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం శుక్రవారం స్థానిక కలెక్టరేట్ లో జరిగింది. జీఎస్టీ పన్నుల వసూలులో బాపట్ల జిల్లా మంచి పురోగతి సాధించినట్లు కలెక్టర్ చెప్పారు. గత ఏడాదితో పోలిస్తే ప్రస్తుత సంవత్సరంలో 10% పన్నులు వసూలు పెరిగిందన్నారు. ప్రొఫెషనల్ టాక్స్ కింద జిల్లాలో రూ. 39.32 కోట్లు పన్ను వసూలు అయిందన్నారు. ప్రతి డాక్టర్ కచ్చితంగా ప్రొఫెషనల్ టాక్స్ చెల్లించాలన్నారు. ఆ మేరకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. వాహనాలు, ట్రావెల్స్ వాహనాలు, హోటళ్ళు, వాణిజ్య సముదాయాలలోనూ పన్ను పక్కాగా వసూలు జరగాలన్నారు. ముఖ్యంగా సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలపై పన్నులు వసూలు చేయాలన్నారు. అన్ని రంగాలలో చట్టబద్ధంగా రావలసిన పన్నులు పకడ్బందీగా వసూలు చేయాలని ఆయన సూచించారు. పర్యాటకరంగంగా బాపట్ల జిల్లా అభివృద్ధి చెందుతోందని కలెక్టర్ అన్నారు. చిన్నగంజాం బీచ్ ను శనివారం ప్రారంభిస్తామన్నారు. జెట్టీలు, బోట్ షికార్ వంటి కార్యక్రమాలపై ఇప్పటికే ట్రైలరన్ నిర్వహించామన్నారు. పర్యాటక ప్రాంతం విశేషాలపై మరింతగా ప్రజల్లోకి తీసుకువెళ్లేలా బే ఆఫ్ బాపట్లపై విస్తృత ప్రచారం చేపట్టాలన్నారు. పర్యాటక రంగాన్ని పారిశ్రామిక రంగంగా ప్రభుత్వం గుర్తించి అభివృద్ధికి చర్యలు



తీసుకుంటుందన్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని బీచ్ ప్రాంతాలను నిజాంపట్నం, సూర్యలంక, చిన్నగంజాం మూడు క్లస్టర్లుగా విభజిస్తున్నామన్నారు. బే ఆఫ్ బాపట్ల లోగో ప్రజల్లోకి తీసుకువెళ్లే కార్యక్రమంలో భాగంగా ఆర్టీసీ బస్సులు, ట్రావెల్స్, ఆటోలపై స్టిక్కర్లు వేయాలన్నారు. జిల్లాలోని బీచ్ లు అభివృద్ధి చెందడమే లక్ష్యంగా అందరూ కలిసి పని చేయాలని పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో జిఎస్టి అధికారి మురళి కృష్ణ, పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ వై రామకృష్ణ, కమిటీలోని అనుబంధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలపై స్పందించిన ఎమ్మెల్యే అరవింద బాబు.



**క్రైమ్ కౌంటర్ : నరసరావుపేట. (ప్రతినిధి.జి.ఎం.కె. గాంధీ):** నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన 'ప్రజా వేదిక' కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది.స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు షేక్ జాన్ సైదా పాల్గొన్నారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. మొత్తం 16 ఫిర్యాదులను ఎమ్మెల్యే స్వీకరించినట్లు కార్యాలయ వర్గాలు తెలిపాయి.అందిన అర్జీలలో ప్రధానంగా వృద్ధాప్య, వికలాంగ, విధవరాండ్ల పెన్షన్లకు సంబంధించిన సమస్యలు అధికంగా ఉన్నాయి.అలాగే గృహ నిర్మాణ పథకాల అమలు, గృహాల మంజూరు, మౌలిక వసతులు, ముఖ్యమంత్రి సహాయ నిధి కోసం దరఖాస్తులు కూడా వచ్చినట్లు వెల్లడించారు.ప్రతి ఫిర్యాదును ప్రత్యేకంగా పరిశీలించి సంబంధిత శాఖ అధికారులతో చర్చించి త్వరితగతిన పరిష్కారం అందించేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే డాక్టర్ అరవింద బాబు హామీ ఇచ్చారు.ప్రజల సమస్యల పరిష్కారమే తమ ప్రధాన లక్ష్యమని ప్రజలకు ఎమ్మెల్యే కార్యాలయం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

# ఖర్చులు తగ్గించండి", "పొదుపు అలవాటు చేసుకోండి" సామాన్యుడి పై ధరల మోత

- "పొదుపు చేయండి" అంటూనే పెట్రోల్ భారం పెంచుతున్నారా..? ప్రజలు ప్రశ్నిస్తున్న ప్రధాన అంశం ఇదే.
- సామాన్యుడిపై మళ్లీ ధరల మోత
- ప్రతి భారాన్ని సామాన్యుడిపైనే మోపడం సరైన ఆర్థిక వ్యూహమా?

**తేది 15 మే 2026 . (బాపట్ల క్రైమ్ కౌంటర్ బ్యూరో చీఫ్ రెడ్డి వర ప్రసాద్)** ఒకవైపు ప్రభుత్వాలు "ఖర్చులు తగ్గించండి", "పొదుపు అలవాటు చేసుకోండి" అంటూ ప్రజలకు సూచనలు చేస్తున్నాయి.మరోవైపు ప్రతిరోజూ ఉపయోగించే పెట్రోల్, డీజిల్ ధరలను పెంచుతూ సామాన్యుడిపై అదనపు భారం మోపుతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. తాజాగా పెట్రోల్, డీజిల్‌పై లీటరుకు రూ.3 చొప్పున ఆయిల్ కంపెనీలు ధరలు పెంచనున్నాయన్న వార్తలు ప్రజల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. ఇప్పటికే నిత్యావసరాల ధరలతో ఇబ్బందులు పడుతున్న మధ్యతరగతి కుటుంబాలకు ఇది మరొక దెబ్బగా మారనుంది. ఇంధన ధరలు పెరిగితే రవాణా ఖర్చులు పెరుగుతాయి. రవాణా ఖర్చులు పెరిగితే కూరగాయల నుంచి సరుకుల వరకు అన్నీ ఖరీదవుతాయి. చివరకు ప్రతి కుటుంబం నెలవారీ బడ్జెట్ దెబ్బతింటుంది. ఇలాంటి పరిస్థితుల్లో "పొదుపు చేయండి" అనే సూచనలు ప్రజలకు వ్యంగ్యంగా అనిపిస్తున్నాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా క్రూడ్ ఆయిల్ మార్కెట్‌లో అస్థిరత, యుద్ధాలు, డాలర్ బలపడటం వంటి కారణాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. జీతాలు అదే స్థాయిలో ఉన్నాయి, ఉద్యోగ భద్రత తగ్గుతోంది, లు, విద్యా ఖర్చులు, మరియు వైద్య ఖర్చులు పెరుగుతున్నాయి. ఇప్పుడు ఇంధన ధరల పెరుగుదలతో మరింత ఒత్తిడి పెరుగుతోంది అని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ఇలాంటి




సమయంలో ప్రభుత్వాలు ప్రజలకు ఉపశమన చర్యలు తీసుకోవాలని, పన్నుల తగ్గింపు వంటి నిర్ణయాలు పరిశీలించాలని సామాన్యులు కోరుతున్నారు.

# గ్రీవెన్స్ డే లో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రావణ్





**క్రైం కౌంటర్ కోటేశ్వరరావు తాడికొండ నియోజకవర్గం :** ఫిరంగిపురం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన తాడికొండ శాసన సభ్యులు తెనాలి శ్రావణ్ కుమార్ ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయమని దానికి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ అన్నారు. పలు సమస్యలపై అధికారులతో ఫోన్లో మాట్లాడి పరిష్కరించారు. సమస్యలు సత్వర పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. అనంతరం నియోజకవర్గ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో క్యాడర్ మీటింగ్ నిర్వహించి పలు అభివృద్ధి, పార్టీ కార్యక్రమాలు తదితర విషయాలపై వారితో చర్చించారు.

# ఘనంగా మండాది క్రీస్తు లూథరన్ దేవాలయం ద్వితీయ వార్షికోత్సవం వేడుకలు



**క్రైం కౌంటర్ న్యూస్ వెల్దుర్తి.పులిమెల మాణిక్యం.** పల్నాడు జిల్లా,వెల్దుర్తి మండలం,మండాది గ్రామ ప్యారిస్ క్రీస్తు లూథరన్ దేవాలయం ద్వితీయ వార్షికోత్సవం వేడుకలు శుక్రవారం సంఘ కాపరి పాస్టర్ రెవరెండ్ అరుమళ్ళ సుధాకర్, సువార్త ఆధ్వర్యంలో వారి అధ్యక్షతన ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాస్టర్ రెవరెండ్ ఆళ్ళముడి జేమ్స్ పాల్గొని దైవ సందేశాన్ని అందజేశారు. ప్రతి ఒక్కరు ఏసుప్రభువు వారు చూపిన మార్గంలో నడవాలని యేసుక్రీస్తు పాపాన్ని ద్వేషించాడని పాపిని ప్రేమించాడని అందరూ ఒకరి పట్ల ఒకరు ప్రేమ కలిగి జీవించాలని దేవుడు ఆశీర్వాదాలు అందరికీ మెండుగా కలగాలని ద్వితీయ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.చర్చి డెలిగేట్,ఆల్టర్నేట్ డెలికేట్,పిసిసిలు, సంఘ పెద్దలు,స్త్రీల సమాజం,సంఘం యూత్ మరియు దళిత బహుజన భీమ్సేన రాష్ట్ర అధ్యక్షులు పేరుపోగు జార్జి,పల్నాడు జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటర్ కమిటీ మెంబర్ మరియు దళిత బహుజన సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు

డాక్టర్ కుక్కమూడి ప్రసాద్ మాట్లాడి క్రీస్తు లూథరన్ దేవాలయం ద్వితీయ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.వచ్చిన అతిథులను శాలవాలతో సంఘ పెద్దలు స్త్రీల సమాజం ఘనంగా సత్కరించారు. అనంతరం ముగింపు ప్రార్థన ఆశీర్వాదాలతో కార్యక్రమాన్ని ముగించారు వచ్చిన వారందరికీ ప్రేమతో విందు భోజనం ఏర్పాటు చేశారు. ఎమ్మార్పీఎస్ నాయకులు తాళ్లూరు యాకోబు,కొమ్ము రవికుమార్,దాసరి పెద్ద యాకోబు,పేరుపోగు కాంతారావు,దోరగొడ్ల అబ్రహం,అంకురి రాములు,పేరుపోగు పాపారావు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్థిక లావాదేవీల నేపథ్యంలో వ్యక్తి హత్య. హత్యతో ఉలిక్కిపడ్డ నరసరావుపేట.



**క్రైమ్ కౌంటర్ :నరసరావుపే(ప్రతినిధి.జి.ఎం.కె.గాంధీ) :** నరసరావుపేట ఆర్టీసీ బస్టాండ్‌లో శుక్రవారం జరిగిన దారుణ హత్య ఘటన స్థానిక ప్రజలను తీవ్ర భయాందోళనకు గురిచేసింది.ఎప్పుడూ రద్దీగా ఉండే బస్టాండ్ ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకోవడంతో ప్రయాణికులు, వ్యాపారులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించి దర్యాప్తు ప్రారంభించారు. వన్ టౌన్ సీఐ ఫిరోజ్ తెలిపిన వివరాల ప్రకారం మృతుడు నూజెండ్ల మండలం దాట్లవారిపాలేనికి చెందిన నాగిరెడ్డి కాగా, నిందితుడు మాచవరం మండలం చెన్నాయపాలేనికి చెందిన వెంకటేశ్వర్లుగా గుర్తించారు. ఇద్దరి మధ్య పాత ఆర్థిక లావాదేవీల విషయంలో వివాదం కొనసాగుతుండగా, అదే గొడవకు దారితీసినట్లు పోలీసులు తెలిపారు. ఈ క్రమంలో వెంకటేశ్వర్లు కర్రతో దాడి చేయడంతో నాగిరెడ్డి అక్కడికక్కడే మృతి చెందినట్లు వెల్లడించారు.మృతుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో విచారణ కొనసాగిస్తున్నారు. నిందితుడిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి.ఈ ఘటన నేపథ్యంలో బస్టాండ్ పరిసరాల్లో భద్రతను మరింత కట్టుదిట్టం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

# నరసరావుపేట పురపాలక సమస్యలను పరిష్కారించాలని వైసీపీ వినతి.

## క్షేత్రస్థాయిలో పరిశీలించి అన్ని సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తాం- కమిషనర్.

**క్రైమ్ కౌంటర్ :నరసరావుపేట. (ప్రతినిధి.జి.ఎం.కె. గాంధీ):** నరసరావుపేట పట్టణంలో ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీరు, పారిశుద్ధ్యం,టిడ్కో గృహాలు,ఆక్రమణల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని పల్నాడు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి శుక్రవారం నూతన మున్సిపల్ కమిషనర్ రమ్య కీర్తనను కోరారు. పట్టణంలోని కొన్ని ప్రాంతాల్లో దుర్వాసనతో కూడిన కలుషిత నీరు సరఫరా అవుతోందని దీనిపై అధికారులు వెంటనే స్పందించి చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

పట్టణంలో పారిశుద్ధ పరిస్థితి అధ్వానంగా మారిందని చెత్త సేకరణ మరియు డ్రైనేజీ శుభ్రత సక్రమంగా జరగడం లేదని ఆరోపించారు. స్టేడియం,హార్డ్ హైస్కూల్ పరిసరాల్లో ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయని వాటిని రక్షించి ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే పూర్తయిన టిడ్కో గృహాలను లబ్ధిదారులకు వెంటనే అందజేయాలని కోరారు.ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ నిర్వహించి పట్టణ ప్రజలకు భరోసా కల్పించాలని కమిషనర్‌కు విజ్ఞప్తితో కూడిన వినతి పత్రం అందచేశారు.పట్టణంలో పలు సమస్యలు తన దృష్టికి వచ్చాయని తాను నూతనంగా భాద్యతలు చేపట్టడం వలన పట్టణ మరియు



పురపాలక స్థితిగతులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అన్ని సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని ఈ సందర్భంగా కమిషనర్ రమ్య కీర్తన తెలిపారు.కార్యక్రమం లో వైసిపీ శ్రేణులు పాల్గొన్నారు.

# అర్ధరాత్రి ప్రమాదం..

**మే 15 క్రైమ్ కౌంటర్ న్యూస్):** ఎన్టీఆర్ జిల్లా తిరువూరు పట్టణ శివారులోని బైపాస్ రోడ్డుపై జరిగిన ఓ రోడ్డు ప్రమాదం తీవ్ర కలకలం రేపింది. బజాజ్ షోరూం సమీపంలో బ్రేక్ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. రహదారిపై ఆపి ఉన్న లారీని వెనుక నుంచి వేగంగా వచ్చిన మరో లారీ బలంగా ఢీకొనడంతో ఈ ఘటన జరిగింది. ఈ ప్రమాదంలో ఒక లారీ డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే గమనించిన స్థానికులు, పోలీసులు బాధితుడిని చికిత్స నిమిత్తం తిరువూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అయితే, బాధితుడి పరిస్థితి విషమంగా ఉండటంతో, వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం విజయవాడకు తరలించారు.ఈ ఘటన నేపథ్యంలో రవాణా శాఖ అధికారుల తీరుపై స్థానిక వాహనదారులు, బాధితులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# బుచ్చియ్యపాలెంలో 84వ రోజు ప్రజల వద్దకు ప్రవీణ్




**క్రైం కౌంటర్ కోటేశ్వరరావు పెదకూరపాడు న్యూస్ :** పెదకూరపాడు మండలం బుచ్చయ్యపాలెం గ్రామంలో 84వ రోజు ప్రజల వద్దకు ప్రవీణ్ వంద రోజులు 100 గ్రామాలు కార్యక్రమంలో పెదకూరపాడు శాసనసభ్యులు భాష్యం ప్రవీణ్ శుక్రవారం పాల్గొన్నారు . ముందుగా ఎమ్మెల్యే కి గ్రామం తరపు నుండి గ్రామ నాయకులు పరుచూరి నాని ఆధ్వర్యంలో గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు . అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాలలో ప్రజలు ఇబ్బంది పడుతున్న వివిధ రకాల సమస్యల పరిష్కారం కొరకు ప్రజల వద్దకు ప్రవీణ్ కార్యక్రమం చేపట్టామన్నారు. సమావేశంలో వచ్చిన అర్జీలను స్వీకరించి పరిష్కరించే సమస్యలను అప్పటికప్పుడే పరిష్కరించారు. కూటమి ప్రభుత్వాన్ని అన్ని వర్గాలు ఆదరిస్తున్నాయని తెలిపారు . రాబోయే రోజుల్లో పెదకూరపాడు నియోజకవర్గాన్ని మరింతగా అభివృద్ధి చేస్తామని తెలియజేశారు. గ్రామంలో ఇప్పటివరకు జరిగిన ప్రభుత్వ సంక్షేమాన్ని గ్రామ ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో పెదకూరపాడు మండల పార్టీ అధ్యక్షులు ఏటుకూరి బ్రహ్మయ్య, 75 తాళ్లూరు సొసైటీ చైర్పర్సన్ ఏటుకూరి రత్నకుమార్, పల్నాడు జిల్లా ఉపాధ్యక్షురాలు షేక్ ముంతాజ్, పెదకూరపాడు ప్రభుత్వ ఆస్పటల్ అభివృద్ధి కమిటీ చైర్మన్ మండల యువ నాయకులు అన్నా ప్రసాద్ ఇంకా ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

Published by katikala Vara Prasad. Owned by katikala Vara Prasad. Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006.published at D.no465 Le out no2 .Dodleru Road.Ysr Jagananna colony.Krosuru. Guntur AP. 522410. Editor. Katikala Vara Prasad.RNI APTEL/25/A2478. Ph:9849707349 . email:kvp6858@gmail.com.

## జర్నలిస్టులు కావలెను

క్రైం కౌంటర్ తెలుగు దినపత్రిక గత 15 సంవత్సరాలుగా పత్రికా రంగంలో ప్రత్యేక గుర్తింపు కలిగిన క్రైం కౌంటర్ తెలుగు దిన పత్రికలో పనిచేసేందుకు ఆసక్తి, అనుభవం కలిగిన జర్నలిస్టులు కావలెను.

ప్రకాశం

APTEL/25/A2843

# క్రైం కౌంటర్

webisite:www.crimecounter.in ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం తెలుగు దిన పత్రిక

సంపుటి : 02 సంచిక : 166 శనివారం 16- 05 - 2026 పేజిలు : 4 వెల. 2



## రిపోర్టర్లు కావలెను

క్రైం కౌంటర్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో

- జిల్లా బ్యూరోలు
- జిల్లా ఇన్‌చార్జీలు
- నియోజక వర్గ ఇన్‌చార్జీలు

కావలెను.

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

98497 07349


## ట్రావెల్స్ బస్సు దగ్ధం



క్రైమ్ కౌంటర్ న్యూస్.... ప్రకాశం జిల్లా....ప్రకాశం జిల్లా లో తెల్లవారుజామున ట్రావెల్ బస్సు లోని ప్రయాణికులకు తప్పిన పెను ప్రమాదం...జిల్లా లోని ఉలవపాడు మండలం భీమవరం అడ్డరోడ్డు వద్ద ట్రావెల్స్ బస్సు ఇంజిన్ నుంచి పొగలు వచ్చి మంటలు వ్యాపించి

అక్కడికక్కడే దగ్ధమైన బస్సు...

బస్సులో పొగలు వస్తుండగా గమనించి చాకచక్యంగా బస్సును పక్కకు ఆపి ప్రయాణికులను దింపిన డ్రైవర్...

దీంతో ప్రమాదం నుండి బయటపడ్డ ప్రయాణికులు...

హైదరాబాదు నుంచి తిరుపతి వస్తు దగ్ధమైన కావేరీ ట్రావెల్స్ బస్సు...

ప్రమాద సమయంలో బస్సులో ప్రయారిస్తున్న 36 మంది ప్రయాణికులు...

## అన్నపురెడ్డి వారి వివాహ రిసెప్షన్ లో పాల్గొన్న మాజి ఎమ్మెల్యే అన్నా



క్రైమ్ కౌంటర్ న్యూస్....మార్కాపురం జిల్లా....మార్కాపురం పట్టణంలోని మాధవి ఫంక్షన్ హాల్ నందు అన్నపురెడ్డి రామిరెడ్డి,ప్రమీల గార్ల కుమారుడు వివాహ రిసెప్షన్ కు హాజరుఅయి నూతన వధూవరులు అయిన డాక్టర్ విద్యాసాగర్,డాక్టర్ మౌలిక గార్లను ఆశీర్వదించిన గిద్దలూరు మాజి శాసనసభ్యులు,మార్కాపురం నియోజకవర్గ వైఎస్సార్సీపీ ఇంచార్జి అన్నా రాంబాబు , మరియు తదితరులు పాల్గొన్నారు...





క్రైమ్ కౌంటర్ న్యూస్... మార్కాపురం జిల్లా....మార్కాపురం పట్టణంలోని గడియార స్తంభం సమీపంలో పండ్ల వ్యాపారులకు మున్సిపల్ కమిషనర్ నారాయణరావు సర్కిల్ ఇన్స్పెక్టర్ అల్తాఫ్ హుస్సేన్, పట్టణ ఎస్సై విశ్వనాథరెడ్డి కౌన్సిలింగ్ చేపట్టి ట్రాఫిక్ కు అంతరాయం కలగకుండా తోపుడు బండ్లు, మరియు పూలకోట్ల యజమానులకు పలు సూచనలు సలహాలు చేశారు....



## మంత్రి శుభాకాంక్షలు తెలిపిన ఇర్ఫాన్

క్రైమ్ కౌంటర్ న్యూస్....మార్కాపురం జిల్లా.... ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, నంద్యాల,శాసనసభ. సభ్యుడు శ్రీ చీవీణ. ఫరూక్ ,కి మర్యాదపూర్వకంగా కలుసుకుని జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మార్కాపురం జిల్లా, గిద్దలూరుకు చెందిన మైనారిటీ యువ నాయకుడు, షేక్ ఇర్ఫాన్

## ఠాగూర్ గ్రంధాలయంకు ఏ. సి. బహుకరణ



ఒంగోలు క్రైశీ కౌంటర్ ప్రతినిధి.ఠాగూర్ గ్రంథాలయమునకు చదువుకుంటున్న వారు చదువుకుని ఉద్యోగం వచ్చిన విద్యార్థులు కలసి ఏసిను బహుకరించారు. మహాత్మా గాంధీ రోడ్డులోని ఠాగూర్ గ్రంథాలయంలో రిఫరెన్స్ విభాగము మొదటి అంతస్తు.. పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న విద్యార్థులు ఎండ వేడిమి కి చదువుకోలేక చాలా ఇబ్బంది పడుతున్నారు. గతంలో ఉన్న ఏసీలు పనిచేయుట లేదు. రిపేరుకు కూడా పనికిరావు .కొత్తవి కొనడానికి బడ్జెట్ లేని కారణంగా ఏమి చేయలేని స్థితిలో గ్రంథాలయం వారు ఉన్నారు.విద్యార్థులు ఆలోచించిప్రస్తుతం జాబ్ క్యాలెండర్ వచ్చిన సందర్భంగా లైబ్రరీకి వచ్చే చదువుకునే విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను గ్రహించిన ఎనిమిది మంది విద్యార్థులు కలిసి రూ 35వేల రూపాయలు. చందా వేసుకుని గోద్రెజ్ ఏసీ ని గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం ఎస్ బేగ్ చేతులు మీదగా ఠాగూర్ గ్రంథాలయానికి బహూకరించారు. చైర్మన్ మాట్లాడుతూగ్రంథాలయంలో చదువుకునే విద్యార్థుల సౌకర్యార్థం ఏ. సి. బహకరించటం ఎంతో గొప్ప విషయం అని విద్యార్థులను అభినందించారు విద్యార్థులు చదువుకు అనుకూలమైన వాతావరణం కలి పించాలనే ఆలోచనతో ముందుకు వచ్చిన విద్యార్థులను ప్రశంసించారు. తోటి విద్యార్థుల భవిష్యత్తు కోసం చేసిన ఈ సహాయం ఎంతో విలువైనది. ప్రశాంతమైన వాతావరణంలో చదివే అవకాశం ఉంటే విద్యార్థులు మరింత ఏకాగ్రతతో అభ్యసించగలరు అని తెలిపారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయటం సమాజానికి ఆదర్శంగా నిలుస్తారు అన్నారు. ఈ ఏసీ కొనుగోలుకి సహకరించిన విద్యార్థులను తాడేపల్లి ప్రవల్లిక . మనోహర్ భాగ్యశ్రీ సుజాత పెద్ది అన్నారావు.మైనర్ బాబు భాగ్యవతి శుభ ఎనిమిది మంది విద్యార్థుల సహకారంతో గ్రంథాలయానికి ఏసీ అందించినందుకు గ్రంథాలయ అధికారి కే రమాదేవి వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో రిఫరెన్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

## ఫుట్ పాత్ లను ఆక్రమిస్తే చర్యలు ఎస్సై శివ నాగరాజు



క్రైం కౌంటర్ ప్రతినిధి కందుకూరు రూరల్ ,టి. నాగ బ్రహ్మాం,ఫుట్ పాత్ ఆక్రమించి టాపిక్ కు ఇబ్బందులునుకలిగిస్తే చర్యలనుతీసుకుంటామని పట్టణ ఎస్సై శివ నాగరాజు తెలిపారు. పట్టణంలోని పామూరు రోడ్డు లో ఫుట్ పాత్ ని ఆక్రమించిన షాపుల యజమానుల చేత ఖాళీ చేయించారు. ఫుట్ పాత్ లను ఆక్రమిస్తే నాక్రమిస్తే చర్యలను తీసుకుంటామని హెచ్చరించారు. ఫుట్ పాత్ లు ఆక్రమించడం వలన ట్రాఫిక్ ఇబ్బందులు కలుగుతున్నాయని షాపుల యజమానులు సహకరించాలని కోరారు.

## రక్తదానం చేసిన యస్.ఐ కాకునూరి మాల్యాద్రి రెడ్డి



క్రైం కౌంటర్ ప్రతినిధి కందుకూరు టౌన్,విజయవాడలోని మణిపాల్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న ఒక పేషెంట్ కి హార్ట్ సర్జరీ నిమిత్తం అత్యవసరంగా అరుదు గ్రూపు అయిన ఓ వీ ఈ రక్తం అవసరం అని సామాజిక మాధ్యమాల ద్వారా తెలుసుకున్న బ్లడ్ డోనర్స్ గ్రూప్ సభ్యుడు కందుకూరు మండలం లోని మాచవరం రెడ్డిపాలెం గ్రామానికి చెందిన యస్.ఐ కాకునూరి మాల్యాద్రి రెడ్డి వెంటనే స్పందించి విజయవాడలోని మణిపాల్ హాస్పిటల్ కి వెళ్లి రక్తదానం చేశారు. ఆపద సమయంలో ఆదుకుని అరుదు గ్రూపు రక్తదానం చేసిన మాల్యాద్రి రెడ్డి కు పేషెంట్ తరఫున కృతజ్ఞతాభివందనాలను తెలిపారు. ఈ సందర్భంగా కందుకూరు రెడ్ క్రాస్ సబ్ బ్రాంచ్ చైర్మన్ చెన్న వెంకట రామాంజనేయులు మాట్లాడుతూ అరుదు గ్రూపు రక్తం కలిగి ఉన్న మాల్యాద్రి రెడ్డి గతంలో అనేకసార్లు రక్తదానం చేసి ఎంతోమంది ప్రాణాలను కాపాడి సాటి పోలీసు సిబ్బందికి ఆదర్శంగా నిలిచారని అభినందించారు. రక్తదాత అయిన యస్.ఐ కాకునూరి మాల్యాద్రి రెడ్డి మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమని, రక్తదానం చేయడం వల్ల కలిగే ఆత్మ తృప్తి చాలా గొప్పగా ఉంటుందని,ఆరోగ్యవంతమైన యువత అందరూ రక్తదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు.



క్రైమ్ కౌంటర్ న్యూస్...మార్కాపురం జిల్లా....మార్కాపురం పట్టణంలోని విహారి ఫంక్షన్ హాల్ నందు బి.ఎల్.ఎ లకు ఎస్.ఐ.ఆర్ అవగాహన సదస్సు కార్యక్రమంలో పాల్గొన్న మార్కాపురం వైఎస్ఆర్సిపి నియోజకవర్గ ఇన్చార్జ్ అన్నా రాంబాబు , మరియు రాష్ట్ర బూత్ లెవెల్ కార్యదర్శి శంకర్ రెడ్డి స్టేట్ సెక్రటరీ రమణారెడ్డి స్టేట్ బూత్ లెవెల్ కార్యదర్శి పత్తి రవిచంద్ర మార్కాపురం పట్టణ అధ్యక్షులు షేక్ సలీం మార్కాపురం మండల అధ్యక్షులు చెంచు రెడ్డి మార్కాపురం మున్సిపల్ మాజీ చైర్మన్ బాలమురళీకృష్ణ , మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ అంజమ్మ శ్రీనివాస్ రావు మున్సిపల్ వార్డుల పరిశీలికులు బట్టగిరి తిరుపతి రెడ్డి , మరియు పార్టీ ముఖ్యనాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ట్రావెల్స్ బస్సులోఇంజిన్‌లో చెలరేగిన మంటలు




క్రైం కౌంటర్ ప్రతినిధి కంచర్ల మల్లికార్జున రావు నియోజకవర్గ ఇన్చార్జి కందుకూరు,వరుసగా చోటుచేసుకుంటున్న బస్సు ప్రమాదాలు ప్రయాణికులను తీవ్ర భయాందోళనకు గురిచేస్తున్నాయి. తాజాగా ప్రకాశం జిల్లా రాజుపాలెం వద్ద కావేరి ట్రావెల్స్ బస్సులో అగ్నిప్రమాదం సంభవించింది. హైదరాబాద్ నుండి తిరుపతి వెళ్తున్న బస్సు ఇంజిన్‌లో అకస్మాత్తుగా మంటలు చెలరేగడాన్ని గమనించిన డ్రైవర్, అప్రమత్తమై బస్సును వెంటనే నిలిపివేశారు. ఆ సమయంలో బస్సులో సుమారు 36 మంది ప్రయాణికులు ఉండగా, మంటలు వ్యాపించకముందే వారంతా సురక్షితంగా కిందకు దిగడంతో పెను ప్రమాదం తప్పింది. ప్రయాణికులందరూ క్షేమంగా బయటపడటంతో అధికారులు, బంధువులు ఊపిరిపీల్చుకున్నారు.

## అనుమలవీడు దేవుడి ఆవుల అపహరణపై రాచర్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు



క్రైమ్ కౌంటర్ న్యూస్.... మార్కాపురం జిల్లా...రాచర్ల మండలం అనుమలవీడు గ్రామంలో దేవుడికి చెందిన రెండు ఆవులు అపహరణకు గురైన సంఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. గుర్తుతెలియని దుండగులు ఈ ఆవులను దొంగిలించారని, వారిపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం రాచర్ల సబ్ ఇన్స్పెక్టర్ (గాx) ,కి రాతపూర్వక ఫిర్యాదు అందజేశారు.
ఒంగోలు పార్లమెంట్ ట్రెజరర్ శ్రీ అంబవరం. శ్రీనివాస రెడ్డి , ఆధ్వర్యంలో, స్థానిక టీడీపి (ఒణా) నాయకులు, అనుమలవీడు గ్రామ పెద్దలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదును అందజేశారు.
ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. గ్రామస్తుల సెంటిమెంట్‌తో, భక్తిభావాలతో ముడిపడి ఉన్న దేవుడి ఆవులను దొంగిలించడం అత్యంత విచారకరమన్నారు. పోలీసులు, ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకుని, సమగ్ర విచారణ జరిపి దోషులను త్వరగా పట్టుకోవాలని డిమాండ్ చేశారు . అపహరణకు గురైన ఆవులను సురక్షితంగా రికవరీ చేసి గ్రామానికి అప్పగించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో అనుమలవీడు గ్రామ ప్రముఖులు, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు మరియు భక్తులు పాల్గొన్నారు.....

## 90 రోజుల యాక్షన్ ప్లాన్: ఏపీ డీజీపీ..

క్రైం కౌంటర్ న్యూస్,మే 15: అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో పెరుగుతున్న సైబర్ నేరాలపై పోలీస్ శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. ఏపీ సైబర్ గార్డ్ ఆపరేషనల్ ప్లాన్‌తో పాటు సైబర్ క్రైమ్ నిర్వహణ వ్యవస్థ పునర్వ్యవస్థీకరణపై ఏపీ డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎస్పీలు, పోలీస్ కమిషనర్లు, రేంజ్ అధికారులు, టెక్నికల్ సర్వీసెస్ విభాగం అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా మాట్లాడుతూ.. సాంకేతిక ఆధారిత పోలీసింగ్‌లో ఆంధ్రప్రదేశ్ ఎప్పటికప్పుడు ముందంజలో కొనసాగుతోందన్నారు. అయితే ఇటీవలి కాలంలో సైబర్ నేరాలు పెరిగాయన్నారు. దీంతో సైబర్ నేరాల నియంత్రణ వ్యవస్థను అత్యవసరంగా మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఏర్పడిందని డీజీపీ అభిప్రాయపడ్డారు. పోలీస్ శాఖ, ఐటీ శాఖతో పాటు ఇతర అనుబంధ సంస్థలతో విస్తృత స్థాయిలో చర్చలు జరిపిన అనంతరం 90 రోజుల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసినట్లు తెలిపారు. సైబర్ నేరాల నియంత్రణ బాధ్యత కేవలం ప్రత్యేక విభాగాలకే పరిమితం కాకుండా ప్రతి జిల్లా పోలీస్ యంత్రాంగం చురుకుగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. సైబర్ మోసాల బాధితులకు తక్షణ సహాయం అందించడంలో గోల్డెన్ అవర్ అత్యంత కీలకమని డీజీపీ స్పష్టం చేశారు. 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు వచ్చిన తొలి 30 నిమిషాల్లోనే చర్యలు ప్రారంభిస్తే బాధితులు కోల్పోయిన డబ్బును రికవరీ చేసే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని పేర్కొన్నారు.

# ప్రతి జిల్లాలో రుతుపవనాల ప్రవేశ సమాచారం

క్రైం కౌంటర్ న్యూస్ మే 15: కృత్రిమ మేధ(ఏఐ) సహాయంతో రైతులకు మరిన్ని సేవలు అందించేందుకు భారత వాతావరణ శాఖ(ఐఎండీ) రెండు టూల్స్‌ను అభివృద్ధి చేసింది. వీటి ద్వారా ప్రతి కిలోమీటరు ప్రాంతంలో వర్షం ఎప్పుడు పడుతుందనేది పది రోజులు ముందుగానే ఏఐ సాయంతో తెలియనుంది. ఐఎండీలోని కీలక విభాగం 'నేషనల్ సెంటర్ ఫర్ మీడియం రేంజ్ ఫోర్‌కాస్టింగ్' ఏఐ సాయంతో ఒక టూల్‌ను అభివృద్ధి చేసింది. దీనిద్వారా ప్రయోగాత్మకంగా మొదట ఉత్తరప్రదేశ్‌లో రైతులకు ఈనెల 12వ తేదీ నుంచి ఐఎండీ బులెటిన్లు విడుదల చేస్తోంది. ఇది ముఖ్యంగా రైతులకు ఎంతగానో ఉపయోగపడనుంది. ఎక్కువగా ఆటోమేటిక్ రెయిన్‌గేజ్‌లు, ఆటోమేటిక్ వెదర్ స్టేషన్లు ఉన్న యూపీ కోసం దీన్ని అభివృద్ధి చేశారు. ఒక ప్రాంతంలో వర్షపాతం వివరాలు, ఉపగ్రహాలు, డాప్లర్ వెదర్ రాడార్ల నుంచి సేకరించిన సమాచారాన్ని క్రోడీకరించి పది రోజులు ముందుగా వర్షపాతం ఎంత పడుతుందనేది లెక్కకట్టి రైతులకు సమాచారం అందించవచ్చని భూ విజ్ఞాన మంత్రిత్వశాఖ కార్యదర్శి ఎం.రవిచంద్రన్ తెలిపారు. దీనివల్ల రైతులు ఏ పంట వేయాలి? ఏ విత్తనాలు చల్లాలి? నీటి పారుదల, పంట రక్షణ ప్రణాళిక, పంట కోత వంటి విషయాలపై నిర్ణయం తీసుకునే అవకాశం లభిస్తుందన్నారు. పెరుగుతున్న వాతావరణ వైపరీత్యాలు, తీవ్రమైన ఘటనల దృష్ట్యా భవిష్యత్తులో దేశంలోని ఇతర ప్రాంతాలకు ఈ సాంకేతికతను విస్తరిస్తామన్నారు. ఇదిలావుండగా ప్రతి జిల్లాలో నైరుతి రుతుపవనాలు ఎప్పుడు ప్రవేశిస్తాయనేది చెప్పే టూల్‌ను పుణేలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ట్రోఫికల్ మెట్రాలజీ సంస్థ అభివృద్ధి చేసింది. ఏఐ ఆధారిత సాంకేతికతతో దీనిని రూపొందించారు.దీనితో దేశంలోని వివిధ ప్రాంతాలు,



ప్రత్యేకించి ప్రతి జిల్లాలో రుతుపవనాల ప్రవేశం తదితర విషయాలను నిశితంగా పరిశీలిస్తున్నారు. ఇప్పటివరకూ దేశవ్యాప్తంగా రుతుపవనాల ప్రవేశం, పురోగతి వివరాలు అందిస్తున్న ఐఎండీ.. ఇక నుంచి ప్రాంతాలు, జిల్లాల వారీగా రుతుపవనాల తీరుతెన్నులను వివరించనుంది. దీనివల్ల వర్షపాతం అంచనాల్లో కచ్చితత్వం వస్తుందని ఐఐటీఎం ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. 16 రాష్ట్రాలు, 3,196 బ్లాకుల్లో సూక్ష్మస్థాయి వర్షపాతం పర్యవేక్షణ అందుబాటులోకి వస్తుందన్నారు. కొత్తగా అభివృద్ధి చేసిన రెండు టూల్స్ వ్యవసాయం, నీటి వనరుల నిర్వహణ, విపత్తుల నిర్వహణకు ఎంతగానో ఉపయోగపడతాయని వాతావరణ నిపుణులు పేర్కొంటున్నారు.

# 82వేల కిలోల నుంచి 2.26లక్షల కిలోలకు పెరిగిన సామర్థ్యం




క్రైం కౌంటర్ న్యూస్ మే 15: తిరుమలలో నెయ్యి నిల్వల సామర్థ్యం పెరిగింది. 82 వేల కేజీల నుంచి 2.26 లక్షల కేజీల నెయ్యిని నిల్వ చేసుకునేలా నిర్మించిన నూతన ట్యాంకర్లు అందుబాటులోకి వచ్చాయి. శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులందరికీ లడ్డూ ప్రసాదం అందేలా టీటీడీ ప్రస్తుతం 4 నుంచి 4.50 లక్షల లడ్డూలను తయారు చేస్తున్న విషయం తెలిసిందే. విశేష పర్వదినాలు, ఉత్సవాలు, రద్దీ సమయాల్లో అదనంగా మరో 3లక్షల నుంచి 4 లక్షల లడ్డూలను కూడా తయారు చేస్తారు. ఇక, నైవేద్య ప్రసాదాల కోసం కూడా నెయ్యి అధికంగా వినియోగిస్తారు. ఇలా రోజుకు 15వేల నుంచి 16 వేల కేజీల నెయ్యిని వాడతారు. నెయ్యి వినియోగం అధికంగా ఉన్న క్రమంలో రోజూ రెండు మూడు లారీల నెయ్యి నిల్వలు తిరుమలకు చేరుకుంటున్నాయి. ఈనేపథ్యంలో నెయ్యిని నిల్వ చేసుకునే విషయంలో ఎలాంటి ఇబ్బందులు ఉండకూడదనే ఉద్దేశంతో దాతల సహకారంతో టీటీడీ అదనపు ట్యాంకర్లను అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించింది. చెన్నైకి చెందిన ఓ సంస్థ 36వేల కేజీల సామర్థ్యంతో పుష్కరిణి పక్కనే ఉన్న నెయ్యి నిల్వ కేంద్రంలో నాలుగు భారీ ట్యాంకర్ల నిర్మాణం చేపట్టి ఇటీవల పూర్తిచేసింది. గతంలో 12 ట్యాంకర్ల ద్వారా కేవలం 82 వేల కేజీలను మాత్రమే నిల్వ చేసుకునే అవకాశముండేది. ప్రస్తుతం మరో నాలుగు ట్యాంకర్లు అందుబాటులోకి రావడంతో మొత్తం 16 ట్యాంకర్ల ద్వారా 2.26 లక్షల కిలోల నెయ్యిని నిల్వ చేసుకునే వెసులుబాటు కలిగింది. అంటే దాదాపు 15 నుంచి 16 రోజులకు సరిపడా నెయ్యిని నిల్వ చేసుకునే అవకాశం ఏర్పడింది. ప్రస్తుతం నూతన ట్యాంకర్లను పరిశీలిస్తున్నారు. గుర్తించిన లోటుపాట్లను సవరించి త్వరలోనే ప్రారంభించనున్నారు. అలాగే భవిష్యత్తులో మరో లక్ష కేజీలకు కూడా నెయ్యి నిల్వలను పెంచేలా టీటీడీ ప్రణాళికలు రూపొందించుకుంది. కాగా, నెయ్యి నిల్వ సామర్థ్యం పెరిగిన క్రమంలో కొత్తగా వచ్చే నెయ్యిని పూర్తిస్థాయిలో పరీక్షించేందుకు సమయం ఉంటుంది. ఒకవేళ కల్తీని గుర్తించినా దాన్ని వెనక్కి పంపి మళ్లీ నాణ్యమైన నెయ్యిని తెప్పించుకునే అవకాశం కలుగుతుంది. తద్వారా నాణ్యమైన నెయ్యే వినియోగించే వెసులుబాటు కలుగుతుందని అధికారులు భావిస్తున్నారు.

# కోస్తాంధ్రకు దూరంగా తీవ్ర అల్పపీడనం

క్రైం కౌంటర్ న్యూస్ మే 15: నైరుతి, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర అల్పపీడనం గురువారం ఈశాన్యంగా పయనించి కోస్తాంధ్ర, తమిళనాడు తీరాలకు దూరంగా వెళ్లింది. ఇది వచ్చే 36 గంటల్లో ఈశాన్య, మధ్య బంగాళాఖాతంలోకి ప్రవేశించే క్రమంలో వాయుగుండంగా మారి...ఆ తర్వాత మయన్మార్ తీరం దిశగా వెళ్లనుంది. తీవ్ర అల్పపీడనం ప్రభావంతో భూమధ్యరేఖ మీదుగా బలమైన తేమగాలులు హిందూ మహాసముద్రం దిశగా వీస్తున్నాయి. ఈ నేపథ్యంలో నైరుతి రుతుపవనాలు శనివారం నాటికి దక్షిణ బంగాళాఖాతం, అండమాన్ సముద్రం, అండమాన్, నికోబార్ దీవుల్లోకి ప్రవేశించనున్నాయని భారత వాతావరణ శాఖ(ఐఎండీ) తెలిపింది. సాధారణంగా మే 20 కల్లా అండమాన్ నికోబార్ దీవులు, పరిసరాల్లోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశించాలి. బంగాళాఖాతంలో అనుకూల పరిస్థితులు నెలకొనడంతో ఈనెల 15 తేదీకే దక్షిణ బంగాళాఖాతం, అండమాన్ సముద్రం, అండమాన్, నికోబార్ దీవుల్లోకి రుతుపవనాలు ప్రవేశిస్తాయని ప్రైవేటు వాతావరణ సంస్థ స్కైమెట్ తెలిపింది. వచ్చే రెండు, మూడు రోజుల్లో కేరళ, తమిళనాడు, కర్ణాటకల్లో రుతుపవన ముందస్తు వర్షాలు కురవనున్నాయని వాతావరణ నిపుణులు వెల్లడించారు. ఈ ఏడాది కేరళను ముందుగానే నైరుతి రుతుపవనాలు తాకే అవకాశం ఉందని అంచనా వేశారు. కాగా, రాష్ట్రంలో ఎక్కువచోట్ల గురువారం ఎండ తీవ్రత, ఉక్కపోత కొనసాగాయి. ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు, మూడు డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి. అత్యధికంగా నంద్యాల జిల్లా సంజామలలో 43.3 డిగ్రీలు, కర్నూలు జిల్లా కౌతాళంలో 42.9, అనంతపురం జిల్లా తెరన్నపల్లిలో 42.8, చిత్తూరు జిల్లా రాయలపేట, కడప జిల్లా జమ్మలమడుగులో 42.2, ప్రకాశం జిల్లా కొప్పెరపాడులో 42 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.



17 జిల్లాల్లోని 126 మండలాల్లో 40 డిగ్రీలపైన ఉష్ణోగ్రత నమోదైంది. అక్కడక్కడ వర్షాలు పడ్డాయి. రానున్న రెండు, మూడు రోజుల్లో చెదురుమదురుగా వర్షాలు కురుస్తాయని, ఎక్కువ ప్రాంతాల్లో ఎండలు పెరిగి, వడగాడ్పులు వీస్తాయని వాతావరణ నిపుణుడొకరు తెలిపారు. శుక్రవారం 43-44 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయ్యే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. అల్లూరి, పోలవరం, కోనసీమ, తూర్పుగోదావరి, ఎన్టీఆర్, అనంతపురం జిల్లాల్లోని 20 మండలాల్లో వడగాడ్పుల ప్రభావం ఉంటుందని పేర్కొంది. అల్లూరి, పోలవరం, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, కడప జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపింది.



# మరో 312 కుటుంబాలకు

క్రైం కౌంటర్ న్యూస్ మే 15: పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు రాష్ట్ర ప్రభుత్వం వరుసగా పరిహారాన్ని చెల్లిస్తోంది. 2024లో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక మూడు దఫాలుగా సంక్రాంతి, దీపావళి, ఉగాది పర్వదినాల్లో నిర్వాసిత కుటుంబాలకు పరిహారం చెల్లించింది. తాజాగా 600 కోట్ల పరిహారం చెల్లిస్తోంది. 14 గ్రామాలకు చెందిన 1250 మంది నిర్వాసితులకు రూ.300 కోట్లు, అలాగే వన్‌టైమ్ సెటిల్‌మెంట్(ఓటీఎస్) కింద 312 నిర్వాసిత కుటుంబాలకు మరో 300 కోట్లు అందజేయనుంది. శుక్రవారం వెలగపూడి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చెక్కులు అందజేయనున్నారు. 190 గిరిజన కుటుంబాలకు భూమికి భూమి పథకంలో పట్టాలు అందజేస్తారు. ఈ కార్యక్రమంలో మంత్రి నిమ్మల రామానాయుడు, జల వనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశిభూషణ్ కుమార్, ఆర్‌అండ్‌ఆర్ కమిషనర్ ప్రశాంతి, జల వనరుల శాఖ సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు, ఈఎన్‌సీ నరసింహమూర్తి తదితరులు పాల్గొంటారు. వచ్చే ఏడాది జూన్ నాటికి పోలవరం ప్రాజెక్టు తొలిదశ పూర్తికానున్న నేపథ్యంలో ఈలోపు 41.15 మీటర్ల కాంటూరులో 119 టీఎంసీల గోదావరి జలాలను నిల్వ చేసేలా ముంపు ప్రాంతాల కుటుంబాలకు సహాయ, పునరావాస కార్యక్రమాన్ని అమలు చేయాలని జల వనరుల శాఖ నిర్ణయించింది. వచ్చే ఏడాది మార్చి నాటికి సహాయ, పునరావాస కార్యక్రమాలను పూర్తి చేస్తామని ఇటీవల ఢిల్లీలో కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ కార్యదర్శి కాంతారావుకు పోలవరం సహాయ, పునరావాస కమిషనర్ ప్రశాంతి స్పష్టం చేశారు. సహాయ, పునరావాస కార్యక్రమాలకు కేంద్రం నిధులు మంజూరు చేయడంతో దాదాపు రూ.600 కోట్ల మేర పరిహారం చెల్లించేందుకు ప్రశాంతి జాబితాను సిద్ధం చేశారు.

# ఆర్డీటీ ఆస్పత్రి సందర్శన సందర్భంగా మంత్రి లోకేశ్



**క్రైం కౌంటర్ న్యూస్ మే 15:** పేదలకు రూరల్ డెవల్‌పమెంట్ ట్రస్ట్ (ఆర్డీటీ) అందిస్తున్న సేవలు రాయలసీమ వరకే పరిమితం కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించాల్సిన అవసరం ఉందని టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి లోకేశ్ అన్నారు. శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లిలోని ఆర్డీటీ ఆస్పత్రిని ఆయన గురువారం సందర్శించారు. ఆ సంస్థ వ్యవస్థాపకుడు ఫాదర్ విన్సెంట్ పెర్రర్ ఘాట్ వద్ద నివాళులర్పించారు. విన్సెంట్ సతీమణి, ఆర్డీటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అన్నే ఫెర్రర్, తనయుడు, ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్, కూతురు యమున, ఆమె భర్త సంజీవ్‌తో మాట్లాడారు. ఆర్డీటీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులతో మంత్రి లోకేశ్ మాట్లాడారు. తలసేమియా బాధిత చిన్నారులను పరామర్శించారు.

పాదయాత్రలో కళ్లారా చూశా..

ఆర్డీటీ సేవల గురించి తాను గతంలో విన్నానని, యువగళం పాదయాత్ర సమయంలో కళ్లారా చూశానని లోకేశ్ మీడియాతో మాట్లాడుతూ చెప్పారు. ఆర్డీటీ పాఠశాలలో దివ్యాంగ పిల్లలను సొంతబిడ్డల్లా చూసుకుంటున్న దృశ్యాలను స్వయ ంగా చూశానన్నారు. నిరుపేదలకు వైద్యం, విద్య, గృహాలు, యువతకు క్రీడల్లో ప్రోత్సాహం వంటి ఎన్నో అద్భుత కార్యక్రమాలను ఫెర్రర్ కుటుంబం 52 ఏళ్ల నుంచి అందిస్తోందని కొనియాడారు. ఆర్డీటీ కష్టాలను ఎదుర్కొన్నపుడు ఆసంస్థకు అండగా నిలబడటం తమ బాధ్యత అని సీఎం చంద్రబాబుతోపాటు కూటమి నేతలంతా కలిసికట్టుగా నిలబడ్డామని వెల్లడించారు. సంస్థపై కేంద్ర ప్రభుత్వానికి ఉన్న కొన్ని అపోహలను తొలగించి, ఫారిన్ కంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ యాక్ట్ (ఎఫ్‌సీఆర్‌ఏ) లైసెన్సులు రెన్యువల్ చేయించి, అండగా నిలబడ్డామని తెలిపారు.

లోకేశ్‌కు కృతజ్ఞతలు: మాంఛో ఫెర్రర్

ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏను రెన్యువల్ చేయించేందుకు ప్రత్యేకంగా కృషి చేసిన మంత్రి లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామని ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్ అన్నారు. తాను లోకేశ్‌ను కలిసినప్పటి నుంచి తమ సంస్థకు అండగా నిలుస్తూ వచ్చారని ఆయన చెప్పారు.

# అత్యాధునిక పరికరాలతో అత్యుత్తమ వైద్యం

**క్రైం కౌంటర్ న్యూస్ మే 15:** దేశంలోనే లెవల్-1 స్థాయి గుర్తింపు పొందిన అతి కొద్ది క్యాన్సర్ సెంటర్లలో ఒకటిగా గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రి నాట్కో క్యాన్సర్ సెంటర్ నిలిచిందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. గురువారం గుంటూరు జీజీహెచ్‌లోని నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో రూ.18 కోట్లతో ఏర్పాటు చేసిన పెట్ స్కాన్ (పాజిట్రాన్ ఎమిషన్ టోమోగ్రఫీ) యంత్రాన్ని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌తో కలసి మంత్రి సత్యకుమార్ ప్రారంభించారు. సత్యకుమార్ మాట్లాడుతూ పెట్ స్కాన్, లీనాక్, హెచ్‌ఏఆర్, సీటీ స్టిమ్యులేటర్, సీటీ, ఎంఆర్‌ఐ వంటి అత్యాధునిక పరికరాలతో పూర్తి స్థాయి క్యాన్సర్ చికిత్స కేంద్రంగా గుంటూరు జీజీహెచ్ ఎదిగిందని చెప్పారు. సీఎస్ఆర్ పథకం కింద ఓఎన్‌జీసీ కంపెనీ స్థానిక జీజీహెచ్‌కు రూ.30 కోట్లతో మరో లీనాక్ మెషిన్‌తో పాటు ఇతర పరికరాలు అందజేసేందుకు ఆమోదం తెలిపిందని పేర్కొన్నారు. క్యాన్సర్ వ్యాధి కట్టడికి దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో 4.10 కోట్ల మందికి ఓరల్, బ్రెస్ట్, సర్వైకల్ క్యాన్సర్ నిర్ధారణ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది అనంతపురం, కాకినాడ ప్రభుత్వాస్పత్రులను సమగ్ర క్యాన్సర్ సెంటర్లుగా అభివృద్ధి చేస్తున్నట్లు ప్రకటించారు. అభివృద్ధి పథంలో గుంటూరు జీజీహెచ్: పెమ్మసాని కూటమి ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్ల వ్యవధిలో గుంటూరు జీజీహెచ్‌లో రూ.140 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. ఈ నిధుల్లో రూ.71 కోట్లు సీఎస్ఆర్ ఫండ్ కాగా, రూ.51 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం, దాతలు అందజేసినట్లు తెలిపారు. జింకానాకు చెందిన ఎన్నారై వైద్యులు మరో రూ.100 కోట్లతో 600 పడకలతో తల్లీ పిల్లల ఆరోగ్య కేంద్రాన్ని జీజీహెచ్‌లో



నిర్మించినట్లు తెలిపారు. రెండేళ్లల్లో అదనంగా 800 పడకలు సమకూరాయని చెప్పారు. పెట్ స్కాన్, లీనాక్ మెషిన్‌లతో నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో ప్రపంచస్థాయి ప్రమాణాలతో వైద్యం అందుబాట్లోకి వచ్చిందన్నారు. ఎయిమ్స్‌తో సహా ఇతర ప్రభుత్వ రంగ వైద్యశాలల్లో పెట్ స్కాన్‌కు రూ.5 వేల నుంచి రూ.10 వేలు వరకు ఫీజు వసూలు చేస్తున్నా, గుంటూరు జీజీహెచ్‌లో మాత్రం పెట్‌స్కాన్ పరీక్షను ఉచితంగానే చేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్, ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, డీఎంఈ డాక్టర్ రాధిక రెడ్డి, నాట్కో వైస్ ప్రెసిడెంట్ (కార్పొరేట్ వ్యవహారాలు) నన్నపనేని సదాశివరావు, పాల్గొన్నారు.

# కార్యదర్శులకు సీఎస్ సాయిప్రసాద్ ఉత్తర్వులు



**క్రైం కౌంటర్ న్యూస్ మే 15:** రాష్ట్రపతి జారీచేసిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగాల స్థానిక కేడర్ల నిర్వహణ, ప్రత్యక్ష నియామకాల నియంత్రణ ఉత్తర్వులు-2025 ప్రకారం.. వివిధ స్థానిక క్యాడర్లు, జిల్లాల్లో సివిల్ సర్వీసెస్, ప్రభుత్వ ఉద్యోగాల పోస్టులను విభజించడానికి ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. జిల్లా క్యాడర్, జోనల్ క్యాడర్, మల్టీజోనల్ క్యాడర్ కిందకు ఏయే పోస్టులు వస్తాయో వివరిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ గురువారం ఉత్తర్వులిచ్చారు. జిల్లాల్లో సివిల్ సర్వీసెస్ పోస్టుల వివరాలివ్వాలని కోరారు. ప్రభుత్వం అవసరమని భావిస్తే.. ఈ జీవో ప్రకారం విభజించిన ఏవైనా రెండు కేటగిరీలకు చెందిన పోస్టులను ఏ శాఖలోనైనా లేదా సంస్థలోనైనా.. రెండు లేదా అంతకంటే ఎక్కువ పక్కపక్కనే ఉన్న జిల్లాలు లేదా జోన్లను కలిపి ఒకే క్యాడర్‌గా నిర్వహించే అధికారం దానికి ఉంటుంది.

జిల్లా క్యాడర్ పరిధిలోకి వచ్చే పోస్టులు..

జూనియర్ అసిస్టెంట్, దానికి సమానమైన కేటగిరీలోని అన్ని పోస్టులు.. జూనియర్ అసిస్టెంట్ కంటే తక్కువ స్థాయిలోని అన్ని కేటగిరీల పోస్టులు.. జూనియర్ అసిస్టెంట్, అంతకంటే తక్కువ స్థాయి పోస్టుల వేతన స్కేలు లేదా నిర్ణీత వేతనం ఉన్న అన్ని పోస్టులు.. ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యాసబార్డినేట్ సర్వీసట?సలోని అన్ని కేటగిరీల పోస్టులు.. రాష్ట్ర ప్రభుత్వంలోని ఏ శాఖ పరిధిలోనైనా వీటికి సమానమైన ఉపాధ్యాయ పోస్టులు.. స్థానిక సంస్థలు, ఇతర యాజమాన్యాల పరిధిలో ఉంటూ, పైన పేర్కొన్న అంశంలోని సర్వీసులతో సమానమైన వేతన స్కేలు లేదా నిర్ణీత వేతనం కలిగిన అన్ని కేటగిరీల ఉపాధ్యాయ పోస్టులు. జోనల్ క్యాడర్ పరిధిలోకి వచ్చేవి..

జూనియర్ అసిస్టెంట్ కేటగిరీ కంటే పైన ఉండి.. సూపరింటెండెంట్ కేటగిరీ వరకు ఉండే అన్ని పోస్టులు, వాటికి సమానమైన అన్ని కేటగిరీల పోస్టులు.. ప్రతిశాఖలోని మొదటి స్థాయి గెజిటెడ్ పోస్టు కేటగిరీ, జూనియర్ అసిస్టెంట్ కంటే ఎక్కువ వేతన స్కేలు లేదా నిర్ణీత వేతనం కలిగి ఉన్న ప్రతిశాఖలోని సూపరింటెండెంట్ కేటగిరీ వరకు ఉన్న అన్ని పోస్టులు.. అలాగే మొదటిస్థాయి గెజిటెడ్ కేటగిరీకి సమానమైన వేతన స్కేలు లేదా నిర్ణీత వేతనం ఉన్న అన్ని పోస్టులు.

మల్టీజోనల్ క్యాడర్ పోస్టులు..: సూపరింటెండెంట్ కేటగిరీ కంటే పైన.. మొదటిస్థాయి గెజిటెడ్ పోస్టుల కేటగిరీ కంటే పైన ఉండి, డిప్యూటీ కలెక్టర్ కేటగిరీ వరకు ఉన్న అన్ని పోస్టులు.. అలాగే ఇతర శాఖల్లోనూ వీటికి సమానమైన అన్ని పోస్టులు.. సూపరింటెండెంట్ కంటే ఎక్కువ వేతన స్కేలు లేదా నిర్ణీత వేతనం కలిగి ఉండి, ప్రతి శాఖలోనూ రెండవ స్థాయి గెజిటెడ్ కేటగిరీల నుంచి డిప్యూటీ కలెక్టర్ల వేతన స్కేలు లేదా నిర్ణీత వేతనం ఉన్న అన్ని పోస్టులు.

# పోటీ పరీక్షల్లో అర్హత సాధిస్తేనే క్రీడా రిజర్వేషన్లు

**క్రైం కౌంటర్ న్యూస్ మే 15:** క్రీడాకారుల కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే 3 శాతం రిజర్వేషన్లలో కొన్ని సవరణలు చేసింది. ఈ మేరకు క్రీడాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ ఉద్యోగాల నియామకాల్లో అర్హత కలిగిన క్రీడాకారులు 3శాతం రిజర్వేషన్లు పొందాలంటే ఇకపై ఆయా శాఖల నియామక సంస్థలు నిర్వహించే అర్హత పరీక్షల్లో కచ్చితంగా అర్హత సాధించాల్సి ఉంటుంది.



# భారీ ప్రాజెక్టు రాకతో ఏరోస్పేస్ హబ్‌గా శ్రీసత్యసాయి జిల్లా

**క్రైం కౌంటర్ న్యూస్ మే 15:** అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ (ఏఎంసీఏ)... భారత్ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా అభివృద్ధి చేస్తున్న తొలి స్వదేశీ ఐదో తరం స్టెల్త్ ఫైటర్ జెట్ ఇది. దీన్ని డీఆర్‌డీవో ఆధ్వర్యంలోని ఏరోనాటికల్ స్పేస్ ఏజెన్సీ (ఏడీఏ) రూపొందిస్తోంది. శత్రువుల రాడార్లకు చిక్కకుండా, గగనతలంలో సంపూర్ణ ఆధిపత్యం చలాయించేలా దీన్ని తయారు చేస్తున్నారు. ఇలాంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు పుట్టపర్తిలో ఏర్పాటు కానుంది. రూ.15,803 కోట్ల పెట్టుబడితో ఏర్పాటవుతున్న ఈ భారీ ప్రాజెక్టుతో రాయలసీమ ఏరోస్పేస్ హబ్‌గా, భారత రక్షణ రంగానికి వెన్నెముకగా నిలిచే ఫైటర్ జెట్ల ఉత్పత్తి కేంద్రంగా శ్రీసత్యసాయి జిల్లా ఖ్యాతి గడించనున్నాయి. ముఖ్యంగా పుట్టపర్తి, పాలసముద్రం, మడకశిర ప్రాంతాలు రక్షణ రంగ ఉత్పత్తి కేంద్రాలవుతాయి. ఈ ప్రాజెక్టు ద్వారా 7500 మందికిపైగా ఉపాధి లభించనుంది. జిల్లాలో అనుబంధ పరిశ్రమలు ఏర్పాటవుతాయి. పుట్టపర్తిలోనే ఎందుకు..?

భారత్‌లో యుద్ధ విమానాల తయారీ కోసం ఇప్పటికే బెంగళూరు, హైదరాబాద్, నాసిక్‌లో కేంద్రాలున్నాయి. అయితే అక్కడ సుఖోయ్, తేజస్ వంటి ఫైటర్ జెట్లు తయారీ, మరమ్మతులు, విడిభాగాల తయారీ జరుగుతోంది. పుట్టపర్తిలో ఏర్పాటు చేస్తున్న కేంద్రంలో పూర్తిగా ఐదోతరం ఏఎంసీఏల తయారీ, అసెంబ్లింగ్, ఫ్లైట్ టెస్టింగ్ చేపడతారు. ఇక్కడ 140 ఏఎంసీఏలను తయారు చేస్తారు. ఇప్పటికే అందుబాటులో ఉన్న రన్‌వే, ఈ కేంద్రం బెంగళూరుకు సమీపంలో ఉండడం, ఎయిర్ ట్రాఫిక్ రద్దీ లేని అనుకూల వాతావరణం.. వంటివన్నీ పుట్టపర్తిని ఎంచుకోవడానికి ప్రధాన కారణం. అలాగే సమీపంలోని బెంగళూరులోనే ఏరోనాటికల్ డెవల్‌పమెంట్ ఏజెన్సీ (ఏడీఏ) డిజైన్, సాంకేతిక వ్యవస్థలకు కేంద్రంగా ఉంది. పుట్టపర్తి ఇక్కడకు దగ్గరగా ఉండడం వల్ల ఇరు కేంద్రాల మధ్య సమన్వయం, రవాణా సులభంగా ఉంటుంది. ఇప్పటికే ఇక్కడ ఉన్న రన్‌వేను 10వేల అడుగులకు పొడిగించడంతోపాటు ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్, నావిగేషన్ వ్యవస్థలు ఏర్పాటు చేయడానికి 600 ఎకరాలకుపైగా భూమి అందుబాటులో ఉంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా రక్షణ రంగానికి అత్యంత ప్రాధాన్యతనిస్తోంది. ఈ ప్రాజెక్టు ఏర్పాటు ద్వారా ఇక్కడ దాదాపు లక్ష కోట్ల పెట్టుబడులు, విడిభాగాల తయారీ యూనిట్లు వస్తాయని, తద్వారా స్థానికంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని భావిస్తోంది.

లోపలి ఆయుధాలు..

ఏఎంసీఏలో ఇంటర్నల్ వెపన్స్ బే ఉంటుంది. దీనిలో 1..5 టన్నుల బరువైన ఆయుధాలను అమర్చవచ్చు. వీటిలో స్వదేశీ, లాంగ్ రేంజ్ బియాండ్ విజువల్ రేంజ్ ఎయిర్ టు ఎయిర్ మిస్సైల్స్ అయిన అస్త్ర మార్క్-2, మార్క్-3, సుదూర లక్ష్యాలను ఛేదించే క్రూయిజ్ క్షిపణులు, శత్రువుల ఎయిర్‌ఫీల్డ్‌లను ధ్వంసం చేయడానికి ఉపయోగించే స్వదేశీ బాంబులు, అత్యంత కచ్చితత్వంతో లక్ష్యాలను ఛేదించే లేజర్ గైడెడ్ బాంబులు ఉంటాయి.

వెలుపలి ఆయుధాలు

స్టెల్త్ అవసరం లేని మిషన్ల కోసం విమానం వెలుపల 5.5 టన్నుల బరువున్న ఆయుధాలను అమర్చవచ్చు. వీటిలో బ్రహ్మోస్ తర్వాతి తరం సూపర్ సోనిక్ క్రూయిజ్ క్షిపణులు, స్వల్ప లక్ష్యాలను ఛేదించేందుకు అస్త్ర-ఎంకే1 క్షిపణులు, క్లస్టర్ బాంబులు, 30 ఎంఎం ఆటోక్యానన్ గన్ ఉంటాయి. అలాగే ఏఎంసీఏలో ఆయుధాలతోపాటు.. అవసరాన్ని బట్టి అదనపు ఇంధన ట్యాంకులను కూడా నిల్వ చేసుకోవచ్చు. దీనివల్ల విమానం ఎక్కువ దూరం ప్రయాణించే అవకాశం ఉంటుంది. ఆయుధాల ఎంపిక, ప్రయోగానికి ఏఐ ఆధారిత వ్యవస్థలు కూడా ఏర్పాటు చేయనున్నారు.

ప్రస్తుతం ఏ దశలో ఉంది

ఏఎంసీఏ ప్రాజెక్టు కోసం కేంద్ర ప్రభుత్వం రూ.15,803 కోట్లు అందిస్తుంది. ప్రస్తుతం ఈ ప్రాజెక్టు ప్రొటోటైప్ (నమూనా) తయారీ దశలో ఉంది. 2028-29 నాటికి తొలి ప్రొటోటై?పకు పరీక్షలు పూర్తిచేసి.. 2032 నాటికి పూర్తిస్థాయిలో ఉత్పత్తిని ప్రారంభించాలని, 2035 నాటికి భారత వైమానిక దళంలోకి ప్రవేశపెట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

ఏఎంసీఏలో ఆయుధాలివే..!

అత్యాధునిక స్వదేశీ, విదేశీ ఆయుధాలను మోసుకెళ్లగలిగేలా ఏఎంసీఏను రూపొందిస్తున్నారు. ఇది స్టెల్త్ ఫైటర్ జెట్ కావడం వల్ల శత్రువుల రాడార్లకు చిక్కకుండా ఉండేందుకు విమానం లోపల ఆయుధాలను అమర్చుతారు. అలాగే స్టెల్త్ అవసరం లేని మిషన్ల కోసం విమానం వెలుపల కూడా ఆయుధాలు అమర్చుకునేలా దీన్ని డిజైన్ చేస్తున్నారు.

మ్యాన్డ్-అన్‌మ్యాన్డ్ టీమింగ్

ఏఎంసీఏ అనేది ఒక హైబ్రిడ్ యుద్ధ విమానం. దీనిలో మ్యాన్డ్-అన్‌మ్యాన్డ్ టీమింగ్ (ఎంయూఎంటీ) అనే వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు. అంటే మానవ సహిత, మానవ రహిత యుద్ధ విమానాల సమ్మేళనం. ప్రధాన ఫైటర్ జెట్‌ను పైలట్ నడుపుతాడు కాబట్టి దీన్ని మానవ సహిత యుద్ధ విమానం... అలాగే దీనిలో కొన్ని డ్రోన్లు కూడా ఉంటాయి కాబట్టి మానవ రహిత యుద్ధ విమానంగా పనిచేస్తుంది. మ్యాన్డ్-అన్‌మ్యాన్డ్ టీమింగ్ వ్యవస్థలో కృత్రిమ మేధ కీలక పాత్ర పోషిస్తుంది. దీనిలోని ఏఐ ఆధారిత డ్రోన్లు.. పైలట్ నడిపే ఏఎంసీఏకు నమ్మకమైన భాగస్వామిగా పనిచేస్తాయి. ఈ డ్రోన్లు స్వయంప్రతిపత్తిగా పనిచేస్తాయి కానీ.. అవసరమైనప్పుడు పైలట్ ఆదేశాలను పాటిస్తాయి. యుద్ధ సమయంలో ముందుగా ఈ డ్రోన్లు సేకరించిన సమాచారాన్ని ఏఎంసీఏలోని ఏఐ సాంకేతికత విశ్లేషించి పైలట్‌కు యుద్ధ రగం గురించి స్పష్టమైన అవగాహన కల్పిస్తుంది. శత్రు దేశాల రక్షణ వ్యవస్థలను ఛేదించడం కోసం భారత్ అభివృద్ధి చేస్తున్న ఆధునిక యుద్ధ వ్యూహమిది.

ఏఎంసీఏ.. ఎందుకంత ప్రత్యేకం..?

శత్రువుల రాడార్లు, ఇన్‌ఫ్రారెడ్ సెన్సర్లు, ఇతర నిఘా వ్యవస్థలకు చిక్కకుండా ఉండేందుకు దీన్ని ప్రత్యేకంగా డిజైన్ చేస్తున్నారు. దీంతో ఇవి శత్రువుల భూభాగంలోకి చొచ్చుకెళ్లి సులభంగా దాడి చేసి రాగలవు. ఆయుధాలు బయటకు కనిపించకుండా దీన్ని ప్రత్యేకంగా డిజైన్ చేయనున్నారు. అంటే శత్రువులకు కనిపించకుండా ఉండేందుకు బాంబులు, క్షిపణులను యుద్ధ విమానం లోపల ప్రత్యేకంగా అమర్చుతారు. దీంతో శత్రు రాడార్లు వీటిని కనిపెట్టలేవు. అలాగే గాలి నిరోధకత తగ్గి జెట్ వేగం పెరుగుతుంది. అమెరికాకు చెందిన ఎఫ్-35, ఎఫ్-22, చైనాకు చెందిన జే-35 వంటి ఫైటర్ జెట్లలో ఇలాంటి సౌలభ్యమే ఉంది. దీనిలో ట్విన్ ఇంజన్లు ఉంటాయి. ప్రారంభంలో తయారు చేసే ఎంకే1 వేరియంట్లలో అమెరికాకు చెందిన జీఈ-414 ఇంజన్లను.. ఈ తర్వాత రాబోయే ఎంకే2 మోడల్స్‌లో పూర్తి స్వదేశీ/విదేశీ భాగస్వామ్యంతో కూడిన ఇంజన్లను ఉపయోగిస్తారు.

సూపర్ క్రూయిజ్ సామర్థ్యం..

ఇది ఆఫ్టర్‌బర్నర్‌ను ఉపయోగించకుండానే (ఇంధనాన్ని ఎక్కువగా ఖర్చు చేయకుండా) శబ్ద వేగం కంటే ఎక్కువ వేగం (మాక్ 2.15 లేదా గంటకు 2,600 కి.మీ.)తో ప్రయాణిస్తుంది. దీనిలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత వ్యవస్థలు, ఏఈఎస్ఏ (యాక్టివ్ ఎలక్ట్రానికల్లీ స్కాన్‌డ్ ఎరే) రాడార్లు, స్మార్ట్ సెన్సర్ ఫ్యూజన్లు వంటి అధునాతన ఫీచర్లు ఉంటాయి. ఈ మల్టీరోల్ ఫైటర్ జెట్ 25 టన్నుల బరువు ఉంటుంది. దీని పోరాట పరిధి దాదాపు 1630 కిలోమీటర్లు.

# సినిమా



## ‘హీరో అచ్యుత్ నా చేతుల్లోనే చనిపోయాడు’.

సినిమా ఇండస్ట్రీకి సంబంధించి చాలా మంది నటీనటులు చిన్న వయసులోనే ప్రాణాలు కోల్పోయారు. సినిమా కెరీర్ ఫుల్ స్పీడ్ గా ఉంటున్న సమయంలోనే హఠాన్మరణం చెందారు. అలాంటి వారిలో అచ్యుత్ ఒకరు. ఈ నటుడి గురించి ఈతరం ఆడియెన్స్ కు పెద్దగా తెలియకపోవచ్చు కానీ 1990-2000 జనరేషన్ ఆడియెన్స్ కు ఇతను ఫేవరెట్ యాక్టర్. హీరోగా పెద్దగా సినిమాలు చేయకున్నా అంతకు మించిన అభిమానమే సొంతం చేసుకున్నాడు. చాలా సినిమాల్లో హీరోలు, హీరోయిన్లకు నటించాడు అచ్యుత్. చిరంజీవి, పవన్ కల్యాణ్, బాలకృష్ణ తదితర స్టార్ హీరోలతో స్క్రీన్ షేర్ చేసుకున్నాడు. పవన్ తమ్ముడు, చిరంజీవి బావగారు బాగున్నారా, బాలకృష్ణ నరసింహా నాయుడు, వెంకటేష్ కలిసుందాం రా, మహేష్ బాబు మురారి, డాడీ, వాసు వంటి సినిమాలు అచ్యుత్ కు మంచి గుర్తింపు తీసుకొచ్చాయి. కేవలం సినిమాల్లోనే కాదు బుల్లితెరపైనా సత్తా చాటారు అచ్యుత్. అన్వేషితలాంటి సూపర్ హిట్ సీరియల్స్ లో నటించి మెప్పించాడు. ఇలా చాలా ఏళ్ల పాటు తన నటనతో ఆడియెన్స్ ను అలరించిన అచ్యుత్ 2002లో హఠాత్తుగా కన్నుమూశాడు. అప్పటికి అతనికి కేవలం 42 ఏళ్లు మాత్రమే.చాలా మంది లాగే అచ్యుత్ మరణంపై రకరకాల పుకార్లు వచ్చాయి. సినిమాల్లో సంపాదించిందంతా బిజినెస్ లో పెట్టాడని, అక్కడ పూర్తిగా నష్టాలొచ్చాయని, నమ్ముకున్న స్నేహితులే దాన్ని నట్టేటా ముంచడంతో అచ్యుత్ అప్పుల పాలయ్యాడని ప్రచారం జరిగింది. ఈ క్రమంలోనే తీవ్ర మానసిక ఒత్తిడికి లోనై అచ్యుత్ గుండెపోటుతో చనిపోయాడని కొందరు టీవీ నటులు చెబుతుంటారు. అయితే ఇదే విషయంపై అచ్యుత్ ప్రాణ స్నేహితుడు, నటుడు ఎఫ్2 ఫేమ్ ప్రదీప్ కొన్ని సంచలన విషయాలు చెప్పారు.

ఆరోజు ఫోన్ చేసి..

‘అచ్యుత్ మరణాన్ని నేను దగ్గరుండి చూసాను. అతను నా చేతుల్లోనే చనిపోయాడు. అచ్యుత్ చనిపోయే ముందు రోజు కూడా నేను మాట్లాడాను. షూటింగ్ ఉంది అన్నయ్య వెళ్తున్నాను అన్నాడు. ఆ సమయంలో వాడు మాట్లాడేటప్పుడు ఆయాస పడడం నేను గమనించాను. ఏమైందిరా అంత బాగానే ఉందా అంటే, అంతా బాగానే ఉంది అన్నాడు. కానీ వాడి శరీరం లో బాగా కొలెస్ట్రాల్ పేరుకుపోయింది. దాని వల్ల పక్క రోజే గుండెపోటు వచ్చింది. అచ్యుత్ చాలా మంచి వాడు. అందరితోనే బాగా కలిసిపోయేవాడు. దేని మీద పెద్దగా ఆశ ఉండేది కాదు. కానీ తిండి మాత్రం బాగా తినేవాడు’ అని చెప్పుకొచ్చారు ప్రదీప్.



# పచ్చ యాలకులు, నల్ల యాలకులు..

భారతీయ వంటకాల్లో మసాలా దినుసులకు ఎంతో ప్రాధాన్యత ఉంది. అందులోనూ ‘యాలకులు’ అనగానే మనకు వెంటనే నోరూరించే స్వీట్లు, ఘుమఘుమలాడే బిర్యానీలు గుర్తుకు వస్తాయి. ఆహారానికి మంచి ఫ్లేవర్‌ను ఇవ్వడంలో యాలకులను మించిన సుగంధ ద్రవ్యం మరొకటి లేదు. అయితే యాలకుల్లో మనం ప్రధానంగా రెండు రకాలను చూస్తుంటాం. ఒకటి లేత ఆకుపచ్చ రంగులో ఉండే చిన్న యాలకులు మరొకటి నలుపు లేదా ముదురు గోధుమ రంగులో ఉండే పెద్ద యాలకులు ఈ రెండూ యాలకుల జాతికే చెందినప్పటికీ, వీటి రుచులు, గుణాలు ఆరోగ్య ప్రయోజనాల్లో చాలా వ్యత్యాసం ఉంటుంది. ఆ తేడాలు ఏమిటో ఇప్పుడు వివరంగా చూద్దాం.

రంగు పరిమాణంలో తేడాలు: పచ్చ యాలకులు పరిమాణంలో చాలా చిన్నవిగా, ఆకుపచ్చ రంగులో అందంగా ఉంటాయి. వీటి పైపొర చాలా పలుచగా ఉంటుంది, లోపల చిన్న చిన్న నల్లని గింజలు ఉంటాయి. నల్ల యాలకులు అలా కాదు, ఇవి పరిమాణంలో కాస్త పెద్దవిగా, లావుగా ఉంటాయి. ఇవి ముదురు గోధుమ రంగు లేదా నలుపు రంగులో ఉండి, చాలా గరుకైన మందపాటి పైపొరను కలిగి ఉంటాయి.

రుచి, సువాసనలో వ్యత్యాసం: పచ్చ యాలకుల రుచి కొద్దిగా తీపిగా ఉండి, ఘాటైన మనసుకు ఆహ్లాదాన్నిచ్చే సుగంధభరితమైన వాసనను వెదజల్లుతాయి. కానీ నల్ల యాలకులు కొంచెం ఘాటుగా, ఒక విధమైన పొగ వాసనతో కూడిన గాఢమైన సువాసనను కలిగి ఉంటాయి. వంటకాల్లో వీటి వాడకం ఎలా ఉంటుంది?: పచ్చ యాలకులను సాధారణంగా తీపి పదార్థాలలో (స్వీట్స్) ఎక్కువగా ఉపయోగిస్తారు. పాయసం, ఖీర్, హల్వా, రకరకాల మిఠాయిలు, అలాగే ప్రతిరోజూ తాగే టీ పాలలో మంచి ఫ్లేవర్ కోసం వీటిని వాడుతారు. ఇవి ఆహారానికి అద్భుతమైన సువాసనను,





కొద్దిపాటి తీపిని అందిస్తాయి. మరోవైపు నల్ల యాలకులను మసాలా వంటకాల్లో, ఘాటైన రుచి అవసరమైన కూరల్లో వాడుతారు. బిర్యానీ, పులావ్, దాల్ మఖానీ, నాన్-వెజ్ కూరలు గ్రేవీ కర్రీలలో వీటికి మొదటి ప్రాధాన్యత ఇస్తారు. ఇది వంటకాలకు చాలా విలక్షణమైన మసాలా రుచిని ఇస్తుంది.

ఆరోగ్య ప్రయోజనాలు ఔషధ గుణాలు: చిన్న యాలకులు (పచ్చ యాలకులు) జీర్ణక్రియను మెరుగుపరచడంలో అద్భుతంగా పనిచేస్తాయి. భోజనం తర్వాత వీటిని నమలడం వల్ల నోటి దుర్వాసన పోయి, ఇది ఒక మంచి న్యాచురల్ మౌత్ ఫ్రెషనర్‌గా ఉపయోగపడుతుంది. జలుబు, వికారం నుండి ఉపశమనం కలిగించడంలో కూడా ఇవి సాయపడతాయి. ఇక పెద్ద యాలకుల (నల్ల యాలకులు) విషయానికి వస్తే, ఇవి కూడా జీర్ణ వ్యవస్థను చురుకుగా ఉంచుతాయి. ముఖ్యంగా వీటిలోని వేడి చేసే గుణాలు జలుబు, దగ్గు, గొంతు నొప్పి లేదా గొంతులో గరగర వంటి సమస్యల నుండి వేగంగా ఉపశమనం కలిగిస్తాయి. శ్వాసకోశ సమస్యలకు ఇవి చాలా మేలు చేస్తాయని ఆయుర్వేదం చెబుతోంది.

ధర, లభ్యతలో తేడా: పచ్చ యాలకుల సాగు ఉత్పత్తికి ప్రత్యేక వాతావరణం అవసరం. వాటి ఉత్పత్తి పరిమితంగా ఉంటుంది కాబట్టి, పచ్చ యాలకులు మార్కెట్లో ఎప్పుడూ కాస్త ఖరీదైనవిగానే ఉంటాయి. నల్ల యాలకులు వాటితో పోలిస్తే కొద్దిగా తక్కువ ధరకు లభిస్తాయి. కాబట్టి వీటిని గరం మసాలా ప్యాకెట్లలో విరివిగా ఉపయోగిస్తుంటారు.

ఈ రెండింటిలో ఏది ఉత్తమం?: నిజానికి, ఈ రెండు రకాల యాలకులకు వేర్వేరు ప్రత్యేకతలు, ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. తీపి వంటకాలకు పచ్చ యాలకులు ప్రాణం పోస్తే, మసాలా వంటకాలకు నల్ల యాలకులు రుచిని అమాంతం పెంచుతాయి. ఆరోగ్య పరంగా చూస్తే రెండూ అద్భుతమైనవే. కాబట్టి ఈ రెండింటినీ ఒకదానితో ఒకటి పోల్చలేము. మనం చేసుకునే వంటకాన్ని బట్టి వంటగదిలో ఈ రెండింటికీ సమప్రాధాన్యం ఇవ్వడం ఉత్తమం.

# మందార టీతో ఎన్నో లాభాలు

ఇంటర్నెట్ డెస్క్: వేసవిలో అధిక వేడి, చెమటలు, అలసట కారణంగా చాలా మంది ఒత్తిడి, చిరాకు, తలనొప్పి, జీర్ణ సమస్యలతో ఇబ్బంది పడుతుంటారు. అలాంటి సమయంలో సహజసిద్ధమైన చల్లదనాన్ని ఇచ్చే పానీయాలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ఈ క్రమంలో మందార టీ ఆరోగ్యానికి మేలు చేసే మంచి ఎంపికగా మారింది. ఆయుర్వేదంలో కూడా మందారాన్ని ఔషధ గుణాలున్న మొక్కగా భావిస్తారు. ఎర్ర మందార పువ్వులతో చేసే ఈ టీ శరీరాన్ని తేలికగా ఉంచి, వేసవి వేడి వల్ల కలిగే అసౌకర్యాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది.ఒత్తిడి, అలసట తగ్గింపు

వేసవిలో శరీరం త్వరగా అలసిపోవడం సాధారణం. మానసిక ఒత్తిడి కూడా పెరుగుతుంది. మందార టీ తాగితే మనసుకు ప్రశాంతత లభించి, శరీరానికి రిలాక్స్ కలుగుతుందని చెబుతున్నారు. దీని తేలికపాటి సువాసన, రుచి మూడ్‌ను ఫ్రెష్‌గా ఉ ంచడంలో సహాయపడతాయి.

రక్తపోటు, గుండె ఆరోగ్యానికి మేలు

అధిక రక్తపోటుతో బాధపడేవారికి మందార టీ ఉపయోగకరమని నిపుణులు చెబుతున్నారు. ఇది రక్తనాళాలను సడలించి రక్తప్రసరణను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. అలాగే ఇందులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి గుండె ఆరోగ్యాన్ని కాపాడటంలో సహాయపడతాయి.

బరువు తగ్గించడంలో ఉపయోగం

బరువు తగ్గాలని ప్రయత్నిస్తున్నవారికి కూడా మందార టీ మంచి ఎంపికగా భావిస్తున్నారు. ఇది శరీర జీవక్రియను మెరుగుపరచి, అదనపు నీరు, ఉప్పును బయటకు పంపడంలో సహాయపడుతుంది. కేలరీలు తక్కువగా ఉండటంతో డైట్ ఫాలో అయ్యేవారు కూడా దీన్ని తీసుకోవచ్చు.

మధుమేహం, రోగనిరోధక శక్తికి మద్దతు

కొన్ని అధ్యయనాల ప్రకారం మందార టీ ఇన్సులిన్ స్పందనను మెరుగుపరచడంలో



సహాయపడవచ్చని చెబుతున్నారు. అలాగే రోగనిరోధక శక్తిని పెంచి, కాలేయ ఆరోగ్యానికి కూడా మేలు చేస్తుందని నమ్మకం ఉంది.

మందార టీ తయారీ విధానం

ఎండిన మందార పువ్వులను వేడి నీటిలో 5 నుంచి 7 నిమిషాల పాటు నానబెట్టాలి లేదా మరిగించాలి. తర్వాత వడకట్టి తాగాలి. రుచికోసం తేనె లేదా కొద్దిగా నిమ్మరసం కలుపుకోవచ్చు. అయితే ఏదైనా మూలికా పానీయాన్ని తరచుగా తీసుకునే ముందు ఆరోగ్య నిపుణుల సలహా తీసుకోవడం మంచిది. ముఖ్యంగా గర్భిణీలు, తక్కువ రక్తపోటు ఉన్నవారు జాగ్రత్తగా ఉండాలి.

# నా విలువేంటో నిరూపించుకోవాల్సిన అవసరం లేదు

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు నిర్వహించిన తాజా కార్యక్రమంలో విరాట్ కోహ్లీ తన భవిష్యత్తు ప్రణాళికలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. 2027 వన్డే ప్రపంచకప్‌లో ఆడతారా అన్న ప్రశ్నకు సమాధానమిస్తూ, తాను ఎవరికీ ఏమీ నిరూపించుకోవాల్సిన పనిలేదని పేర్కొన్నాడు. ఆట కోసం తాను పడే కష్టం, తన సన్నద్ధత ఎప్పుడూ అత్యున్నత స్థాయిలోనే ఉంటాయని, ఒకవేళ తన విలువను నిరూపించుకోవాలని ఎవరైనా ఒత్తిడి చేస్తే, ఆ ప్రదేశం తనకు సరైనది కాదని కోహ్లీ అభిప్రాయపడ్డాడు.కష్టపడటమే నా నైజం..

“నేను జట్టులో భాగమైనప్పుడు నా వల్ల జట్టుకు ప్రయోజనం ఉండాలి. అలాగే నా సేవలను జట్టు కూడా గుర్తించాలి. నా శ్రమను, అంకితభావాన్ని శంకించి, పదే పదే నన్ను నిరూపించుకోమంటే నేను అక్కడ ఉండలేను. ఎందుకంటే నా సన్నద్ధత విషయంలో నేను చాలా నిజాయితీగా ఉంటాను. మైదానంలోకి అడుగుపెట్టిన ప్రతిసారి నా సర్వస్వాన్ని ధారపోస్తాను. జట్టు కోసం 40 ఓవర్ల పాటు బౌండరీల వద్ద పరుగెత్తమన్నా నేను సిద్ధమే. 50 ఓవర్ల పాటు ప్రతి బంతిని నా కెరీర్ లో చివరి బంతిగా భావించి ఆడతాను” అని విరాట్ భావోద్వేగంగా మాట్లాడాడు.

చిన్నపిల్లాడిలా మారిన కోహ్లీ..

ఇటీవల విజయ్ హజారే ట్రోఫీలో ఢిల్లీ తరపున ఆడిన అనుభవాలను కోహ్లీ పంచుకున్నాడు. రెండు దశాబ్దాల తర్వాత ఈ టోర్నీలో ఆడుతున్నప్పుడు తనకు మళ్లీ చిన్నపిల్లాడిలా అనిపించిందని చెప్పుకొచ్చాడు. “అక్కడ ఎవరూ లేరు, కానీ నేను బ్యాటింగ్ చేయడాన్ని ఇష్టపడతాను కాబట్టి ఆడాను. కేవలం ఆటపై ఉన్న మక్కువతోనే



నేను మైదానంలోకి దిగాను. ఇతరులు ఏమనుకుంటున్నారనేది నాకు అనవసరం. పారదర్శకత లేని చోట నేను ఇమడలేను” అని కోహ్లీ వివరించాడు.నిత్యం సిద్ధంగానే ఉ ంటా.. తన ఫిట్‌నెస్, జీవనశైలి గురించి చెబుతూ, తానూ ఏదో ఒక సిరీస్ కోసం ప్రత్యేకంగా కష్టపడనని, ఏడాది పొడవునా ఒకే క్రమశిక్షణతో ఉంటానని తెలిపాడు.

Published by katikala Vara Prasad. Owned by katikala Vara Prasad. Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006.published at HNo:1-94 nekunampuram,pokur,Prakasam,andhrapradesh 523113Editor. Katikala Vara Prasad.RNI APTEL/25/A2843. Ph:9849707349 . email:kvp6858@gmail.com.

జర్నలిస్టులు కావలెను

క్రైం కౌంటర్ తెలుగు దినపత్రిక గత 15 సంవత్సరాలుగా పత్రికా రంగంలో ప్రత్యేక గుర్తింపు కలిగిన క్రైం కౌంటర్ తెలుగు దిన పత్రికలో పనిచేసేందుకు ఆసక్తి, అనుభవం కలిగిన జర్నలిస్టులు కావలెను.



APTEL/25/A2844

# క్రైం కౌంటర్

webisite:www.crimecounter.in ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం తెలుగు దిన పత్రిక

క్రిష్ణా సంపుటి : 02 సంచిక : 171 శనివారం 16- 05 - 2026 పేజిలు : 4 వెల. 2



రిపోర్టర్లు కావలెను

క్రైం కౌంటర్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో

- జిల్లా బ్యూరోలు
- జిల్లా ఇన్‌చార్జీలు
- నియోజక వర్గ ఇన్‌చార్జీలు

కావలెను.

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

98497 07349


## అనంతపురానికి రిటర్న్ గిఫ్ట్ ఏఎంసీఏ



క్రైం కౌంటర్ న్యూస్ మే 15: పుట్టపర్తిలో ఏర్పాటయ్యే ఏఎంసీఏ (అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ స్టెల్త్ ఫైటర్ జెట్ ప్రాజెక్ట్ శంకుస్థాపన ఉమ్మడి అనంతపురం జిల్లా చరిత్రను మార్చబోతుంది. డిఫెన్స్ రంగంలో పెద్దఎత్తున పెట్టుబడులు, ఉద్యోగ అవకాశాలు రానున్నాయి. ఈ అవకాశాలను యువత అందిపుచ్చుకోవాలని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. పుట్టపర్తిలో ఏఎంసీఏ ప్రాజెక్టు భూమిపూజ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్‌తో కలసి మంత్రి లోకేష్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ.. 'భగవాన్ శ్రీ సత్యసాయిబాబా పవిత్ర భూమి ఈరోజు భారతదేశ రక్షణరంగ కొత్త శక్తి కేంద్రంగా మారుతోంది. ఉమ్మడి అనంతపురం, గత ఎన్నికల్లో ఎన్‌డీఏకి కంచుకోట. పోటీ చేసిన 14 సీట్లను క్లీన్ స్వీప్ చేశారు. అందుకే ఇప్పుడు రిటర్న్ గిఫ్ట్ ఇస్తున్నాము. అప్పుడు కియా, ఇప్పుడు ఫైటర్ జెట్స్.. కరువు నేలపై కార్లు పరిగెత్తించిన మన విజనరీ ముఖ్యమంత్రి సీబీఎన్. ఇప్పుడు అదే పుణ్యభూమిపై ఫైటర్ జెట్స్ ఎగిరేలా చేస్తున్నది కూడా మన ముఖ్యమంత్రి సీబీఎన్. ఈ నేలకు భగవాన్ సత్యసాయి బాబా ఆశీస్సులు ఉన్నాయి. ఎవరూ ఊహించని సమయంలో ఆయన ఇక్కడ ఎయిర్‌పోర్ట్ నిర్మించారు. ఇప్పుడు ఆయన అనుగ్రహంతో ఫైటర్ జెట్స్ తయారు చేసే పరిశ్రమలు ఇక్కడికి వచ్చాయి'.

స్పీడ్ తట్టుకోలేం

ఆపరేషన్ సిందూర్‌కు ఒక సంవత్సరం పూర్తి అయింది. మన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పాకిస్తాన్‌కు గట్టి జవాబు ఇచ్చిన ఘటన అది.. దానికి ప్రతి భారతీయుడూ గర్వపడాలి. ఆపరేషన్ సిందూర్ వెనుక అతిపెద్ద శక్తి, మన ఐరన్ మ్యాన్, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్. దేశంలోని అనేక రాష్ట్రాల్లో డబుల్ ఇంజన్ సర్కార్లు ఉన్నాయి. కానీ ఏపీలో మాత్రమే డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్ ఉంది. మోదీ, మన చంద్రబాబు స్పీడ్ తట్టుకోవడం ఎవరి వల్లా కాదు'.

రాష్ట్రానికి భారీ పెట్టుబడులు

'రాష్ట్రానికి ప్రధాని మోదీ, ఏపీ సీఎం చంద్రబాబు వల్లే భారీ పెట్టుబడులు వస్తున్నాయి. 23 నెలల్లో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అంటే ఏంటో దేశానికి చూపించాం. ఆంధ్రప్రదేశ్‌ని ఇన్వెస్ట్‌మెంట్స్ డెస్టినీగా మార్చాం. ఇతర రాష్ట్రాల అభివృద్ధి చూసి మనం అసూయ పడే రోజులు పోయాయి. ఇప్పుడు ఇతర రాష్ట్రాలు మన అభివృద్ధి చూసి అసూయ పడే రోజులు వచ్చాయి'.

ఏఎంసీఏతో యువతకు ఉద్యోగాలు

'జువ్వలదిన్నెలో సాగర్ డిఫెన్స్, పుట్టపర్తిలో ఏఎంసీఏ, డిఫెన్స్ ఆర్ అండ్ డి ఆర్గనైజేషన్ , ఏరోనాటికల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ కలిసి ప్రాజెక్ట్ ఏర్పాటు చేస్తున్నాయి. హిందూస్థాన్ ఏరోనాటికల్ లిమిటెడ్ దశాబ్దాలుగా బెంగళూరును అభివృద్ధి చేసింది. అదే తరహాలో పుట్టపర్తిని అభివృద్ధి చేస్తుంది. ఇక్కడ 5వ తరం స్టెల్త్ మల్టీ-రోల్ ఫైటర్ జెట్స్ తయారు చేస్తారు. భారత్ ఫోర్జ్, భారత్ డైనమిక్స్ లిమిటెడ్, హిమాచల్ ఫ్యూచరిస్టిక్ కమ్యూనికేషన్ లిమిటెడ్, ప్రీమియర్ ఎక్స్‌ప్లోసివ్స్ లిమిటెడ్‌తో పాటు అనేక ప్రతిష్టాత్మక కంపెనీలు ఇక్కడ పెట్టుబడులు పెడుతున్నాయి. దీనివల్ల ఈ ప్రాంత యువతకు పెద్దఎత్తున ఇక్కడ ఉద్యోగ అవకాశాలు వస్తాయి. ఇక్కడ నుంచి ఇతర దేశాలకు కూడా మనం డిఫెన్స్ ఎక్విప్‌మెంట్ నుంచి ఎక్స్‌పోర్ట్ చేస్తాం. ఒక్క కియాతో ఉమ్మడి అనంతపురం జిల్లా అభివృద్ధి చెందింది. ఇప్పుడు ఏఎంసీఏతో ఉమ్మడి అనంతపురం జిల్లా అభివృద్ధిలో నెంబర్ 1 కావడం ఖాయం'.

సీఎం చంద్రబాబు ప్రత్యేక కృషి

'ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వయంగా ఈ ప్రాజెక్ట్ కోసం ప్రత్యేకంగా కృషిచేశారు. ఆ ప్రయత్నాల ఫలితంగానే ఇవాళ పుట్టపర్తి భారత డిఫెన్స్ మ్యాప్‌పై కొత్త గుర్తింపు పొందుతోంది. లక్ష కోట్ల కంటే ఎక్కువ ఇన్వెస్ట్‌మెంట్, వేలాది యువతకు ఉపాధి అవకాశాలు వస్తున్నాయి. ఇది కేవలం ఒక డిఫెన్స్ ప్రాజెక్ట్ కాదు...ఇది రాయలసీమ భవిష్యత్తుకు కొత్త దిశ ఇచ్చే ప్రాజెక్ట్. ఇవాళ పుట్టపర్తి కేవలం ఒక ఆధ్యాత్మిక నగరం కాదు.. భారత రక్షణరంగ భవిష్యత్తు కేంద్రంగా మారుతోంది. ఆంధ్రప్రదేశ్‌కు ఇంత మహత్తరమైన రక్షణ ప్రాజెక్ట్ ఇచ్చినందుకు, మన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ లకు హృదయ పూర్వక ధన్యవాదాలు. వికసిత భారత్ 2047 నిర్మాణంలో ఆంధ్రప్రదేశ్ బలమైన భాగస్వామ్యం అందిస్తుంది'.. అని మంత్రి నారా లోకేష్ హామీ ఇచ్చారు.



## గుంటూరు పట్టాభిపురం రైతు బజార్‌కు మహర్దశ: కేంద్ర మంత్రి పెమ్మసాని

క్రైం కౌంటర్ న్యూస్ మే 15: జిల్లాలోని రైతులకు, సామాన్య వినియోగదారులకు మరింత మెరుగైన వసతులు కల్పించే దిశగా ప్రభుత్వం కీలక అడుగు వేసింది. నగరంలోని ప్రధాన వాణిజ్య కేంద్రాలలో ఒకటైన పట్టాభిపురం రైతు బజార్‌ను అత్యాధునిక హంగులతో తీర్చిదిద్దేందుకు శ్రీకారం చుట్టారు. దాదాపు రూ. 6 కోట్ల భారీ వ్యయంతో నిర్మించనున్న నూతన +o2 భవన నిర్మాణ పనులకు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అధికారికంగా శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ..'గత పాలకుల నిర్లక్ష్యం కారణంగానే ఈ భవన నిర్మాణం ఇన్నాళ్లూ జాప్యం జరిగింది. 9 నెలల్లోనే నిర్మాణం పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు ఆదేశిస్తున్నాం. రైతులకు, వినియోగదారులకు మేలు చేయడమే లక్ష్యం' అని అన్నారు. ఇదిలా ఉంటే.. సుమారు 11,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో రూపుదిద్దుకోనున్న ఈ భవనం, అటు రైతులకు, ఇటు కొనుగోలుదారులకు అన్ని రకాల ఆధునిక సౌకర్యాలను అందించనుంది. ఈ భవనంలో మొత్తం 100 షాపులను ఏర్పాటు చేయనుండగా, అందులో 60 షాపులను నేరుగా రైతులకు, మరో 30 షాపులను డ్వాక్రా మహిళల ఉత్పత్తుల విక్రయానికి ప్రత్యేకంగా కేటాయించారు. వినియోగదారుల రద్దీని దృష్టిలో ఉంచుకుని విశాలమైన పార్కింగ్ సౌకర్యం, పరిశుభ్రమైన టాయిలెట్స్, అత్యున్నత స్థాయి హైజీన్ ప్రమాణాలతో ఈ ప్రాజెక్టును డిజైన్ చేశారు. ఈ శంకుస్థాపన కార్యక్రమంలో గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి, ఎమ్మెల్సీ ఆలపాటి రాజా, మిర్చి యార్డ్ ఛైర్మన్ కుర్రా అప్పారావుతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

## ఏపీ ఎస్ఎంఈఎక్స్ ఏర్పాటుకు క్యాబినెట్ నిర్ణయం

అమరావతి, క్రైం కౌంటర్ న్యూస్ మే 15:: రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమ( ఎంఎస్ఎంఈ)లకు ఈక్విటీ, ప్రత్యామ్నాయ ఆర్థిక వనరులను మరింత సులభంగా అందుబాటులోకి తీసుకురావడం లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ఎస్ఎంఈ ఎక్స్ఛేంజ్ (ఏపీఎస్ఎంఈఎక్స్) ప్రారంభానికి మంత్రిమండలి ఆమోదం తెలిపింది. ఇందుకోసం రాష్ట్ర స్థాయి టాస్క్‌ఫోర్స్ ఏర్పాటుకు కూడా నిర్ణయించింది. ఇది ఏపీఎస్ఎంఈఎక్స్ రూపకల్పనకు సంబంధిత వర్గాలతో సంప్రదింపులు, రెగ్యులేటరీ సంస్థలతో సమన్వయంతో సమగ్ర ప్రతిపాదనలను రూపొందించి సమర్పిస్తుంది. విశాఖపట్నం జిల్లాలో కేబుల్ ల్యాండింగ్ స్టేషన్‌తో అనుసంధానంగా గిగా స్కేల్ ఏఐ డేటా సెంటర్ ఏర్పాటు చేయడానికి రిలయెన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్‌కు 854.97 ఎకరాల భూమి కేటాయించి.. ప్రోత్సాహకాలను విస్తరించాలని క్యాబినెట్ నిర్ణయించింది. విశాఖ జిల్లాలోని పోలిపల్లి, భోగాపురం ఈస్ట్, భోగాపురం వెస్ట్ గ్రామాల్లో ఈ డేటా సెంటర్ నెలకొల్పుతారు. భూమిని 25 శాతం రాయితీతో కేటాయిస్తారు. రూ.1,08,010 కోట్ల భారీ పెట్టుబడితో వచ్చే ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు 1000 మందికి ప్రత్యక్ష ఉపాధి అవకాశాలు లభిస్తాయి. అలాగే క్యారియర్ ఎయిర్‌కండిషనింగ్ అండ్ రెఫ్రిజిరేషన్ లిమిటెడ్ సంస్థ తిరుపతి జిల్లా శ్రీసిటీలో అడ్వాన్స్‌డ్ ఎయిర్ కండిషనింగ్, రిఫ్రిజరేషన్ ఉత్పత్తుల తయారీ యూనిట్ నెలకొల్పడానికి కూడా మంత్రిమండలి ఆమోదం తెలిపింది. గురువారం అమరావతి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన క్యాబినెట్ సమావేశమైంది. రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు(ఎస్ఐపీబీ) సిఫారసుల ఆమోదం సహా క్యాబినెట్ తీసుకున్న నిర్ణయాలను మంత్రి కొలుసు పార్థసారథి విలేకరులకు వివరించారుకర్నూలు జిల్లా ఓర్వకల్లు మెగా ఇండస్ట్రియల్ హబ్ కోసం గ్రిడాన్ ఎనర్జీకి గుత్తపాడులో 47.65 ఎకరాలు కేటాయింపు. ఏపీ ఇండస్ట్రియల్ డెవల ప్‌మెంట్ పాలసీ(4.0) 2024-2029 కింద ప్రత్యేక ప్రోత్సహకాలు మంజూరు.

చిత్తూరు జిల్లా చినపందూరులో టైరు తయారీ యూనిట్ ఫేజ్-4 విస్తరణకు అపోలో టైర్స్‌కు ప్రత్యేక ప్రోత్సాహకాలు.

నెల్లూరు జిల్లాలోని ఇఫ్‌కో కిసాన్ సెజ్‌లో గ్రీన్‌ఫీల్డ్ ఎంజైమ్ తయారీ యూనిట్ ఏర్పాటుకు ఇంటర్నేషనల్ ఫుడ్ అండ్ ఫ్రాగ్నన్స్ ఇండియా లిమిటెడ్‌కు ప్రత్యేక ప్రోత్సాహకాలు.

తిరుపతి జిల్లాలో గ్రీన్‌ఫీల్డ్ మోటార్‌సైకిల్ తయారీ కర్మాగారం స్థాపనకు రాయల్ ఎన్‌ఫీల్డ్‌కు ప్రత్యేక ప్రోత్సాహకాలు.

పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం పేడగర్లపాడు, కాసానుపల్లి గ్రామాల్లో వేస్-హీట్ ఆధారిత పవర్ జనరేషన్ సహా ఇంటిగ్రేటెడ్ సిమెంట్ ప్లాంట్ విస్తరణకు చెట్టినాడ్ సిమెంట్ కార్పొరేషన్‌కు ప్రత్యేక ప్రోత్సాహకాలు.

ఎర్లీబర్డ్ స్కీమ్ కింద కన్సెంట్ ఫర్ ఎస్టాబ్లిష్‌మెంట్(సీఎఫ్ఈ) పొందే గడువును 6 నెలలు పొడిగించడానికి ఆమోదం. ఏఏకే సౌత్ ఈస్ట్ ఇండియా, ఐటీసీ, హ్యాంగ్యో ఐస్‌క్రీమ్స్ కంపెనీలకు మూలధన సబ్సిడీ, ఇతర ప్రోత్సాహకాలు మంజూరు. అనంతపురం, అన్నమయ్య జిల్లాల్లో నాలుగు బ్రాయిలర్ బ్రీడర్ ఫార్మ్‌లు, ఒక హేచరీ స్థాపనకు స్నేహ ఫార్మ్స్‌కు ప్రత్యేక ప్రోత్సాహకాలు.



కర్నూలు జిల్లా ఉయ్యాలవాడ నరసింహారెడ్డి ఎయిర్‌పోర్టులో పీపీపీ విధానంలో ఆపరేట్-మేనేజ్-డెవలప్ మోడల్ ద్వారా కన్సెషనైర్ ఎంపిక కోసం ముసాయిదా ఆర్ఎఫ్‌పీకి ఆమోదం.

యామ్‌నాకో ఇండియా అభ్యర్థన మేరకు తిరుపతి జిల్లా చిల్లకూరు, కోట మండలాల గ్రామాల్లో గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టుల స్థాపనకు ఆమోదం.. ప్రోత్సాహకాలు మంజూరు.

వేస్ట్ టు ఎనర్జీ ట్రీట్‌మెంట్ ప్లాంట్ స్థాపన కోసం కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం అనూరు గ్రామంలో 10.66 ఎకరాల ప్రభుత్వ భూమి కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్‌కు కేటాయింపు.

పార్టీల కార్యాలయాలకు ప్రస్తుతం 33 సంవత్సరాల లీజు కాలపరిమితి 99 ఏళ్లకు పొడిగింపు.

మడకశిర బ్రాంచ్ కెనాల్ విస్తరణ, వెడల్పు పనులకు సంబంధించిన మూడు ప్రధాన ప్రాకేజీలకు రూ.790.38 కోట్లు మంజూరు.

ఐఐటీ తిరుపతి,ఐఐఎస్ఈఆర్ తిరుపతి, రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లో అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలను వినియోగించుకుని ఏపీ ఫస్ట్ సంస్థను కంపెనీగా స్థాపించడానికి ఆమోదం.పౌర ఆరోగ్య స్క్రీనింగ్‌లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 904, 104 మొబైల్ మెడికల్ యూనిట్ల ద్వారా 104 డయాగ్నస్టిక్స్ ప్రోగ్రాం అమలు.విశ్వవిద్యాలయాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకానికి ఏపీపీఎస్సీ నిర్వహించే పరీక్షల్లో కాంట్రాక్టు ఫ్యాకల్టీకి ఒక్కసారి మాత్రమే వర్తించేలా వెయిటేజీ ఇవ్వడానికి ఆమోదం. ప్రధాని 'నేషన్ ఫస్ట్' పిలుపునకు అనుగుణంగా పొదుపు చర్యల అమలుకు రాష్ట్ర కార్యాచరణ ప్రణాళికకు ఆమోదం.

వివిధ ప్రాంతాల్లో బయోగ్యాస్ ప్లాంట్ల స్థాపనకు పలు సంస్థలకు అనుమతి.

## వరుడి నిద్రమత్తుతో అదుపు తప్పిన కారు



క్రైం కౌంటర్ న్యూస్ మే 15: వివాహం జరిగి 24 గంటలు కాలేదు.. కాళ్ల పారాణి ఆరలేదు. పెళ్లైన తరువాత పుట్టింట అడుగుపెట్టేందుకు భర్తతో కలిసి వస్తున్న నవ వధువును మృత్యువు రోడ్డు ప్రమాదం రూపంలో కబళించింది. ఈ ఘటనలో వరుడు, ఆమె సోదరికి గాయాలు కాగా, తీవ్రంగా గాయపడిన ఆమె తల్లి ఆస్పత్రిలో ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్నారు. విశాఖ నగర శివారు అగనంపూడిలో గురువారం సాయంత్రం 4 గంటల సమయంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. విశాఖపట్నం జిల్లా అగనంపూడి ఉక్కు నిర్వాసిత కాలనీ కొండయ్యవలసకు చెందిన నడుపూరు రామేశ్వరి (31)కి, అనకాపల్లి జిల్లా పరవాడ మండలం వాడచీపురుపల్లికి చెందిన ఈరుగుల నరసింగరావు (42)కు బుధవారం రాత్రి వరుడి ఇంటి వద్ద వివాహం జరిగింది. భర్తతో కలిసి పుట్టింటికి వచ్చేందుకు రామేశ్వరి, తల్లి కనకమహాలక్ష్మి, సోదరి వరలక్ష్మి కారులో బయలుదేరారు. వారు ప్రయాణిస్తున్న కారు ఉక్కు జనరల్ ఆస్పత్రి రహదారిలో అదుపుతప్పి రహదారి పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీకొంది. ఆ సమయంలో నరసింగరావు డ్రైవింగ్ చేస్తున్నాడు. పెళ్లి కార్యక్రమాలతో నిద్ర లేక అతడికి కళ్లు మూతలు పడడంతో ప్రమాదం చోటుచేసుకుందంటున్నారు. ఈ ఘటనలో భర్త పక్కన కూర్చున్న రామేశ్వరి సంఘటనా స్థలంలోనే మృతిచెందింది. వెనుక సీట్లో కూర్చున్న ఆమె తల్లి కనకమహాలక్ష్మి(56)కి తీవ్రగాయాలవగా కేజీహెచ్‌కు తరలించారు. రామేశ్వరి భర్త నరసింగరావు, సోదరి వరలక్ష్మి స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ప్రమాదంలో కారు ముందు భాగం దెబ్బతింది.

## నెల రోజుల పైబడి ముహూర్తాలకు బ్రేక్



**క్రైం కౌంటర్ న్యూస్ మే 15:** గురువారం నుంచి బాజాభజంత్రీలు, మంగళవాయిద్యాలు మూగబోయాయి. కల్యాణ మండపాలు బోసిపోయాయి. పురోహితులు పంచాంగాలు చుట్టేశారు. షామియానాలు, అలంకరణ సామగ్రిని యజమానులు అటకెక్కించేశారు. వంటవాళ్ళు ప్రత్యామ్నాయాలు చూసుకుంటున్నారు. ఫిబ్రవరి నుంచి మే 13 వరకూ తెలుగు లోగిళ్ళను వివిధ రకాల శుభకార్యాలతో కళకళలాడించిన ముహూర్తాలు నెల రోజల పైబడి సెలవు తీసుకుంటున్నాయి. గురువారం నుంచి మూడు రోజులు ముహూర్తాలు లేక ఎలాంటి శుభకార్యాలకు అవకాశం లేకుండా పోయింది. ఆదివారం నుంచి అధిక జ్యేష్ట మాసం రానుండడంతో జూన్ 20 వరకూ మంచి రోజులు లేవని పురోహితులు చెపుతున్నారు.జూన్‌లో చివరి 8 రోజులు మంచి ముహూర్తాలున్నాయని పండితులు వివరిస్తున్నారు. జూలైలో మరో నాలుగు రోజులు మాత్రమే ముహూర్తాలున్నాయిని ఆ తరువాత చతుర్మాసం తదితర కారణాలతో ఆగస్టులో 11 రోజులు, సెప్టెంబరులో 4, అక్టోబరులో మరో 4 రోజులు మాత్రం ముహూర్తాలున్నా చతుర్మాసం అడ్డొస్తోందని పురోహితులు అంటున్నారు. ఆ తరువాత నవంబరులో కార్తీక మాసం కారణంగా 11 రోజులు, డిసెంబరులో మరో 14 రోజుల్లో కూడా అనువైన ముహూర్తాలున్నాయంటున్నారు.

## డివైడర్ దాటివచ్చి బస్సును ఢీకొన్న టిప్పర్




**క్రైం కౌంటర్ న్యూస్ మే 15:** డ్రైవర్ నిద్రమత్తు కారణంగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మరణించగా 16మంది గాయపడ్డారు. తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి జాతీయ రహదారిపై యర్నగూడెం వద్ద ప్రైవేటు ట్రావెల్స్ బస్సును డివైడర్ దాటుకుని వేగంగా వచ్చిన టిప్పర్ ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. విజయవాడ శ్రీవెంకట రమణ ట్రావెల్స్ స్లీపర్ బస్సు శ్రీకాకుళం జిల్లా పొందూరు నుంచి బయలుదే రింది. 40 మందితో ప్రయాణిస్తున్న బస్సు గురువారం తెల్లవారు జామున 3.30 గంటల సమయంలో యర్నగూడెం వద్దకు చేరింది. నల్లజర్లలో కంకర దిగుమతి చేసి దేవరపల్లి వైపు వెళుతున్న టిప్పర్ ఒక్కసారిగా డివైడర్ దాటి దూసుకొచ్చి ట్రావెల్స్ బస్సును డ్రైవరు వైపు బలంగా ఢీ కొట్టింది. దీంతో బస్సు అద్దం పగిలిపోయింది. ప్రమాదధాటికి డ్రైవరు వెనుక సీట్లో కూర్చున్న శ్రీకాకుళం జిల్లా రాజాం మండలం పనసలవలస గ్రామానికి చెందిన నారు సాయి అనిల్ కుమార్(24) పగిలిన అద్దం నుంచి రోడ్డుపై పడిపోయాడు. తలకు తీవ్రమైన గాయమై ఘటనా స్థలంలోనే ప్రాణాలు విడిచాడు. బస్సు డ్రైవర్లు, టిప్పర్ డ్రైవర్, ముగ్గురు మహిళలు, ఒక చిన్నారితో సహా 16 మందికి గాయాలయ్యాయి. దేవరపల్లి పోలీసులు వెంటనే క్షతగాత్రులను రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా, మృతుడు అనిల్ కుమార్ తన తమ్ముడు, తల్లిదండ్రులతో గన్నవరంలోని ఓ వేడుకకు వెళుతున్నాడు. తిరిగి వచ్చాక విశాఖపట్నంలోని ఓ ఫార్మా కంపెనీలో ఉద్యోగంలో చేరాల్సి ఉందంటూ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. డ్రైవరు కంటిపై కునుకు పడడంతో టిప్పర్ అదుపు తప్పిందని ప్రాథమికంగా పోలీసులు నిర్ధారించారు.

## యూపీలో ప్రయోగాత్మకంగా అమలు.. ప్రతి జిల్లాలో రుతుపవనాల ప్రవేశ సమాచారం

**క్రైం కౌంటర్ న్యూస్ మే 15:** కృత్రిమ మేధ(ఏఐ) సహాయంతో రైతులకు మరిన్ని సేవలు అందించేందుకు భారత వాతావరణ శాఖ(ఐఎండీ) రెండు టూల్స్‌ను అభివృద్ధి చేసింది. వీటి ద్వారా ప్రతి కిలోమీటరు ప్రాంతంలో వర్షం ఎప్పుడు పడుతుందనేది పది రోజులు ముందుగానే ఏఐ సాయంతో తెలియనుంది. ఐఎండీలోని కీలక విభాగం 'నేషనల్ సెంటర్ ఫర్ మీడియం రేంజ్ ఫోర్‌కాస్టింగ్' ఏఐ సాయంతో ఒక టూల్‌ను అభివృద్ధి చేసింది. దీనిద్వారా ప్రయోగాత్మకంగా మొదట ఉత్తరప్రదేశ్‌లో రైతులకు ఈనెల 12వ తేదీ నుంచి ఐఎండీ బులెటిన్లు విడుదల చేస్తోంది. ఇది ముఖ్యంగా రైతులకు ఎంతగానో ఉపయోగపడనుంది. ఎక్కువగా ఆటోమేటిక్ రెయిన్‌గేజ్‌లు, ఆటోమేటిక్ వెదర్ స్టేషన్లు ఉన్న యూపీ కోసం దీన్ని అభివృద్ధి చేశారు. ఒక ప్రాంతంలో వర్షపాతం వివరాలు, ఉపగ్రహాలు, డాప్లర్ వెదర్ రాడార్ల నుంచి సేకరించిన సమాచారాన్ని క్రోడీకరించి పది రోజులు ముందుగా వర్షపాతం ఎంత పడుతుందనేది లెక్కకట్టి రైతులకు సమాచారం అందించవచ్చని భూ విజ్ఞాన మంత్రిత్వశాఖ కార్యదర్శి ఎం.రవిచంద్రన్ తెలిపారు. దీనివల్ల రైతులు ఏ పంట వేయాలి? ఏ విత్తనాలు చల్లాలి? నీటి పారుదల, పంట రక్షణ ప్రణాళిక, పంట కోత వంటి విషయాలపై నిర్ణయం తీసుకునే అవకాశం లభిస్తుందన్నారు. పెరుగుతున్న వాతావరణ వైపరీత్యాలు, తీవ్రమైన ఘటనల దృష్ట్యా భవిష్యత్తులో దేశంలోని ఇతర ప్రాంతాలకు ఈ సాంకేతికతను విస్తరిస్తామన్నారు. ఇదిలావుండగా ప్రతి జిల్లాలో నైరుతి రుతుపవనాలు ఎప్పుడు ప్రవేశిస్తాయనేది చెప్పే టూల్‌ను పుణేలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ట్రోఫికల్ మెట్రాలజీ సంస్థ అభివృద్ధి చేసింది. ఏఐ ఆధారిత సాంకేతికతతో దీనిని రూపొందించారు.దీనితో దేశంలోని వివిధ ప్రాంతాలు,



ప్రత్యేకించి ప్రతి జిల్లాలో రుతుపవనాల ప్రవేశం తదితర విషయాలను నిశితంగా పరిశీలిస్తున్నారు. ఇప్పటివరకూ దేశవ్యాప్తంగా రుతుపవనాల ప్రవేశం, పురోగతి వివరాలు అందిస్తున్న ఐఎండీ.. ఇక నుంచి ప్రాంతాలు, జిల్లాల వారీగా రుతుపవనాల తీరుతెన్నులను వివరించనుంది. దీనివల్ల వర్షపాతం అంచనాల్లో కచ్చితత్వం వస్తుందని ఐఐటీఎం ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. 16 రాష్ట్రాలు, 3,196 బ్లాకుల్లో సూక్ష్మస్థాయి వర్షపాతం పర్యవేక్షణ అందుబాటులోకి వస్తుందన్నారు. కొత్తగా అభివృద్ధి చేసిన రెండు టూల్స్ వ్యవసాయం, నీటి వనరుల నిర్వహణ, విపత్తుల నిర్వహణకు ఎంతగానో ఉపయోగపడతాయని వాతావరణ నిపుణులు పేర్కొంటున్నారు.

## అందుబాటులోకి మరో నాలుగు భారీ ట్యాంకర్లు



**క్రైం కౌంటర్ న్యూస్ మే 15:** తిరుమలలో నెయ్యి నిల్వల సామర్థ్యం పెరిగింది. 82 వేల కేజీల నుంచి 2.26 లక్షల కేజీల నెయ్యిని నిల్వ చేసుకునేలా నిర్మించిన నూతన ట్యాంకర్లు అందుబాటులోకి వచ్చాయి. శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులందరికీ లడ్డూ ప్రసాదం అందేలా టీటీడీ ప్రస్తుతం 4 నుంచి 4.50 లక్షల లడ్డూలను తయారు చేస్తున్న విషయం తెలిసిందే. విశేష పర్వదినాలు, ఉత్సవాలు, రద్దీ సమయాల్లో అదనంగా మరో 3లక్షల నుంచి 4 లక్షల లడ్డూలను కూడా తయారు చేస్తారు. ఇక, నైవేద్య ప్రసాదాల కోసం కూడా నెయ్యి అధికంగా వినియోగిస్తారు. ఇలా రోజుకు 15వేల నుంచి 16 వేల కేజీల నెయ్యిని వాడతారు. నెయ్యి వినియోగం అధికంగా ఉన్న క్రమంలో రోజూ రెండు మూడు లారీల నెయ్యి నిల్వలు తిరుమలకు చేరుకుంటున్నాయి. ఈనేపథ్యంలో నెయ్యిని నిల్వ చేసుకునే విషయంలో ఎలాంటి ఇబ్బందులు ఉండకూడదనే ఉద్దేశంతో దాతల సహకారంతో టీటీడీ అదనపు ట్యాంకర్లను అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించింది. చెన్నైకి చెందిన ఓ సంస్థ 36వేల కేజీల సామర్థ్యంతో పుష్కరిణి పక్కనే ఉన్న నెయ్యి నిల్వ కేంద్రంలో నాలుగు భారీ ట్యాంకర్ల నిర్మాణం చేపట్టి ఇటీవల పూర్తిచేసింది. గతంలో 12 ట్యాంకర్ల ద్వారా కేవలం 82 వేల కేజీలను మాత్రమే నిల్వ చేసుకునే అవకాశముండేది. ప్రస్తుతం మరో నాలుగు ట్యాంకర్లు అందుబాటులోకి రావడంతో మొత్తం 16 ట్యాంకర్ల ద్వారా 2.26 లక్షల కిలోల నెయ్యిని నిల్వ చేసుకునే వెసులుబాటు కలిగింది. అంటే దాదాపు 15 నుంచి 16 రోజులకు సరిపడా నెయ్యిని నిల్వ చేసుకునే అవకాశం ఏర్పడింది. ప్రస్తుతం నూతన ట్యాంకర్లను పరిశీలిస్తున్నారు. గుర్తించిన లోటుపాట్లను సవరించి త్వరలోనే ప్రారంభించనున్నారు. అలాగే భవిష్యత్తులో మరో లక్ష కేజీలకు కూడా నెయ్యి నిల్వలను పెంచేలా టీటీడీ ప్రణాళికలు రూపొందించుకుంది. కాగా, నెయ్యి నిల్వ సామర్థ్యం పెరిగిన క్రమంలో కొత్తగా వచ్చే నెయ్యిని పూర్తిస్థాయిలో పరీక్షించేందుకు సమయం ఉంటుంది. ఒకవేళ కల్తీని గుర్తించినా దాన్ని వెనక్కి పంపి మళ్లీ నాణ్యమైన నెయ్యిని తెప్పించుకునే అవకాశం కలుగుతుంది. తద్వారా నాణ్యమైన నెయ్యే వినియోగించే వెసులుబాటు కలుగుతుందని అధికారులు భావిస్తున్నారు.

## ఈ ఏడాది ముందుగానే కేరళను తాకనున్న రుతుపవనాలు?

**క్రైం కౌంటర్ న్యూస్ మే 15:** నైరుతి, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర అల్పపీడనం గురువారం ఈశాన్యంగా పయనించి కోస్తాంధ్ర, తమిళనాడు తీరాలకు దూరంగా వెళ్లింది. ఇది వచ్చే 36 గంటల్లో ఈశాన్య, మధ్య బంగాళాఖాతంలోకి ప్రవేశించే క్రమంలో వాయుగుండంగా మారి...ఆ తర్వాత మయన్మార్ తీరం దిశగా వెళ్లనుంది. తీవ్ర అల్పపీడనం ప్రభావంతో భూమధ్యరేఖ మీదుగా బలమైన తేమగాలులు హిందూ మహాసముద్రం దిశగా వీస్తున్నాయి. ఈ నేపథ్యంలో నైరుతి రుతుపవనాలు శనివారం నాటికి దక్షిణ బంగాళాఖాతం, అండమాన్ సముద్రం, అండమాన్, నికోబార్ దీవుల్లోకి ప్రవేశించనున్నాయని భారత వాతావరణ శాఖ(ఐఎండీ) తెలిపింది. సాధారణంగా మే 20 కల్లా అండమాన్ నికోబార్ దీవులు, పరిసరాల్లోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశించాలి. బంగాళాఖాతంలో అనుకూల పరిస్థితులు నెలకొనడంతో ఈనెల 15 తేదీకే దక్షిణ బంగాళాఖాతం, అండమాన్ సముద్రం, అండమాన్, నికోబార్ దీవుల్లోకి రుతుపవనాలు ప్రవేశిస్తాయని ప్రైవేటు వాతావరణ సంస్థ స్కైమెట్ తెలిపింది. వచ్చే రెండు, మూడు రోజుల్లో కేరళ, తమిళనాడు, కర్ణాటకల్లో రుతుపవన ముందస్తు వర్షాలు కురవనున్నాయని వాతావరణ నిపుణులు వెల్లడించారు. ఈ ఏడాది కేరళను ముందుగానే నైరుతి రుతుపవనాలు తాకే అవకాశం ఉందని అంచనా వేశారు. కాగా, రాష్ట్రంలో ఎక్కువచోట్ల గురువారం ఎండ తీవ్రత, ఉక్కపోత కొనసాగాయి. ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు, మూడు డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి. అత్యధికంగా నంద్యాల జిల్లా సంజామలలో 43.3 డిగ్రీలు, కర్నూలు జిల్లా కౌతాళంలో 42.9, అనంతపురం జిల్లా తెరన్నపల్లిలో 42.8, చిత్తూరు జిల్లా రాయలపేట, కడప జిల్లా జమ్మలమడుగులో 42.2,




ప్రకాశం జిల్లా కొప్పెరపాడులో 42 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. 17 జిల్లాల్లోని 126 మండలాల్లో 40 డిగ్రీలపైన ఉష్ణోగ్రత నమోదైంది. అక్కడక్కడ వర్షాలు పడ్డాయి. రానున్న రెండు, మూడు రోజుల్లో చెదురుమదురుగా వర్షాలు కురుస్తాయని, ఎక్కువ ప్రాంతాల్లో ఎండలు పెరిగి, వడగాడ్పులు వీస్తాయని వాతావరణ నిపుణుడొకరు తెలిపారు. శుక్రవారం 43-44 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయ్యే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. అల్లూరి, పోలవరం, కోనసీమ, తూర్పుగోదావరి, ఎన్టీఆర్, అనంతపురం జిల్లాల్లోని 20 మండలాల్లో వడగాడ్పుల ప్రభావం ఉంటుందని పేర్కొంది. అల్లూరి, పోలవరం, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, కడప జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపింది.



## 1250 మందికి 300 కోట్ల పరిహారం

**క్రైం కౌంటర్ న్యూస్ మే 15:** పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు రాష్ట్ర ప్రభుత్వం వరుసగా పరిహారాన్ని చెల్లిస్తోంది. 2024లో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక మూడు దఫాలుగా సంక్రాంతి, దీపావళి, ఉగాది పర్వదినాల్లో నిర్వాసిత కుటుంబాలకు పరిహారం చెల్లించింది. తాజాగా 600 కోట్ల పరిహారం చెల్లిస్తోంది. 14 గ్రామాలకు చెందిన 1250 మంది నిర్వాసితులకు రూ.300 కోట్లు, అలాగే వన్‌టైమ్ సెటిల్‌మెంట్(ఓటీఎస్) కింద 312 నిర్వాసిత కుటుంబాలకు మరో 300 కోట్లు అందజేయనుంది. శుక్రవారం వెలగపూడి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చెక్కులు అందజేయనున్నారు. 190 గిరిజన కుటుంబాలకు భూమికి భూమి పథకంలో పట్టాలు అందజేస్తారు. ఈ కార్యక్రమంలో మంత్రి నిమ్మల రామానాయుడు, జల వనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశిభూషణ్ కుమార్, ఆర్అండ్ఆర్ కమిషనర్ ప్రశాంతి, జల వనరుల శాఖ సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు, ఈఎన్‌సీ నరసింహమూర్తి తదితరులు పాల్గొంటారు. వచ్చే ఏడాది జూన్ నాటికి పోలవరం ప్రాజెక్టు తొలిదశ పూర్తికానున్న నేపథ్యంలో ఈలోపు 41.15 మీటర్ల కాంటూరులో 119 టీఎంసీల గోదావరి జలాలను నిల్వ చేసేలా ముంపు ప్రాంతాల కుటుంబాలకు సహాయ, పునరావాస కార్యక్రమాన్ని అమలు చేయాలని జల వనరుల శాఖ నిర్ణయించింది. వచ్చే ఏడాది మార్చి నాటికి సహాయ, పునరావాస కార్యక్రమాలను పూర్తి చేస్తామని ఇటీవల ఢిల్లీలో కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ కార్యదర్శి కాంతారావుకు పోలవరం సహాయ, పునరావాస కమిషనర్ ప్రశాంతి స్పష్టం చేశారు. సహాయ, పునరావాస కార్యక్రమాలకు కేంద్రం నిధులు మంజూరు చేయడంతో దాదాపు రూ.600 కోట్ల మేర పరిహారం చెల్లించేందుకు ప్రశాంతి జాబితాను సిద్ధం చేశారు.

# పేదలకు సేవ చేస్తున్న సంస్థకు అండగా నిలిచాం



క్రైం కౌంటర్ న్యూస్ మే 15: పేదలకు రూరల్ డెవల్‌పమెంట్ ట్రస్ట్ (ఆర్డీటీ) అందిస్తున్న సేవలు రాయలసీమ వరకే పరిమితం కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించాల్సిన అవసరం ఉందని టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి లోకేశ్ అన్నారు. శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లిలోని ఆర్డీటీ ఆస్పత్రిని ఆయన గురువారం సందర్శించారు. ఆ సంస్థ వ్యవస్థాపకుడు ఫాదర్ విన్సెంట్ పెర్రర్ ఘాట్ వద్ద నివాళులర్పించారు. విన్సెంట్ సతీమణి, ఆర్డీటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అన్నే ఫెర్రర్, తనయుడు, ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్, కూతురు యమున, ఆమె భర్త సంజీవ్‌తో మాట్లాడారు. ఆర్డీటీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులతో మంత్రి లోకేశ్ మాట్లాడారు. తలసేమియా బాధిత చిన్నారులను పరామర్శించారు.

పాదయాత్రలో కళ్లారా చూశా..

ఆర్డీటీ సేవల గురించి తాను గతంలో విన్నానని, యువగళం పాదయాత్ర సమయంలో కళ్లారా చూశానని లోకేశ్ మీడియాతో మాట్లాడుతూ చెప్పారు. ఆర్డీటీ పాఠశాలలో దివ్యాంగ పిల్లలను సొంతబిడ్డల్లా చూసుకుంటున్న దృశ్యాలను స్వయ ంగా చూశానన్నారు. నిరుపేదలకు వైద్యం, విద్య, గృహాలు, యువతకు క్రీడల్లో ప్రోత్సాహం వంటి ఎన్నో అద్భుత కార్యక్రమాలను ఫెర్రర్ కుటుంబం 52 ఏళ్ల నుంచి అందిస్తోందని కొనియాడారు. ఆర్డీటీ కష్టాలను ఎదుర్కొన్నపుడు ఆసంస్థకు అండగా నిలబడటం తమ బాధ్యత అని సీఎం చంద్రబాబుతోపాటు కూటమి నేతలంతా కలిసికట్టుగా నిలబడ్డామని వెల్లడించారు. సంస్థపై కేంద్ర ప్రభుత్వానికి ఉన్న కొన్ని అపోహలను తొలగించి, ఫారిన్ కంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ యాక్ట్ (ఎఫ్‌సీఆర్ఏ) లైసెన్సులు రెన్యువల్ చేయించి, అండగా నిలబడ్డామని తెలిపారు.

లోకేశ్‌కు కృతజ్ఞతలు: మాంఛో ఫెర్రర్

ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏను రెన్యువల్ చేయించేందుకు ప్రత్యేకంగా కృషి చేసిన మంత్రి లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామని ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్ అన్నారు. తాను లోకేశ్‌ను కలిసినప్పటి నుంచి తమ సంస్థకు అండగా నిలుస్తూ వచ్చారని ఆయన చెప్పారు.

# లెవల్-1 స్థాయిలో నాట్కో క్యాన్సర్ సెంటర్‌కు గుర్తింపు

క్రైం కౌంటర్ న్యూస్ మే 15:దేశంలోనే లెవల్-1 స్థాయి గుర్తింపు పొందిన అతి కొద్ది క్యాన్సర్ సెంటర్లలో ఒకటిగా గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రి నాట్కో క్యాన్సర్ సెంటర్ నిలిచిందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. గురువారం గుంటూరు జీజీహెచ్‌లోని నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో రూ.18 కోట్లతో ఏర్పాటు చేసిన పెట్ స్కాన్ (పాజిట్రాన్ ఎమిషన్ టోమోగ్రఫీ) యంత్రాన్ని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌తో కలసి మంత్రి సత్యకుమార్ ప్రారంభించారు. సత్యకుమార్ మాట్లాడుతూ పెట్ స్కాన్, లీనాక్, హెచ్ఏఆర్, సీటీ స్టిమ్యులేటర్, సీటీ, ఎంఆర్ఐ వంటి అత్యాధునిక పరికరాలతో పూర్తి స్థాయి క్యాన్సర్ చికిత్స కేంద్రంగా గుంటూరు జీజీహెచ్ ఎదిగిందని చెప్పారు. సీఎస్ఆర్ పథకం కింద ఓఎన్‌జీసీ కంపెనీ స్థానిక జీజీహెచ్‌కు రూ.30 కోట్లతో మరో లీనాక్ మెషిన్‌తో పాటు ఇతర పరికరాలు అందజేసేందుకు ఆమోదం తెలిపిందని పేర్కొన్నారు. క్యాన్సర్ వ్యాధి కట్టడికి దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో 4.10 కోట్ల మందికి ఓరల్, బ్రెస్ట్, సర్వైకల్ క్యాన్సర్ నిర్ధారణ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది అనంతపురం, కాకినాడ ప్రభుత్వాస్పత్రులను సమగ్ర క్యాన్సర్ సెంటర్లుగా అభివృద్ధి చేస్తున్నట్లు ప్రకటించారు.అభివృద్ధి పథంలో గుంటూరు జీజీహెచ్: పెమ్మసాని కూటమి ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్ల వ్యవధిలో గుంటూరు జీజీహెచ్‌లో రూ.140 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. ఈ నిధుల్లో రూ.71 కోట్లు సీఎస్ఆర్ ఫండ్ కాగా, రూ.51 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం, దాతలు అందజేసినట్లు తెలిపారు. జింకానాకు చెందిన ఎన్నారై వైద్యులు మరో రూ.100 కోట్లతో 600 పడకలతో తల్లీ పిల్లల ఆరోగ్య కేంద్రాన్ని జీజీహెచ్‌లో



నిర్మించినట్లు తెలిపారు. రెండేళ్లల్లో అదనంగా 800 పడకలు సమకూరాయని చెప్పారు. పెట్ స్కాన్, లీనాక్ మెషిన్‌లతో నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో ప్రపంచస్థాయి ప్రమాణాలతో వైద్యం అందుబాట్లోకి వచ్చిందన్నారు. ఎయిమ్స్‌తో సహా ఇతర ప్రభుత్వ రంగ వైద్యశాలల్లో పెట్ స్కాన్‌కు రూ.5 వేల నుంచి రూ.10 వేలు వరకు ఫీజు వసూలు చేస్తున్నా, గుంటూరు జీజీహెచ్‌లో మాత్రం పెట్‌స్కాన్ పరీక్షను ఉచితంగానే చేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్, ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, డీఎంఈ డాక్టర్ రాధిక రెడ్డి, నాట్కో వైస్ ప్రెసిడెంట్ (కార్పొరేట్ వ్యవహారాలు) నన్నపనేని సదాశివరావు, పాల్గొన్నారు.

# జిల్లాల్లో సివిల్ సర్వీసెస్ పోస్టుల వివరాలివ్వండి



క్రైం కౌంటర్ న్యూస్ మే 15: రాష్ట్రపతి జారీచేసిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగాల స్థానిక కేడర్ల నిర్వహణ, ప్రత్యక్ష నియామకాల నియంత్రణ ఉత్తర్వులు-2025 ప్రకారం.. వివిధ స్థానిక క్యాడర్లు, జిల్లాల్లో సివిల్ సర్వీసెస్, ప్రభుత్వ ఉద్యోగాల పోస్టులను విభజించడానికి ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. జిల్లా క్యాడర్, జోనల్ క్యాడర్, మల్టీజోనల్ క్యాడర్ కిందకు ఏయే పోస్టులు వస్తాయో వివరిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ గురువారం ఉత్తర్వులిచ్చారు. జిల్లాల్లో సివిల్ సర్వీసెస్ పోస్టుల వివరాలివ్వాలని కోరారు. ప్రభుత్వం అవసరమని భావిస్తే.. ఈ జీవో ప్రకారం విభజించిన ఏవైనా రెండు కేటగిరీలకు చెందిన పోస్టులను ఏ శాఖలోనైనా లేదా సంస్థలోనైనా.. రెండు లేదా అంతకంటే ఎక్కువ పక్కపక్కనే ఉన్న జిల్లాలు లేదా జోన్లను కలిపి ఒకే క్యాడర్‌గా నిర్వహించే అధికారం దానికి ఉంటుంది.

జిల్లా క్యాడర్ పరిధిలోకి వచ్చే పోస్టులు..

జూనియర్ అసిస్టెంట్, దానికి సమానమైన కేటగిరీలోని అన్ని పోస్టులు.. జూనియర్ అసిస్టెంట్ కంటే తక్కువ స్థాయిలోని అన్ని కేటగిరీల పోస్టులు.. జూనియర్ అసిస్టెంట్, అంతకంటే తక్కువ స్థాయి పోస్టుల వేతన స్కేలు లేదా నిర్ణీత వేతనం ఉన్న అన్ని పోస్టులు.. ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యాసబార్డినేట్ సర్వీసట?సలోని అన్ని కేటగిరీల పోస్టులు.. రాష్ట్ర ప్రభుత్వంలోని ఏ శాఖ పరిధిలోనైనా వీటికి సమానమైన ఉపాధ్యాయ పోస్టులు.. స్థానిక సంస్థలు, ఇతర యాజమాన్యాల పరిధిలో ఉంటూ, పైన పేర్కొన్న అంశంలోని సర్వీసులతో సమానమైన వేతన స్కేలు లేదా నిర్ణీత వేతనం కలిగిన అన్ని కేటగిరీల ఉపాధ్యాయ పోస్టులు.జోనల్ క్యాడర్ పరిధిలోకి వచ్చేవి..

జూనియర్ అసిస్టెంట్ కేటగిరీ కంటే పైన ఉండి.. సూపరింటెండెంట్ కేటగిరీ వరకు ఉండే అన్ని పోస్టులు, వాటికి సమానమైన అన్ని కేటగిరీల పోస్టులు.. ప్రతిశాఖలోని మొదటి స్థాయి గెజిటెడ్ పోస్టు కేటగిరీ, జూనియర్ అసిస్టెంట్ కంటే ఎక్కువ వేతన స్కేలు లేదా నిర్ణీత వేతనం కలిగి ఉన్న ప్రతిశాఖలోని సూపరింటెండెంట్ కేటగిరీ వరకు ఉన్న అన్ని పోస్టులు.. అలాగే మొదటిస్థాయి గెజిటెడ్ కేటగిరీకి సమానమైన వేతన స్కేలు లేదా నిర్ణీత వేతనం ఉన్న అన్ని పోస్టులు.

మల్టీజోనల్ క్యాడర్ పోస్టులు..: సూపరింటెండెంట్ కేటగిరీ కంటే పైన.. మొదటిస్థాయి గెజిటెడ్ పోస్టుల కేటగిరీ కంటే పైన ఉండి, డిప్యూటీ కలెక్టర్ కేటగిరీ వరకు ఉన్న అన్ని పోస్టులు.. అలాగే ఇతర శాఖల్లోనూ వీటికి సమానమైన అన్ని పోస్టులు.. సూపరింటెండెంట్ కంటే ఎక్కువ వేతన స్కేలు లేదా నిర్ణీత వేతనం కలిగి ఉండి, ప్రతి శాఖలోనూ రెండవ స్థాయి గెజిటెడ్ కేటగిరీల నుంచి డిప్యూటీ కలెక్టర్ల వేతన స్కేలు లేదా నిర్ణీత వేతనం ఉన్న అన్ని పోస్టులు.

# పోటీ పరీక్షల్లో అర్హత సాధిస్తేనే క్రీడా రిజర్వేషన్లు

క్రైం కౌంటర్ న్యూస్ మే 15: క్రీడాకారుల కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే 3 శాతం రిజర్వేషన్లలో కొన్ని సవరణలు చేసింది. ఈ మేరకు క్రీడాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ ఉద్యోగాల నియామకాల్లో అర్హత కలిగిన క్రీడాకారులు 3శాతం రిజర్వేషన్లు పొందాలంటే ఇకపై ఆయా శాఖల నియామక సంస్థలు నిర్వహించే అర్హత పరీక్షల్లో కచ్చితంగా అర్హత సాధించాల్సి ఉంటుంది.



# దేశంలోనే తొలి ఐదోతరం యుద్ధ విమానాల తయారీ ఇక్కడే

క్రైం కౌంటర్ న్యూస్ మే 15: అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ (ఏఎంసీఏ)... భారత్ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా అభివృద్ధి చేస్తున్న తొలి స్వదేశీ ఐదో తరం స్టెల్త్ ఫైటర్ జెట్ ఇది. దీన్ని డీఆర్‌డీవో ఆధ్వర్యంలోని ఏరోనాటికల్ స్పేస్ ఏజెన్సీ (ఏడీఏ) రూపొందిస్తోంది. శత్రువుల రాడార్లకు చిక్కకుండా, గగనతలంలో సంపూర్ణ ఆధిపత్యం చలాయించేలా దీన్ని తయారు చేస్తున్నారు. ఇలాంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు పుట్టపర్తిలో ఏర్పాటు కానుంది. రూ.15,803 కోట్ల పెట్టుబడితో ఏర్పాటవుతున్న ఈ భారీ ప్రాజెక్టుతో రాయలసీమ ఏరోస్పేస్ హబ్‌గా, భారత రక్షణ రంగానికి వెన్నెముకగా నిలిచే ఫైటర్ జెట్ల ఉత్పత్తి కేంద్రంగా శ్రీసత్యసాయి జిల్లా ఖ్యాతి గడించనున్నాయి. ముఖ్యంగా పుట్టపర్తి, పాలసముద్రం, మడకశిర ప్రాంతాలు రక్షణ రంగ ఉత్పత్తి కేంద్రాలవుతాయి. ఈ ప్రాజెక్టు ద్వారా 7500 మందికిపైగా ఉపాధి లభించనుంది. జిల్లాలో అనుబంధ పరిశ్రమలు ఏర్పాటవుతాయి.పుట్టపర్తిలోనే ఎందుకు..?

భారత్‌లో యుద్ధ విమానాల తయారీ కోసం ఇప్పటికే బెంగళూరు, హైదరాబాద్, నాసిక్‌లో కేంద్రాలున్నాయి. అయితే అక్కడ సుఖోయ్, తేజస్ వంటి ఫైటర్ జెట్లు తయారీ, మరమ్మతులు, విడిభాగాల తయారీ జరుగుతోంది. పుట్టపర్తిలో ఏర్పాటు చేస్తున్న కేంద్రంలో పూర్తిగా ఐదోతరం ఏఎంసీఏల తయారీ, అసెంబ్లింగ్, ఫ్లైట్ టెస్టింగ్ చేపడతారు. ఇక్కడ 140 ఏఎంసీఏలను తయారు చేస్తారు. ఇప్పటికే అందుబాటులో ఉన్న రన్‌వే, ఈ కేంద్రం బెంగళూరుకు సమీపంలో ఉండడం, ఎయిర్ ట్రాఫిక్ రద్దీ లేని అనుకూల వాతావరణం.. వంటివన్నీ పుట్టపర్తిని ఎంచుకోవడానికి ప్రధాన కారణం. అలాగే సమీపంలోని బెంగళూరులోనే ఏరోనాటికల్ డెవల్‌పమెంట్ ఏజెన్సీ (ఏడీఏ) డిజైన్, సాంకేతిక వ్యవస్థలకు కేంద్రంగా ఉంది. పుట్టపర్తి ఇక్కడకు దగ్గరగా ఉండడం వల్ల ఇరు కేంద్రాల మధ్య సమన్వయం, రవాణా సులభంగా ఉంటుంది. ఇప్పటికే ఇక్కడ ఉన్న రన్‌వేను 10వేల అడుగులకు పొడిగించడంతోపాటు ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్, నావిగేషన్ వ్యవస్థలు ఏర్పాటు చేయడానికి 600 ఎకరాలకుపైగా భూమి అందుబాటులో ఉంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా రక్షణ రంగానికి అత్యంత ప్రాధాన్యతనిస్తోంది. ఈ ప్రాజెక్టు ఏర్పాటు ద్వారా ఇక్కడ దాదాపు లక్ష కోట్ల పెట్టుబడులు, విడిభాగాల తయారీ యూనిట్లు వస్తాయని, తద్వారా స్థానికంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని భావిస్తోంది.

లోపలి ఆయుధాలు..

ఏఎంసీఏలో ఇంటర్నల్ వెపన్స్ బే ఉంటుంది. దీనిలో 1..5 టన్నుల బరువైన ఆయుధాలను అమర్చవచ్చు. వీటిలో స్వదేశీ, లాంగ్ రేంజ్ బియాండ్ విజువల్ రేంజ్ ఎయిర్ టు ఎయిర్ మిస్సైల్స్ అయిన అస్త్ర మార్క్-2, మార్క్-3, సుదూర లక్ష్యాలను ఛేదించే క్రూయిజ్ క్షిపణులు, శత్రువుల ఎయిర్‌ఫీల్డ్‌లను ధ్వంసం చేయడానికి ఉపయోగించే స్వదేశీ బాంబులు, అత్యంత కచ్చితత్వంతో లక్ష్యాలను ఛేదించే లేజర్ గైడెడ్ బాంబులు ఉంటాయి.

వెలుపలి ఆయుధాలు

స్టెల్త్ అవసరం లేని మిషన్ల కోసం విమానం వెలుపల 5.5 టన్నుల బరువున్న ఆయుధాలను అమర్చవచ్చు. వీటిలో బ్రహ్మోస్ తర్వాతి తరం సూపర్ సోనిక్ క్రూయిజ్ క్షిపణులు, స్వల్ప లక్ష్యాలను ఛేదించేందుకు అస్త్ర-ఎంకే1 క్షిపణులు, క్లస్టర్ బాంబులు, 30 ఎంఎం ఆటోక్యానన్ గన్ ఉంటాయి. అలాగే ఏఎంసీఏలో ఆయుధాలతోపాటు.. అవసరాన్ని బట్టి అదనపు ఇంధన ట్యాంకులను కూడా నిల్వ చేసుకోవచ్చు. దీనివల్ల విమానం ఎక్కువ దూరం ప్రయాణించే అవకాశం ఉంటుంది. ఆయుధాల ఎంపిక, ప్రయోగానికి ఏఐ ఆధారిత వ్యవస్థలు కూడా ఏర్పాటు చేయనున్నారు.

ప్రస్తుతం ఏ దశలో ఉంది

ఏఎంసీఏ ప్రాజెక్టు కోసం కేంద్ర ప్రభుత్వం రూ.15,803 కోట్లు అందిస్తుంది. ప్రస్తుతం ఈ ప్రాజెక్టు ప్రొటోటైప్ (నమూనా) తయారీ దశలో ఉంది. 2028-29 నాటికి తొలి ప్రొటోటై?పకు పరీక్షలు పూర్తిచేసి.. 2032 నాటికి పూర్తిస్థాయిలో ఉత్పత్తిని ప్రారంభించాలని, 2035 నాటికి భారత వైమానిక దళంలోకి ప్రవేశపెట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

ఏఎంసీఏలో ఆయుధాలివే..!

అత్యాధునిక స్వదేశీ, విదేశీ ఆయుధాలను మోసుకెళ్లగలిగేలా ఏఎంసీఏను రూపొందిస్తున్నారు. ఇది స్టెల్త్ ఫైటర్ జెట్ కావడం వల్ల శత్రువుల రాడార్లకు చిక్కకుండా ఉండేందుకు విమానం లోపల ఆయుధాలను అమర్చుతారు. అలాగే స్టెల్త్ అవసరం లేని మిషన్ల కోసం విమానం వెలుపల కూడా ఆయుధాలు అమర్చుకునేలా దీన్ని డిజైన్ చేస్తున్నారు.

మ్యాన్డ్-అన్‌మ్యాన్డ్ టీమింగ్

ఏఎంసీఏ అనేది ఒక హైబ్రిడ్ యుద్ధ విమానం. దీనిలో మ్యాన్డ్-అన్‌మ్యాన్డ్ టీమింగ్ (ఎంయూఎంటీ) అనే వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు. అంటే మానవ సహిత, మానవ రహిత యుద్ధ విమానాల సమ్మేళనం. ప్రధాన ఫైటర్ జెట్‌ను పైలట్ నడుపుతాడు కాబట్టి దీన్ని మానవ సహిత యుద్ధ విమానం... అలాగే దీనిలో కొన్ని డ్రోన్లు కూడా ఉంటాయి కాబట్టి మానవ రహిత యుద్ధ విమానంగా పనిచేస్తుంది. మ్యాన్డ్-అన్‌మ్యాన్డ్ టీమింగ్ వ్యవస్థలో కృత్రిమ మేధ కీలక పాత్ర పోషిస్తుంది. దీనిలోని ఏఐ ఆధారిత డ్రోన్లు.. పైలట్ నడిపే ఏఎంసీఏకు నమ్మకమైన భాగస్వామిగా పనిచేస్తాయి. ఈ డ్రోన్లు స్వయంప్రతిపత్తిగా పనిచేస్తాయి కానీ.. అవసరమైనప్పుడు పైలట్ ఆదేశాలను పాటిస్తాయి. యుద్ధ సమయంలో ముందుగా ఈ డ్రోన్లు సేకరించిన సమాచారాన్ని ఏఎంసీఏలోని ఏఐ సాంకేతికత విశ్లేషించి పైలట్‌కు యుద్ధ రగం గురించి స్పష్టమైన అవగాహన కల్పిస్తుంది. శత్రు దేశాల రక్షణ వ్యవస్థలను ఛేదించడం కోసం భారత్ అభివృద్ధి చేస్తున్న ఆధునిక యుద్ధ వ్యూహమిది.

ఏఎంసీఏ.. ఎందుకంత ప్రత్యేకం..?

శత్రువుల రాడార్లు, ఇన్‌ఫ్రారెడ్ సెన్సర్లు, ఇతర నిఘా వ్యవస్థలకు చిక్కకుండా ఉండేందుకు దీన్ని ప్రత్యేకంగా డిజైన్ చేస్తున్నారు. దీంతో ఇవి శత్రువుల భూభాగంలోకి చొచ్చుకెళ్లి సులభంగా దాడి చేసి రాగలవు. ఆయుధాలు బయటకు కనిపించకుండా దీన్ని ప్రత్యేకంగా డిజైన్ చేయనున్నారు. అంటే శత్రువులకు కనిపించకుండా ఉండేందుకు బాంబులు, క్షిపణులను యుద్ధ విమానం లోపల ప్రత్యేకంగా అమర్చుతారు. దీంతో శత్రు రాడార్లు వీటిని కనిపెట్టలేవు. అలాగే గాలి నిరోధకత తగ్గి జెట్ వేగం పెరుగుతుంది. అమెరికాకు చెందిన ఎఫ్-35, ఎఫ్-22, చైనాకు చెందిన జే-35 వంటి ఫైటర్ జెట్లలో ఇలాంటి సౌలభ్యమే ఉంది. దీనిలో ట్విన్ ఇంజన్లు ఉంటాయి. ప్రారంభంలో తయారు చేసే ఎంకే1 వేరియంట్లలో అమెరికాకు చెందిన జీఈ-414 ఇంజన్లను.. ఈ తర్వాత రాబోయే ఎంకే2 మోడల్స్‌లో పూర్తి స్వదేశీ/విదేశీ భాగస్వామ్యంతో కూడిన ఇంజన్లను ఉపయోగిస్తారు.

సూపర్ క్రూయిజ్ సామర్థ్యం..

ఇది ఆఫ్టర్‌బర్నర్‌ను ఉపయోగించకుండానే (ఇంధనాన్ని ఎక్కువగా ఖర్చు చేయకుండా) శబ్ద వేగం కంటే ఎక్కువ వేగం (మాక్ 2.15 లేదా గంటకు 2,600 కి.మీ.)తో ప్రయాణిస్తుంది. దీనిలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత వ్యవస్థలు, ఏఈఎస్ఏ (యాక్టివ్ ఎలక్ట్రనికల్లీ స్కాన్‌డ్ ఎరే) రాడార్లు, స్మార్ట్ సెన్సర్ ఫ్యూజన్లు వంటి అధునాతన ఫీచర్లు ఉంటాయి. ఈ మల్టీరోల్ ఫైటర్ జెట్ 25 టన్నుల బరువు ఉంటుంది. దీని పోరాట పరిధి దాదాపు 1630 కిలోమీటర్లు.

# సినిమా



## 'హీరో అచ్యుత్ నా చేతుల్లోనే చనిపోయాడు'.

సినిమా ఇండస్ట్రీకి సంబంధించి చాలా మంది నటీనటులు చిన్న వయసులోనే ప్రాణాలు కోల్పోయారు. సినిమా కెరీర్ ఫుల్ స్పీడ్ గా ఉంటున్న సమయంలోనే హఠాన్మరణం చెందారు. అలాంటి వారిలో అచ్యుత్ ఒకరు. ఈ నటుడి గురించి ఈతరం ఆడియెన్స్ కు పెద్దగా తెలియకపోవచ్చు కానీ 1990-2000 జనరేషన్ ఆడియెన్స్ కు ఇతను ఫేవరెట్ యాక్టర్. హీరోగా పెద్దగా సినిమాలు చేయకున్నా అంతకు మించిన అభిమానమే సొంతం చేసుకున్నాడు. చాలా సినిమాల్లో హీరోలు, హీరోయిన్లకు నటించాడు అచ్యుత్. చిరంజీవి, పవన్ కల్యాణ్, బాలకృష్ణ తదితర స్టార్ హీరోలతో స్క్రీన్ షేర్ చేసుకున్నాడు. పవన్ తమ్ముడు, చిరంజీవి బావగారు బాగున్నారా, బాలకృష్ణ నరసింహా నాయుడు, వెంకటేష్ కలిసుందాం రా, మహేష్ బాబు మురారి, డాడీ, వాసు వంటి సినిమాలు అచ్యుత్ కు మంచి గుర్తింపు తీసుకొచ్చాయి. కేవలం సినిమాల్లోనే కాదు బుల్లితెరపైనా సత్తా చాటారు అచ్యుత్. అన్వేషితలాంటి సూపర్ హిట్ సీరియల్స్ లో నటించి మెప్పించాడు. ఇలా చాలా ఏళ్ల పాటు తన నటనతో ఆడియెన్స్ ను అలరించిన అచ్యుత్ 2002లో హఠాత్తుగా కన్నుమూశాడు. అప్పటికి అతనికి కేవలం 42 ఏళ్లు మాత్రమే.చాలా మంది లాగే అచ్యుత్ మరణంపై రకరకాల పుకార్లు వచ్చాయి. సినిమాల్లో సంపాదించిందంతా బిజినెస్ లో పెట్టాడని, అక్కడ పూర్తిగా నష్టాలొచ్చాయని, నమ్ముకున్న స్నేహితులే దాన్ని నట్టేటా ముంచడంతో అచ్యుత్ అప్పుల పాలయ్యాడని ప్రచారం జరిగింది. ఈ క్రమంలోనే తీవ్ర మానసిక ఒత్తిడికి లోనై అచ్యుత్ గుండెపోటుతో చనిపోయాడని కొందరు టీవీ నటులు చెబుతుంటారు. అయితే ఇదే విషయంపై అచ్యుత్ ప్రాణ స్నేహితుడు, నటుడు ఎఫ్2 ఫేమ్ ప్రదీప్ కొన్ని సంచలన విషయాలు చెప్పారు.

ఆరోజు ఫోన్ చేసి..

'అచ్యుత్ మరణాన్ని నేను దగ్గరుండి చూసాను. అతను నా చేతుల్లోనే చనిపోయాడు. అచ్యుత్ చనిపోయే ముందు రోజు కూడా నేను మాట్లాడాను. షూటింగ్ ఉంది అన్నయ్య వెళ్తున్నాను అన్నాడు. ఆ సమయంలో వాడు మాట్లాడేటప్పుడు ఆయాస పడడం నేను గమనించాను. ఏమైందిరా అంత బాగానే ఉందా అంటే, అంతా బాగానే ఉంది అన్నాడు. కానీ వాడి శరీరం లో బాగా కొలెస్ట్రాల్ పేరుకుపోయింది. దాని వల్ల పక్క రోజే గుండెపోటు వచ్చింది. అచ్యుత్ చాలా మంచి వాడు. అందరితోనే బాగా కలిసిపోయేవాడు. దేని మీద పెద్దగా ఆశ ఉండేది కాదు. కానీ తిండి మాత్రం బాగా తినేవాడు' అని చెప్పుకొచ్చారు ప్రదీప్.



# పచ్చ యాలకులు, నల్ల యాలకులు..

భారతీయ వంటకాల్లో మసాలా దినుసులకు ఎంతో ప్రాధాన్యత ఉంది. అందులోనూ 'యాలకులు' అనగానే మనకు వెంటనే నోరూరించే స్వీట్లు, ఘుమఘుమలాడే బిర్యానీలు గుర్తుకు వస్తాయి. ఆహారానికి మంచి ఫ్లేవర్‌ను ఇవ్వడంలో యాలకులను మించిన సుగంధ ద్రవ్యం మరొకటి లేదు. అయితే యాలకుల్లో మనం ప్రధానంగా రెండు రకాలను చూస్తుంటాం. ఒకటి లేత ఆకుపచ్చ రంగులో ఉండే చిన్న యాలకులు మరొకటి నలుపు లేదా ముదురు గోధుమ రంగులో ఉండే పెద్ద యాలకులు ఈ రెండూ యాలకుల జాతికే చెందినప్పటికీ, వీటి రుచులు, గుణాలు ఆరోగ్య ప్రయోజనాల్లో చాలా వ్యత్యాసం ఉంటుంది. ఆ తేడాలు ఏమిటో ఇప్పుడు వివరంగా చూద్దాం.

రంగు పరిమాణంలో తేడాలు: పచ్చ యాలకులు పరిమాణంలో చాలా చిన్నవిగా, ఆకుపచ్చ రంగులో అందంగా ఉంటాయి. వీటి పైపొర చాలా పలుచగా ఉంటుంది, లోపల చిన్న చిన్న నల్లని గింజలు ఉంటాయి. నల్ల యాలకులు అలా కాదు, ఇవి పరిమాణంలో కాస్త పెద్దవిగా, లావుగా ఉంటాయి. ఇవి ముదురు గోధుమ రంగు లేదా నలుపు రంగులో ఉండి, చాలా గరుకైన మందపాటి పైపొరను కలిగి ఉంటాయి.

రుచి, సువాసనలో వ్యత్యాసం: పచ్చ యాలకుల రుచి కొద్దిగా తీపిగా ఉండి, ఘాటైన మనసుకు ఆహ్లాదాన్నిచ్చే సుగంధభరితమైన వాసనను వెదజల్లుతాయి. కానీ నల్ల యాలకులు కొంచెం ఘాటుగా, ఒక విధమైన పొగ వాసనతో కూడిన గాఢమైన సువాసనను కలిగి ఉంటాయి. వంటకాల్లో వీటి వాడకం ఎలా ఉంటుంది?: పచ్చ యాలకులను సాధారణంగా తీపి పదార్థాలలో (స్వీట్స్) ఎక్కువగా ఉపయోగిస్తారు. పాయసం, ఖీర్, హల్వా, రకరకాల మిఠాయిలు, అలాగే ప్రతిరోజూ తాగే టీ పాలలో మంచి ఫ్లేవర్ కోసం వీటిని వాడుతారు. ఇవి ఆహారానికి అద్భుతమైన సువాసనను,





కొద్దిపాటి తీపిని అందిస్తాయి. మరోవైపు నల్ల యాలకులను మసాలా వంటకాల్లో, ఘాటైన రుచి అవసరమైన కూరల్లో వాడుతారు. బిర్యానీ, పులావ్, దాల్ మఖానీ, నాన్-వెజ్ కూరలు గ్రేవీ కర్రీలలో వీటికి మొదటి ప్రాధాన్యత ఇస్తారు. ఇది వంటకాలకు చాలా విలక్షణమైన మసాలా రుచిని ఇస్తుంది.

ఆరోగ్య ప్రయోజనాలు ఔషధ గుణాలు: చిన్న యాలకులు (పచ్చ యాలకులు) జీర్ణక్రియను మెరుగుపరచడంలో అద్భుతంగా పనిచేస్తాయి. భోజనం తర్వాత వీటిని నమలడం వల్ల నోటి దుర్వాసన పోయి, ఇది ఒక మంచి న్యాచురల్ మౌత్ ఫ్రెషనర్‌గా ఉపయోగపడుతుంది. జలుబు, వికారం నుండి ఉపశమనం కలిగించడంలో కూడా ఇవి సాయపడతాయి. ఇక పెద్ద యాలకుల (నల్ల యాలకులు) విషయానికి వస్తే, ఇవి కూడా జీర్ణ వ్యవస్థను చురుకుగా ఉంచుతాయి. ముఖ్యంగా వీటిలోని వేడి చేసే గుణాలు జలుబు, దగ్గు, గొంతు నొప్పి లేదా గొంతులో గరగర వంటి సమస్యల నుండి వేగంగా ఉపశమనం కలిగిస్తాయి. శ్వాసకోశ సమస్యలకు ఇవి చాలా మేలు చేస్తాయని ఆయుర్వేదం చెబుతోంది.

ధర, లభ్యతలో తేడా: పచ్చ యాలకుల సాగు ఉత్పత్తికి ప్రత్యేక వాతావరణం అవసరం. వాటి ఉత్పత్తి పరిమితంగా ఉంటుంది కాబట్టి, పచ్చ యాలకులు మార్కెట్లో ఎప్పుడూ కాస్త ఖరీదైనవిగానే ఉంటాయి. నల్ల యాలకులు వాటితో పోలిస్తే కొద్దిగా తక్కువ ధరకు లభిస్తాయి. కాబట్టి వీటిని గరం మసాలా ప్యాకెట్లలో విరివిగా ఉపయోగిస్తుంటారు.

ఈ రెండింటిలో ఏది ఉత్తమం?: నిజానికి, ఈ రెండు రకాల యాలకులకు వేర్వేరు ప్రత్యేకతలు, ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. తీపి వంటకాలకు పచ్చ యాలకులు ప్రాణం పోస్తే, మసాలా వంటకాలకు నల్ల యాలకులు రుచిని అమాంతం పెంచుతాయి. ఆరోగ్య పరంగా చూస్తే రెండూ అద్భుతమైనవే. కాబట్టి ఈ రెండింటినీ ఒకదానితో ఒకటి పోల్చలేము. మనం చేసుకునే వంటకాన్ని బట్టి వంటగదిలో ఈ రెండింటికీ సమప్రాధాన్యం ఇవ్వడం ఉత్తమం.

# మందార టీతో ఎన్నో లాభాలు

ఇంటర్నెట్ డెస్క్: వేసవిలో అధిక వేడి, చెమటలు, అలసట కారణంగా చాలా మంది ఒత్తిడి, చిరాకు, తలనొప్పి, జీర్ణ సమస్యలతో ఇబ్బంది పడుతుంటారు. అలాంటి సమయంలో సహజసిద్ధమైన చల్లదనాన్ని ఇచ్చే పానీయాలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ఈ క్రమంలో మందార టీ ఆరోగ్యానికి మేలు చేసే మంచి ఎంపికగా మారింది. ఆయుర్వేదంలో కూడా మందారాన్ని ఔషధ గుణాలున్న మొక్కగా భావిస్తారు. ఎర్ర మందార పువ్వులతో చేసే ఈ టీ శరీరాన్ని తేలికగా ఉంచి, వేసవి వేడి వల్ల కలిగే అసౌకర్యాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది.ఒత్తిడి, అలసట తగ్గింపు

వేసవిలో శరీరం త్వరగా అలసిపోవడం సాధారణం. మానసిక ఒత్తిడి కూడా పెరుగుతుంది. మందార టీ తాగితే మనసుకు ప్రశాంతత లభించి, శరీరానికి రిలాక్స్ కలుగుతుందని చెబుతున్నారు. దీని తేలికపాటి సువాసన, రుచి మూడ్‌ను ఫ్రెష్‌గా ఉంచడంలో సహాయపడతాయి.

రక్తపోటు, గుండె ఆరోగ్యానికి మేలు

అధిక రక్తపోటుతో బాధపడేవారికి మందార టీ ఉపయోగకరమని నిపుణులు చెబుతున్నారు. ఇది రక్తనాళాలను సడలించి రక్తప్రసరణను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. అలాగే ఇందులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి గుండె ఆరోగ్యాన్ని కాపాడటంలో సహాయపడతాయి.

బరువు తగ్గించడంలో ఉపయోగం

బరువు తగ్గాలని ప్రయత్నిస్తున్నవారికి కూడా మందార టీ మంచి ఎంపికగా భావిస్తున్నారు. ఇది శరీర జీవక్రియను మెరుగుపరచి, అదనపు నీరు, ఉప్పును బయటకు పంపడంలో సహాయపడుతుంది. కేలరీలు తక్కువగా ఉండటంతో డైట్ ఫాలో అయ్యేవారు కూడా దీన్ని తీసుకోవచ్చు.

మధుమేహం, రోగనిరోధక శక్తికి మద్దతు

కొన్ని అధ్యయనాల ప్రకారం మందార టీ ఇన్సులిన్ స్పందనను మెరుగుపరచడంలో



సహాయపడవచ్చని చెబుతున్నారు. అలాగే రోగనిరోధక శక్తిని పెంచి, కాలేయ ఆరోగ్యానికి కూడా మేలు చేస్తుందని నమ్మకం ఉంది.

మందార టీ తయారీ విధానం

ఎండిన మందార పువ్వులను వేడి నీటిలో 5 నుంచి 7 నిమిషాల పాటు నానబెట్టాలి లేదా మరిగించాలి. తర్వాత వడకట్టి తాగాలి. రుచికోసం తేనె లేదా కొద్దిగా నిమ్మరసం కలుపుకోవచ్చు. అయితే ఏదైనా మూలికా పానీయాన్ని తరచుగా తీసుకునే ముందు ఆరోగ్య నిపుణుల సలహా తీసుకోవడం మంచిది. ముఖ్యంగా గర్భిణీలు, తక్కువ రక్తపోటు ఉన్నవారు జాగ్రత్తగా ఉండాలి.

# నా విలువేంటో నిరూపించుకోవాల్సిన అవసరం లేదు

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు నిర్వహించిన తాజా కార్యక్రమంలో విరాట్ కోహ్లీ తన భవిష్యత్తు ప్రణాళికలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. 2027 వన్డే ప్రపంచకప్‌లో ఆడతారా అన్న ప్రశ్నకు సమాధానమిస్తూ, తాను ఎవరికీ ఏమీ నిరూపించుకోవాల్సిన పనిలేదని పేర్కొన్నాడు. ఆట కోసం తాను పడే కష్టం, తన సన్నద్ధత ఎప్పుడూ అత్యున్నత స్థాయిలోనే ఉంటాయని, ఒకవేళ తన విలువను నిరూపించుకోవాలని ఎవరైనా ఒత్తిడి చేస్తే, ఆ ప్రదేశం తనకు సరైనది కాదని కోహ్లీ అభిప్రాయపడ్డాడు.కష్టపడటమే నా నైజం..

"నేను జట్టులో భాగమైనప్పుడు నా వల్ల జట్టుకు ప్రయోజనం ఉండాలి. అలాగే నా సేవలను జట్టు కూడా గుర్తించాలి. నా శ్రమను, అంకితభావాన్ని శంకించి, పదే పదే నన్ను నిరూపించుకోమంటే నేను అక్కడ ఉండలేను. ఎందుకంటే నా సన్నద్ధత విషయంలో నేను చాలా నిజాయితీగా ఉంటాను. మైదానంలోకి అడుగుపెట్టిన ప్రతిసారి నా సర్వస్వాన్ని ధారపోస్తాను. జట్టు కోసం 40 ఓవర్ల పాటు బౌండరీల వద్ద పరుగెత్తమన్నా నేను సిద్ధమే. 50 ఓవర్ల పాటు ప్రతి బంతిని నా కెరీర్ లో చివరి బంతిగా భావించి ఆడతాను" అని విరాట్ భావోద్వేగంగా మాట్లాడాడు.

చిన్నపిల్లాడిలా మారిన కోహ్లీ..

ఇటీవల విజయ్ హజారే ట్రోఫీలో ఢిల్లీ తరపున ఆడిన అనుభవాలను కోహ్లీ పంచుకున్నాడు. రెండు దశాబ్దాల తర్వాత ఈ టోర్నీలో ఆడుతున్నప్పుడు తనకు మళ్లీ చిన్నపిల్లాడిలా అనిపించిందని చెప్పుకొచ్చాడు. "అక్కడ ఎవరూ లేరు, కానీ నేను బ్యాటింగ్ చేయడాన్ని ఇష్టపడతాను కాబట్టి ఆడాను. కేవలం ఆటపై ఉన్న మక్కువతోనే



నేను మైదానంలోకి దిగాను. ఇతరులు ఏమనుకుంటున్నారనేది నాకు అనవసరం. పారదర్శకత లేని చోట నేను ఇమడలేను" అని కోహ్లీ వివరించాడు.నిత్యం సిద్ధంగానే ఉంటా.. తన ఫిట్‌నెస్, జీవనశైలి గురించి చెబుతూ, తానూ ఏదో ఒక సిరీస్ కోసం ప్రత్యేకంగా కష్టపడనని, ఏడాది పొడవునా ఒకే క్రమశిక్షణతో ఉంటానని తెలిపాడు.

Published by katikala Vara Prasad. Owned by katikala Vara Prasad. Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006.published at HNo:21-119 west ibrahimpatnam,krishna andhrapradesh 521456Editor. Katikala Vara Prasad.RNI APTEL/25/A2844. Ph:9849707349 . email:kvp6858@gmail.com.